The Real Personality Development Magazine

# యుగశక్తి గాయత్రి

వ్యయ చైత్రం, ఏప్రిల్ - 2006

రూ. 8-00



సమర్థ రామదాసు, ఛత్రపతి శివాజీ








# మదురై అశ్వమేధ యజ్ఞం దృశ్యాలు





ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ప్రఖర ప్రజ్ఞ

ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహః

సజల శ్రద్ధ



**సంకల్పం**

**సంరక్షణ**

వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత

**శ్రీరామ శర్మ ఆచార్య**

శక్తి స్వరూపిణి

**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు

**డాక్టర్ ప్రణవ్ పండ్యా**

సంపాదకులు

**కందర్ప రామచంద్ర రావు**

**సంపుటి 7**

**సంచిక 1**

ఏప్రిల్ 2006

వ్యయ చైత్రం

**విడిప్రతి రూ॥ 8.00**

**సం॥ చందా రూ॥ 85**

**3సం॥ చందా రూ॥ 250**

**10 సం॥ చందా రూ॥ 750**

సలహాలు, సూచనలకు:

**శ్రీ అశ్వినీ సుబ్బారావు - 09848043256**


## జ్ఞాన ప్రాప్తి

జ్ఞానాన్ని పొందాలనే కోరిక పలువురికి ఉంటుంది. అయితే జ్ఞానం బహుకొద్దిమందికే లభిస్తుంది. అసలు జ్ఞానం రెండు విధాలు. ఒక జ్ఞానం సమాచార సేకరణ, బుద్ధిపరమైనది. రెండవ జ్ఞానం ప్రత్యక్ష అనుభూతి, సజీవంగా అనుభవించడం. ఒకటి మరణించిన వాస్తవాలను ప్రోగుచేయడం. రెండవది సజీవమైన సత్యం యొక్క సాక్షాత్కారం. ఈ రెంటికీ మధ్య ఎంతో తేడా ఉంది. ఆకాశానికీ, పాతాళానికీ ఉన్నంత. చీకటికీ వెలుగుకూ ఉన్నంత. వాస్తవానికి బుద్ధిపరమైన జ్ఞానం జ్ఞానమే కాదు. జ్ఞానం యొక్క నీడ అది. గ్రుడ్డివానికి కనిపించే వెలుగు అది.

నిజమైన జ్ఞానం బయటనుండి రాదు, లోపలనుండి ఉబికివస్తుంది. దాన్ని నేర్చుకోము, త్రవ్వుకుంటాము. నేర్చుకున్న జ్ఞానం సమాచారం. త్రవ్వుకున్న జ్ఞానం అనుభూతి. నేర్చుకున్న జ్ఞానానికి అనుగుణంగా జీవితాన్ని బలవంతాన మలచవలసి వస్తుంది. అయినా జీవితం ఆ జ్ఞానం ప్రకారం పూర్తిగా మారదు. ఆ జ్ఞానానికీ జీవితానికీ మధ్య ఆంతరిక వైరుధ్యం ఎపుడూ మిగిలే ఉంటుంది. మరోప్రక్క - త్రవ్వుకున్న జ్ఞానం వెలికి రాగానే ఆచరణ సహజసిద్ధంగా అందుకు అనుగుణం అయిపోతుంది. నిజమైన జ్ఞానానికి విరుద్ధంగా జీవితం ఉండడం అసంభవం.

శ్రీరామకృష్ణ పరమహంస తమ శిష్యులకు ఒక కథ చెప్పేవారు: ఇద్దరు మునులు ఒక కారడవిలో వెళుతున్నారు. ప్రాపంచిక సంబంధాల ప్రకారం వారు తండ్రీ కొడుకులు. కొడుకు ముందు నడుస్తున్నాడు. తండ్రి వెనుక నడుస్తున్నాడు. ఇంతలో సింహ గర్జన వినవచ్చింది. బ్రహ్మజ్ఞానం గురించి మాట్లాడుతూన్న తండ్రి గాబరాపడ్డాడు. 'వెళ్లి చెట్టు ఎక్కు. ముందు ప్రమాదం ఉంది' - అన్నాడు కొడుకుతో. కొడుకు నవ్వాడు. 'శరీరం క్షణభంగురమనీ, ఆత్మ అమరమనీ, సాక్షి అనీ, ద్రష్ట అనీ మీరు చెపుతూవచ్చారు కదా. మరి ప్రమాదం ఎవరికి? క్షణికం అయినది ఎలాగూ నశించేదే. అమరం అయినదానిని ఎవరూ చంపలేరు'- అని అతడు జవాబిచ్చాడు. కానీ, తండ్రి ముఖం భయంతో మ్లానమయింది. అప్పటికే అతడు చెట్టు ఎక్కాడు. ఇక్కడ సింహం కొడుకుమీదకు దూకింది. కానీ, అతడు నవ్వుతూనే ఉన్నాడు. మరణ సమయంలో కూడ అతడు ద్రష్టగా నిలిచాడు. అతడికి దుఃఖమూ లేదు, బాధా లేదు. ఎందుకంటే - అతడికి జ్ఞానం సిద్ధించింది. మరో ప్రక్క అతని తండ్రియొక్క బ్రహ్మజ్ఞానం వట్టి నీడ మాత్రమే.

కనుకనే - జ్ఞాన ప్రాప్తి బహు అరుదు.

★★★

కార్య సంయమనం, వాక్ సంయమనం, ఇంద్రియ సంయమనం కలిగినవాడే మనిషి - మృచ్ఛకటికం.

## సద్గురు వచనామృతం

### ఏది కర్మ, ఏది బూటకం?



*పనిని ప్రారంభించకుండా ఉన్నంత మాత్రాన వ్యక్తి నిష్కర్మ స్థితిని (కర్మ లేని స్థితిని) పొందదు. శరీరం పని చేయకపోతే ప్రయోజనం ఏమిటి? బంధనానికీ, మోక్షానికీ కారణం మనస్సు. మనస్సును పనిచేయకుండా చేయాలి. మనస్సును నిష్క్రియం చేయాలంటే – కర్మలో, కర్మఫలంలో ఆసక్తిని వదులుకోవాలి.*

*బద్ధకించి కూర్చోవద్దు. ఫలితంలో నీకు అధికారమే లేదు. ఉద్యమించినా ఫలితం రావడం ఖాయం కాదు. ఫలితం వచ్చినా, అది ప్రారబ్ధంవల్ల వస్తుంది, ఉద్యమించడం అందుకు కారణం కాదు – అని భావించి ఉద్యమించడాన్నే వదులుకోవద్దు. కర్మ చేయడం నీ కర్తవ్యం. కనుక నీవు తప్పకుండా కర్మ చేయవలసిందే. ఎందుకంటే – నీవు కర్మను వదులుకోలేవు. కర్మచేయడం నీకు తప్పనిసరి.*

***న కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్యకర్మకృత్ ।***
***కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతి జైర్గుణైః ॥***

*పుట్టిన ఏ ప్రాణి అయినా కర్మ చేయకుండా ఒక్క క్షణమైనా ఉండలేదు. ప్రకృతియొక్క గుణములవల్ల తప్పనిసరి అయి గుణాలద్వారా అతడిచేత కర్మ చేయించబడుతుంది.*

*ఈ విధంగా అందరూ అనుక్షణం కర్మ చేస్తూనే ఉంటారు. మనం ఇంద్రియాలను అడ్డగించి అవి కర్మ చేయకుండా చేయవచ్చు. కానీ, మనస్సు మన మాట వినదు. దాని చంచలత్వం కొనసాగుతూనే ఉంటుంది. అయినా – ఇలా ఇంద్రియాలతో కర్మ చేయకపోవడం మంచిది కాదు కూడా.*

*కర్మ చేయకుండా ఇంద్రియాలను అడ్డగించి, మనస్సుతో ఇంద్రియ విషయాలను చింతన చేసే మూర్ఖుడు కపటి అవుతాడు, బూటకం చేసేవాడు అవుతాడు.*

★★★

## విషయ సూచిక

**ముఖచిత్రం : సమర్థ రామదాసు**


1. **సంపాదకీయం :**
   జ్ఞానప్రాప్తి 1
2. **సద్గురు వచనామృతం**
   **విషయ సూచిక** 2
3. **వేద మంత్రం** 3
4. **ధారావాహిక : వృద్ధాప్యం జీవిత నవనీతం – 1**
   ఎవరు వృద్ధులు ? 4
5. **ముఖచిత్ర కథనం**
   రామరాజ్యానికై ఉద్యమించిన సమర్థ రామదాసు 7
6. **గాయత్రీ సాధన**
   ఉపాసన+ఆత్మక్షాళన+సేవ 11
7. **మనం – మన ఆరోగ్యం**
   ప్రాణాయామానికి సరళ విధానం 13
8. **రమణ మహర్షి వర్ధంతి వ్యాసం**
   ఆధ్యాత్మిక కాంతులు విరజిమ్మే తేజోరాశి శ్రీరమణులు 15
9. **వ్యక్తి నిర్మాణం**
   ఆత్మవిశ్వాసంలో అద్భుతశక్తి 18
10. **ఆచరణలో అధ్యాత్మ**
   సుఖాన్ని పొందడం ఎలా? 19
11. **పరశురామ జయంతి వ్యాసం**
   అత్యాచారులను సహించని అవతారం 20
12. **శ్రీరామనవమి వ్యాసం**
   శ్రీరామచంద్రుని పదహారు కళ్యాణ గుణాలు 25
13. **ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం – 10**
   ఉన్నతికి ఒకేఒక మార్గం తపస్సు 28
14. **ధారావాహిక : యువతరానికి మేలుకొలుపు – 5**
   విశ్వవిద్యాలయాలలో యువశక్తి విశిష్ట భూమిక 30
15. **ధారావాహిక : సమాజానికి వెన్నెముక వానప్రస్థం – 1**
   నేటి వికృతులకు విరుగుడు – వానప్రస్థం 33
16. **ధారావాహిక : దివ్యజీవన దర్శనం – 28**
   దీక్షా భూమికి యాత్ర – 4 36
17. **గురుదేవుల అమృతలేఖిని**
   సమస్యలకు మూలం శ్రద్ధా సంక్షోభం 41
18. **విశిష్ట వార్త**
   మహత్తర సాఫల్యాన్ని సాధించిన మదురై అశ్వమేధం 45
19. **వార్తలు**
   చోడవరంలో పంచకుండీయ గాయత్రీ యజ్ఞం 46
19. **సద్గురు లీలామృతం** 47


**శత్రువు బ్రతుకుదెరువునైనాసరే నాశనం చేయకూడదు** – చాణక్యుడు.

# వేద మంత్రం

## మానసిక పవిత్రత ప్రధానం

**యజ్జాగ్రతో దూరముదైతి దేవం తదు సుప్తస్య తథై వైతి ।**
**దూరఙ్గమ జ్యోతిషాం జ్యోతిరేకం తన్మే మనః శివ సంకల్పమస్తు ॥** (యజుర్వేదం 34/1)

**భావార్థం** : మన మానసిక శక్తి అనంతం. అది మేల్కొన్నప్పుడూ, నిద్రిస్తున్నప్పుడూ కూడ, ఎల్లప్పుడూ క్రియాశీలంగా ఉంటుంది. అది జ్యోతి స్వరూపమైనా, దానిపై మురికి పేరుకొని ఉన్నది. మన మనస్సు శుభకరమైన కళ్యాణకరమైన ఆలోచనలు కలిగి ఉండాలి.

**సందేశం** : మన మనస్సు దివ్య శక్తి రూపం. ఇది చాలా శక్తివంతం, క్రియాశీలం. మేల్కొన్నా, నిద్రించినా దాని పని ఆగదు. ఎప్పుడూ ఏదో ఒకటి ఆలోచిస్తూ, ఇక్కడా అక్కడా తిరుగుతూ ఉంటుంది. ఒకప్పుడు గతంలోని వాటిని స్మరిస్తూ, ఒకప్పుడు భవిష్యత్తు గురించి కల్పనలలో విహరిస్తూ ఉంటుంది. ప్రతి క్షణం ఏదో ఒకదానిని గురించి సంకల్పిస్తూ – వికల్పిస్తూ, చింతనలో– మననంలో తర్కంలో – కుతర్కంలో చిక్కుకొని ఉంటుంది. ఒక్కక్షణం కూడా ఊరికే ఉండదు. మేల్కొన్నప్పుడేకాక నిద్రిస్తున్నప్పుడు కూడా ఆగకుండా, రకరకాల కలలు కంటూ ఉంటుంది. ఇరవైనాలుగు గంటలూ ఏదో ఒకటి చేస్తూ ఉంటుంది. లిప్తకాలంలో కాంతి కంటే అధిక వేగంతో ఎక్కడికో వెళ్లిపోతుంది.

మనుష్యుడు మనసులో ఏది ఆలోచిస్తాడో అదే నోటితో చెప్తాడు, దానినే ఆచరిస్తాడు, దాని ఫలితమే ప్రాప్తిస్తుంది. మనస్సు యొక్క ఆలోచనలే చివరికి ఆతని శీలాన్ని నిర్మాణం చేస్తాయి. మనిషి యొక్క చింతన భద్రం, శుభం అయితే అతడి వచనం, కర్మ కూడా శుభమే అవుతాయి, వాటి ఫలితం కూడా శుభమే అవుతుంది. ఇదే విధంగా చింతన అశుభమైతే వచనము, కర్మ, ఫలం కూడా అశుభమే అవుతాయి. మానసిక చింతన అన్నిటికంటే మహత్తర తత్వం.

దురాలోచనల ప్రభావం మనలోపల దుష్ట ప్రవృత్తులకు జన్మ నిస్తుంది. ఇంద్రియములనే గుఱ్ఱములను అదుపు చేసే కళ్లెం మనస్సు. మనసులో దురాలోచనలు ప్రవేశిస్తే ఇంద్రియములు దుర్మార్గంలో నడుస్తాయి. ఎవరి మనస్సు వశంలో ఉంటుందో, వారి ఇంద్రియములు సంస్కరించబడిన గుఱ్ఱములవలె వశంలో ఉంటాయి. ఎవరు వివేకహీనులై మనస్సును అనుసరిస్తారో, వారు ఎల్లప్పుడు అపవిత్ర ఆలోచనలతో పీడించబడి, జనన మరణ చక్రంలో పరిభ్రమిస్తూ, దారుణ దుఃఖాన్ని పొందుతారు. ఎవరు వివేకసంపన్నులై మనస్సును వశంలో ఉంచుకుంటారో వారు నిరంతరం శుద్ధము, పవిత్రమైన ఆలోచనలతో, తమ సత్కర్మల ఫలంగా మోక్షాన్ని పొందుతారు. మనష్యుని మనస్సు యొక్క జ్ఞానం – అజ్ఞానం, శుభం – అశుభం అయిన ఆలోచనలే బంధనానికి లేదా మోక్షానికి కారణా లవుతున్నాయి.

దురాలోచనల మలిన ఆవరణ కారణంగా మన మానసిక జ్యోతి కొడిగట్టకుండా మనం ఎల్లప్పుడూ కృషి చేయాలి. మనస్సులో ఉత్పన్నమయ్యే సంకల్ప ప్రవాహంలో ఒక అశుభ సంకల్పం కూడా తలెత్తకుండా ఉండాలి. మనస్సులో ఎల్లప్పుడూ దివ్య, కళ్యాణకరమైన సంకల్పముల ప్రవాహమే వచ్చుచుండుగాక. ఆలోచనల దివ్యత్వం మన కర్మలలో ప్రతిఫలిస్తుంది. అది ఆధారంగా సమాజం మనల్ని విలువ కడ్తుంది. మన కర్మలు ఆధారంగానే, మనకు కీర్తి – అపకీర్తి, మాన – అవమానాలు లభిస్తాయి. మానసిక పవిత్రతయే మన కర్మలను పవిత్రం చేయగలుగుతుంది.

ప్రచండ ఆత్మబల సంపన్నులైన వ్యక్తులకు ఈ కార్యం అసంభవము కాదు.

★★★

**కర్మలేకపోతే, జ్ఞానమంతా వ్యర్థమే.**

## ధారావాహిక : వృద్ధాప్యం జీవిత నవనీతం - 1

# ఎవరు వృద్ధులు?

*శాంతికుంజ్ గత సంవత్సరం ప్రచురించిన గ్రంథాలలో "సార్థక ఏవం ఆనందమయ వృద్ధావస్థా" ఒకటి. గ్రంథ రచయిత 'బ్రహ్మవర్చస్'. ఆ గ్రంథాన్ని ఈ సంచిక నుండి ధారావాహికంగా ఇస్తున్నాం. అనువాదం కందర్ప రామచంద్రరావు.*

### జీవేమ శరదశ్శతమ్

ప్రపంచంలో ప్రతి జీవియొక్క జీవిత యాత్రలో వృద్ధాప్యం ఒక మజిలీ. మనుషులలో కూడ అది ఒక సామాన్యమైన దశ, ప్రకృతిసిద్ధమైన దశ. జన్మించిన వ్యక్తి శరీరం కాలంతోపాటు వికాసం పొందుతుంది. మనిషి ఎల్లకాలం పసిబాలుడుగా, నవ యౌవనుడుగా ఉండడం జరగని పని. వయస్సు మీదపడే కొలదీ శరీర సామర్థ్యం తగ్గడం ప్రారంభం అవుతుంది; వృద్ధాప్యం వస్తుంది. ఇది అతి సహజమైన పరిణామం.

అయినా కొందరు వృద్ధాప్యం అనే మాటకే గాబరాపడతారు. వయస్సు పెరగడంతోపాటు వృద్ధాప్యం తప్పక వస్తుందని తెలిసినప్పటికీ వారు మానసికంగా అందుకు తయారు కారు. వృద్ధాప్యం వయస్సు పెరిగితే వస్తుంది. అయితే - మానసికమైన ముసలితనమూ ఉంది. 80 - 90 సంవత్సరాల వయస్సులో కూడ యువకులవలె ఉత్సాహంతో, ఉత్తేజంతో తమలో మిగిలి ఉన్న శక్తి సామర్థ్యాలను పూర్తిగా సద్వినియోగం చేస్తూ ఉండే వ్యక్తులు ఉన్నారు. మరోప్రక్క - 30-40 సంవత్సరాలకే అలసిపోయిన, ఉత్సాహం లేని, ఓజస్సులేని, దుఃఖ దైన్యాలు నిండిన, అనుక్షణం నిరాశలో మునిగి ఉన్న వ్యక్తులూ మనకు తారసపడతారు.

ప్రతి జీవీ నిర్ణీత కాలం వరకు క్రియాశీలంగా ఉంటుంది. పరమపిత పరమాత్మ వాటి శరీరాలను అలా నిర్మాణం చేశాడు. ఆ నిర్ణీత కాలమే అతడి ఆయుష్షు. ప్రపంచంలోని జీవ జంతువులన్నింటికీ నిర్ణీతమైన ఆయుష్షు ఉంది. కొన్ని క్రిమి కీటకాల ఆయుష్షు కొన్ని గంటలు మాత్రమే ఉంటుంది. వేల్ చేప 300 సంవత్సరాలు జీవిస్తుంది. అలాగే, భగవంతుడు మనిషి శరీరపు ఆయుష్షును 100 సంవత్సరాలుగా నిర్ణయించాడు. 100 సంవత్సరాల వరకు మనిషి శరీరం యౌవన దశలో ఉంటుందని ఆయుర్వేద సిద్ధాంతం చెపుతోంది. ఆ సిద్ధాంతం ప్రకారం -120 సంవత్సరాల వరకు వృద్ధ దశ, ఆ తర్వాత జర దశ ఉంటుంది. జర దశలో శరీరం జర్జరం అవుతుంది, శిథిలం అవుతుంది. ఆయుర్వేద నియమాల ప్రకారం మనిషి సంయమనాన్ని పాటించినపుడే, సాత్విక జీవన విధానాన్ని అవలంబించినపుడే - ఈ సిద్ధాంతం మనిషికి వర్తిస్తుంది. సూర్య భగవానుని సహాయంవల్ల మనం 100 సంవత్సరాలు జీవించాలి; వంద సంవత్సరాల వయస్సు వరకు చూడాలి; వంద సంవత్సరాల వయస్సు వరకు చెవులతో వినాలి; వంద సంవత్సరాల వయస్సు వరకు చక్కగా మాట్లాడాలి; వంద సంవత్సరాల వయస్సు వరకు దైన్యం లేకుండా జీవించాలి; వంద సంవత్సరాల వయస్సు వరకు శరదృతువుల అందానికి సంతోషించాలి; అంతకన్న హెచ్చు వయస్సువరకు ఆనందంగా జీవించాలి - అని ఆయుర్వేదంలో భగవంతునికి ప్రార్థన చేయడం ఉంది;

**తచ్చుభుర్దేవహితం పురస్తాచ్ఛుక్రముచ్చరన్ ।**
**పశ్యేమ శరదః శతం,**
**జీవేమ శరదః శతమ్ శృణుయామ శరదః శతం,**
**ప్రబ్రవామ శరదః**
**శతమదీనః స్యామ శరదః శాంతం,**
**భూయశ్చ శరదః శతమ్ ॥**

- (యజుర్వేదం 36/24)

**తన శక్తిని తీక్షణం చేసుకున్న వ్యక్తిని ఋతంభర ప్రజ్ఞ వెంబడిస్తుంది.**

అనగా -

మనం వంద సంవత్సరాలకుపైగా జీవించాలి. మన కళ్ళు, చెవులు, వాణివంటి జ్ఞానేంద్రియాలూ, కర్మేంద్రియాలూ అన్నీ అంతవరకు పనిచేయాలి.

ఈ లక్ష్యంతోనే ఋషులూ, మనీషులూ మానవ జీవితంలోని వంద సంవత్సరాలను నాలుగు కాలఖండాలుగా విభజించి, జీవన చర్యను నిర్ణయించారు - బ్రహ్మచర్యం, గృహస్థం, వానప్రస్థం, సన్యాసం. బ్రహ్మచర్యంలోని 25 సంవత్సరాల కాలంలో నియమ, సంయమాల కఠోర అనుశాసనాన్ని పాటిస్తూ, ఉత్తమమైన పుష్టి కలిగిన శరీరాన్ని పునాదిగా నిర్మాణం చేసేవారు; బౌద్ధిక వికాసానికీ, మానసిక వికాసానికి కూడ అత్యధిక ప్రాధాన్యం ఇచ్చేవారు. ఆ తర్వాత గృహస్థదశలో ఉంటూ 50 సంవత్సరాల వయస్సు వరకు వ్యక్తి తన శక్తి సామర్థ్యాలను, ప్రతిభను సముచితంగా వినియోగిస్తూ సుఖ శాంతులతో జీవించేవాడు. దానితోపాటు కుటుంబ బాధ్యతలను, సామాజిక బాధ్యతను నిర్వహించేవాడు. అయితే ఆ తర్వాత వానప్రస్థ, సన్యాస సంప్రదాయాల ప్రకారం సమాజానికి నిస్వార్థంగా సేవ చేయడానికి తనను సమర్పించుకునేవాడు. ఈ జీవన విధానం ప్రకారం బాల్య, యౌవనాలతో పొందే ఆనందాన్నే మనిషి వృద్ధ దశలో కూడ అనుభవించేవాడు. తన అనుభవాన్నీ, జ్ఞానాన్నీ అందరికీ పంచేవాడు. సమాజంలోని ఒక ప్రయోజనకరమైన అవయవంగా పూజించబడేవాడు, సన్మానించబడేవాడు.

ఈనాడు సాధారణంగా 60 సంవత్సరాల వయస్సు దాటినవారిని వృద్ధులుగా పరిగణిస్తున్నారు. వృద్ధుల ప్రయోజనం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంది. వార్ధక్యానికి వయస్సుతో కన్న మనస్సుతో హెచ్చు సంబంధం ఉంది. ఈ వాస్తవాన్ని గుర్తిస్తే, వార్ధక్యపు సమస్యలను మనం సవ్యంగా అవగాహన చేసుకోగలుగుతాం; వాటిని పరిష్కరించగలుగుతాం.

ఈ దృష్టితో వృద్ధులను ఇలా వర్గీకరించవచ్చు-

## 1. మానసికంగా, శారీరికంగా ఆరోగ్యవంతులు

మానసికంగా, శారీరికంగా ఆరోగ్యవంతులు నేడు అరుదుగా ఉన్నారు. మహాత్మా గాంధీ, పండిత మదనమోహన మాలవ్యా, శ్రీహనుమాన్ ప్రసాద్ పోద్దార్, శ్రీజమునాలాల్ బజాజ్ ఈ వర్గానికి చెందిన వృద్ధులు. ముజఫ్ఫర్ నగర్‌లోని సుకదేవ ఆశ్రమానికి చెందిన స్వామి కళ్యాణదేవ్‌జీ ప్రస్తుతం 128 సంవత్సరాల వయస్సులోకూడ సమాజ సేవలో క్రియాశీలంగా ఉన్నారు. మథురలోని గౌరవధామ్ రాధాకుండలో శ్రీబ్రుజసుందర్ దాస్‌జీ మహరాజ్ 105 సంవత్సరాల వయస్సులో కూడ తమ జీవితాన్ని నిర్మాణాత్మకంగా సద్వినియోగం చేస్తున్నారు. ఇలాంటి వ్యక్తుల జీవిత చరిత్రలను పరిశీలిస్తే మనకు ఒక విషయం తెలుస్తుంది. వీరు బాల్యంనుండీ తమ జీవితాలలో సంయమనాన్ని సాధన చేశారు. తమకు తామే అధ్యాపకులుగా వ్యవహరించి, తమ శరీరాన్ని కఠోరమైన అనుశాసనంలో బంధించారు. ఫలితంగా - వారి ఓజస్సు, తేజస్సు, వర్చస్సు అభివృద్ధి పొందాయి. వాటి ఆనందాన్ని వారు వృద్ధాప్యంలో అనుభవిస్తూవచ్చారు.

## 2. శరీరంగా అనారోగ్యంగా, మనస్సు ఆరోగ్యంగా ఉన్నవారు

శ్రీ రామకృష్ణ పరమహంస కాన్సరు వ్యాధితో తీవ్రవేదనను పొందేవారు. కానీ, ఆ రోగ ప్రభావం ఆయన మనస్సుమీద ఏమాత్రం ఉండేది కాదు. వారు చివరి ఘడియ వరకు సాధనలో, సమాజ సేవలో నిమగ్నులు అయినారు. ఇటువంటి సంత్‌లూ, మహాత్ములూ, మహాపురుషులూ పలువురు ఉన్నారు. శారీరికమైన అనారోగ్యం కొనసాగుతూ ఉన్నప్పటికీ, తాము నిస్సహాయులైన వృద్ధులమని వారెన్నడూ భావించలేదు. అనారోగ్యం, అంగవైకల్యం, కొరతల పరిస్థితులను ఈశ్వరేచ్ఛగా పరిగణించి సదా ప్రసన్నంగా కానవచ్చే వ్యక్తులు మన చుట్టుపట్లకూడ కానవస్తారు. వారు సమాజానికీ బరువు కారు, తమ కుటుంబానికీ బరువు కారు.

**జ్ఞాని అహంకారి అయితే, అతడి అంతఃకరణలో కరుణ అడుగంటిపోతుంది.**

### 3. శరీరారోగ్యం ఉండి మానసిక ఆరోగ్యం లేనివారు

సమాజంలో ఇలాంటి వ్యక్తుల సంఖ్య చాలా హెచ్చు. వృద్ధులేకాక, పలువురు యువకులుకూడ ఇలా ఉంటారు. వారి మనస్సులకు సంతృప్తి అనేది ఎన్నడూ కలుగనే కలుగదు. ప్రపంచం అంతటా వారికి చెడుమాత్రమే కనిపిస్తుంది. ప్రతివ్యక్తీ వారికి శత్రువుగా కనిపిస్తాడు. వారి కోరికలు అపరిమితంగా ఉంటాయి. స్వార్థం, లోభంతప్ప మరొకటి వారికి అందదు. ప్రతివ్యక్తీ తమకు సేవ చేయాలనీ, తమ కోరికలు తీర్చాలనీ వారు ఆశిస్తారు. తాము మాత్రం ఎవ్వరికీ చిల్లిగవ్వ ఇవ్వరు. వారు ఎప్పుడూ కుళ్లిపోతూ ఉంటారు, విసుక్కుంటూ ఉంటారు. తాము దుఃఖిస్తారు, ఇతరులను దుఃఖపరుస్తారు.

### 4. శరీర అనారోగ్యం, మానసిక అనారోగ్యం కలిగినవారు

ఇలాంటి వ్యక్తులు కుటుంబానికీ, సమాజానికీ విషమ సమస్యలు సృష్టిస్తూ ఉంటారు. వారు తమ శారీరక దౌర్బల్యపు దోషాన్నీ, తమ అసమర్థతకు దోషాన్నీ ఇతరులమీద రుద్దుతారు. వారి ఆచరణ ఎక్కువగా మతిస్థిమితంలేని వ్యక్తి ఆచరణలా ఉంటుంది. అసూయ, ద్వేషం, విసుగుదల వారి దిన చర్యలో అంతర్భాగాలుగా ఉంటాయి. వారు ఎన్నడూ ఎవరి మంచి గురించీ ఆలోచించలేరు.

### 5. అత్యధిక జర్జరులు, నిస్సహాయులు

దీర్ఘరోగాలవల్ల, ఇతర కారణాలవల్ల శారీరికంగా అత్యంత బలహీనులు అయినవారు. మానసికంగా బాగున్నా, శారీరకంగా  నిస్సహాయులు అయినవారు.

### వృద్ధాప్యం, ఆర్థిక పరిస్థితి

వయస్సు పెరగడంతోపాటు మనిషి అవసరాలుకూడ బాగా తగ్గిపోతాయి. తిండికీ, బట్టకుకూడ ఎక్కువగా ఖర్చు చేయవలసిన అవసరం ఉండదు. అయినా ప్రతిఒక్కరికీ ఆర్థికమైన ఆసరా అవసరం అవుతుందికదా. ఆర్థిక పరిస్థితి ఆధారంగా వృద్ధులను ఇలా వర్గీకరించవచ్చు.

(క) ఆర్థిక సమస్యలు లేనివారు. సాధారణంగా మనిషి ఉద్యోగం, వ్యాపారం, వ్యవసాయంవంటి వాటిద్వారా సంపాదించి మిగుల్చుకున్న డబ్బు వృద్ధాప్యంలో అవసరాలు తీర్చుకోవడానికి అతడికి సరిపోతుంది. ఏ కారణంవల్ల అయినా కుటుంబం ఆసరా అందకపోయినా, వారిని డబ్బు కొరత ఇబ్బందిపెట్టదు.

(ఖ) అవసరానికి మించిన సంపద కలిగినవారు. ప్రస్తుత పరిస్థితులలో ఇలాంటివారి సంఖ్య పెరుగుతోంది. వీరి పిల్లలు మంచి భవిష్యత్తు కోసం ఇల్లూ ఊరూ వదిలి ఇతర నగరాలలోనో, ఇతర దేశాలలోనో ఉంటారు. వృద్ధులైన తల్లిదండ్రులు అపారమైన సంపదతోపాటు ఒంటరిగా రోగాలనూ, ఇతర పరిస్థితులనూ ఎదుర్కొంటూ ఉంటారు. ఒకప్రక్క వారి బాగోగులు చూచేవారు ఎవరూ ఉండరు. మరోప్రక్క వారిచుట్టూ భజనపరులూ, స్వార్థపరులూ చేరతారు – ఆ సంపదను చేజిక్కించుకునే జిత్తులు పన్నుతూ. ఒకోసారి ఆ డబ్బుకోసం వారి హత్య చేసేవరకు వెళతారు.

(గ) తమ అవసరాలను తీర్చుకోవడానికి ఆర్థిక వనరులు లేనివారు. జీవితమంతా సంయమనం లేకుండా జీవించినవారు ధనాన్ని దుర్వినియోగం చేసినవారు, సమయం ఉండగానే భవిష్యత్తు గురించి ఆలోచించనివారు వార్ధక్యంలో ఇలాంటి కష్టాలు అనుభవిస్తారు. కొందరి పరిస్థితి మరోలా ఉంటుంది. వాళ్ల పిల్లలు పొలం, ఆస్థి, వ్యాపారం అంతా వశపరచుకుంటారు. తల్లిదండ్రులను గాలికి వదలివేస్తారు. నేడు భోగవాద సంస్కృతి ప్రభావంలో చిక్కుకున్న పలువురు ఇలా వ్యవహరిస్తున్నారు.

వృద్ధులనూ, వారి సమస్యలనూ అవగాహన చేసుకోవడానికై మనకు మానసికమూ, శారీరికమూ, ఆర్థికమూ అయిన ఇలాంటి దృక్పథం ఎంతో సహాయకారి అవుతుంది.

★★★

**దుఃఖాన్నీ, చింతనూ దూరంచేసే దివ్య ఔషధం - విస్మరణ.**

## ముఖచిత్ర కథనం

# రామరాజ్యానికై ఉద్యమించిన సమర్థ రామదాసు

(సమర్థ రామదాసు జయంతి ఏప్రిల్ 7)

సమర్థ రామదాసు అసలు పేరు నారాయణుడు. ఆయన తండ్రి శ్రీసూర్యాజీ పంత్ ఠోసర్. తల్లి రాణూబాయి. తండ్రి 'జాంబ' అను గ్రామానికి అధికారి. పన్నెండు సంవత్సరాలు పిల్లలకొరకు అత్యంత భక్తి శ్రద్ధలతో సూర్యోపాసన చేశారు. భగవంతుడు వారి కిద్దరు కొడుకులు కల్గేటట్లు వరమిచ్చారు. సూర్యాజీ పంత్‌కు కల్గిన మొదటి బిడ్డ పేరు గంగాధరుడు. గంగాధరుడు పుట్టిన రెండు సంవత్సరాల తరువాత (శక సంవత్సరం 1530 లో) శ్రీరామనవమి ఉత్సవ సమయంలో సరిగా పన్నెండు గంటలకు నారాయణుడు జన్మించాడు. చిన్నతనం నుండి నారాయణుడు దుడుకు స్వభావం కలవాడు. అతనికి ఐదవయేట ఉపనయనం చేశారు. అతడు చాలా తెలివి గలవాడు. వ్యాయామంలో, ఆటలలో నేర్పరి. రోజుకు రెండువేల సూర్యనమస్కారములు చేసేవాడు. నారాయణుడు హనుమంతుని గుడికి వెళ్ళి అక్కడ కూర్చున్నాడు. ప్రసన్నుడైన హనుమంతుడు నారాయణుని తలపై తన వదరహస్తముంచాడు. అప్పటినుండి నారాయణుడు 'రామదాస'య్యాడు.

నారాయణునికి పెళ్లి నిశ్చయించి ముహూర్తం పెట్టారు. ఆచారం ప్రకారం వధూవరుల మధ్యన తెర కట్టి పురోహితుడు మంగళాష్టకం మొదలుపెట్టాడు. దీని తర్వాతే వరునికి వరమాల వేయించటం. పురోహితుడు ప్రతిచరణం తర్వాత "సావధాన్" అనటం మొదలుపెట్టాడు. నారాయణుడు తనకు కాబోయే బావమరిదితో "సావధాన్" అంటే అర్థం యేమిటి?" అని అడిగాడు. అతడు నవ్వుతూ హాస్యంగా, "నీ కాళ్లకు సంకెళ్లు పడిపోతున్నాయి జాగ్రత్త!" అని అర్థం – అన్నాడు.

నారాయణుడు, చివరి చరణం పూర్తై, సావధాన్ అనేలోపు పెళ్లిమంటపం నుండి పారిపోయేడు. మూడు రోజులవరకు 'జాంబా'లోనే ఒక రావిచెట్టు మీద గట్టి కొమ్మ చూసుకుని కూర్చుండిపోయాడు. ఆ తర్వాత నదిని దాటి గోదావరి దగ్గరలోని నాశిక్ ప్రక్కనున్న పంచవటి చేరాడు. గోదావరీ, నందినీ నదుల సంగమం దగ్గర ఉన్న గుహలో సాధనలో మునిగిపోయాడు. శ్రీరామ! జయరామ! జయ జయ రామ! అను త్రయోదశీ మంత్రాన్ని మాఘశుద్ధ సప్తమి నాడు ప్రారంభించాడు. పదమూడు కోట్ల మార్లు జపించాలని సంకల్పించాడు. నదీ సంగమంలో నడుము లోతులో నిలబడి సూర్యోదయంనుండి, మిట్టమధ్యాహ్నం వరకు జపం చేసేవాడు. చేపలు కాళ్లు కొరికినా చలించేవాడు కాదు. జపం తర్వాత బ్రహ్మ యజ్ఞం చేసి, పిమ్మట భిక్షకు బయలు దేరేవాడు. ఆ భిక్షను రఘుపతికి నైవేద్యం పెట్టి తర్వాత తినేవాడు.

పన్నెండు సంవత్సరాల సాధన తర్వాత ఆయన తీర్థయాత్రలకు బయలుదేరాడు. ఈ యాత్రలో ఆయన కృష్ణాతీరానికి వచ్చేటప్పటికి ఆయన వయస్సు ముప్పదియారు. ఆయన యాత్ర పన్నెండేళ్లు కొనసాగింది. ప్రతిష్ఠానపురంలో ఆయన ఒకమారు భజన చేస్తున్నారు. అప్పుడొక వ్యక్తి ఆయన్ని గుర్తించి "మీ అమ్మ నీ కోసం తపిస్తోంది. ఆమె కళ్లుకూడా పోయాయి" – అని చెప్పాడు. రామదాసు అప్పటికి 'సమర్థ రామదాసు' అయ్యాడు. తల్లిని చూడటానికి జాంబా వెళ్లాడు. తన ఇంటి ముందు నిలబడి " జయజయ రఘువీర! అని ఎలుగెత్తి అరిచాడు. అతని వదినగారు భిక్ష తీసుకొని వచ్చింది. "ఇతడు భిక్ష తీసుకునే స్వామి కాదు" – అని అన్నాడు రామదాసు. అతని కంఠస్వరాన్ని గుర్తించిన తల్లి "ఎవరూ? మన నారాయణుడేనా!" – అని అడిగింది. "అవునమ్మా! నేనే!" – అన్నాడు. ఇరువది నాల్గు సంవత్సరాల తర్వాత తల్లీ కొడుకులు కలుసుకున్నారు. కాని తల్లికి కొడుకును కళ్లారా చూసే

**తృష్ణ మానవ జీవితంలోని అధమ స్థాయి.**

భాగ్యమేది? సమర్ధ రామదాసు తల్లి కనురెప్పలను చేతులతో నిమిరాడు. ఆశ్చర్యం! ఆమెకు దృష్టి వచ్చింది. తల్లి జడలతో, సాధు వేషంలో ఉన్న కొడుకును చూసి "నిన్నే భూతం ఆవహించిందిరా? ఇల్లుపట్టకుండా వెళ్లి పోయావు" అంది. దానికాయన నర్మగర్భంగా నవ్వి, "వైకుంఠంలో బయలుదేరి, అయోధ్యలో కౌసల్యామాత గర్భంలో జన్మించిన శ్రీరామచంద్రుడే నన్ను పట్టుకున్నాడు" – అన్నాడు. 'ఓవి బద్ధ' అను మరాఠీ చంధస్సులో ఆయన పూర్తి రామాయణాన్ని రచించి వినిపించాడు.

తీర్థయాత్రల సమయంలో ప్రజల దీన స్థితిని పరిశీలించే అవకాశం ఆయనకు దొరికింది. కరవు కాటకాలవల్ల ప్రజల పరిస్థితి దయనీయంగా తయారయింది. రాజ్యాధికారం విధర్మీయులైన విదేశీయుల చేతిలో ఉంది. దేవాలయాలు ధ్వంసం చేయబడుతున్నాయి. విగ్రహాలు ముక్కలు చేయబడుతున్నాయి. స్త్రీలపై అత్యాచారాలు మితిమీరి పోయినాయి. ప్రజలు మతం మార్చుకునే పరిస్థితులు బలవంతంగా సృష్టించబడుతున్నాయి. తీర్థయాత్రలు పూర్తి అయిన తర్వాత, ఈ పరిస్థితుల్ని మార్చటానికి తన భవిష్యత్ కార్యక్రమాన్ని నిశ్చయించుకున్నాడు.

ఆకాలంలో నివసిస్తున్న అనేకమంది సాధువులు రామదాసస్వామిని కలియటానికి వస్తుండేవారు. సంత్ తుకారాంతో ఈయన కలయిక జగమెరిగిందే! ఈయనకు రామాయణమంటే మహాప్రీతి. అందులోని సుందరకాండ, యుద్ధకాండలు ఇంకా ఇష్టం! ఆయన వీటి ఆధారంగానే కావ్య రచన చేశాడు. ఆయన జీవిత కాలంలో భారతదేశం పరిస్థితి రావణ రాజ్యంలా ఉంది. దీనికి విరుగుడుగా, కోదండధారియైన శ్రీరాముని ఉపాసనకై ప్రతిచోటా శ్రీరామనవమి ఉత్సవాలు చేయించాడు. ఉపాసకునిలో ఉపాసనచేస్తున్న దేవత యొక్క గుణగణాలు ప్రవేశించాలి. ఆ దేవతా ప్రవృత్తిని అనుసరించే ప్రవృత్తి ప్రజలలో యేర్పడాలి. ధైర్యం, ఆత్మ విశ్వాసం, దాస్యవిముక్తులు కావాలనే కోరిక, స్వాతంత్ర్యంపై కోరిక, ఏక పత్నీవ్రతము మొదలైన సద్గుణాల్ని కల్గించి, ప్రజల్ని కర్తవ్యోన్ముఖులుగా గావించుటయే ఆయన ధ్యేయం. సమర్థ రామదాసుని రామోపాసన వలన ప్రజలలో స్వాతంత్ర్య పిపాస చెలరేగసాగింది. **ఛత్రపతి శివాజీ ప్రతి గురువారం మసర్థ రామదాసు దర్శనానికి వెళ్లేవాడు.** ఈ సమావేశంలో రాజకీయ పరిస్థితుల్ని గురించి చర్చించేవారు. ఆ సమావేశానికి అనువైన ప్రదేశం 'ఫరళి'. అదే తర్వాత 'సజ్జన్‌గఢ్'గా ప్రసిద్ధి చెందింది. **శివాజీ మహారాజు తాను సంపాదించినదంతా దానపత్రం వ్రాసి రామదాసస్వామి జోలెలో వేశాడు. రామదాసు తన తరఫున రాజ్యాన్ని పాలించమని శివాజీని కోరాడు.**

ఛత్రపతి శివాజీ, సమర్థ రామదాసు రెండు పేర్లు గల్గిన ఒకేవ్యక్తి. శకసంవత్సరం 1567–68లో హనుమంతుని విగ్రహాలు స్థాపించి, తద్వారా ధర్మాచరణ ఘనతను గూర్చి విశదీకరించాడు. ఆరోజుల్లోనే రోహితేశ్వరునికి హైందవీ స్వరాజ్యం కావాలనే కోరిక కల్గిందంటూ శివాజీ తోరణ దుర్గాన్ని జయించి, దానిపై తొలిసారిగా భగవా ధ్వజాన్ని ఎగురవేశాడు. శివాజీ సమర్థ రామదాసు ఉనికిని తెలుసుకోవటానికి అన్ని చోట్ల వెతికించాడు. ఇది తెలియగానే సమర్థ రామదాసు శివాజీకి ఒక ఉత్తరం పంపాడు. అందులో ఇలా వ్రాసి ఉంది : "రాజా! నీలో నాకు ధర్మ రక్షకుడైన మహాపురుషుడు కనిపిస్తున్నాడు. నీలో శక్తి యుక్తులు రెండూ ఉన్నాయి. మనమంతా కలసి ధర్మ సంస్థాపకులమనే పేరు గడించాలి." ఈ ఉత్తరం చూడగానే శివాజీకి ఉత్కంఠ పెరిగింది. ఆయన "మేము మీ దర్శనానికి వస్తున్నా"మనే ఉత్తరాన్ని పంపించి, ఆ ఉత్తరంతోపాటే రామదాసును చేరాడు! 'చాఫళ్'లోని శ్రీరామమందిరానికి వెనుకవైపున, కొండ దిగువన, 'శింగణవాడి' అనే అడవి ఉంది. సుమర్థరామదాసు అక్కడ ఒక చెట్టుకింద కూర్చున్నాడు. ప్రక్కనే కళ్యాణ్ కూర్చున్నాడు. వ్రాతపని సాగుతోంది. దూత వచ్చి ఉత్తరం ఇచ్చాడు. సమర్థ రామదాసు అందుకున్నాడు. ఇంతలోనే రాజుగారు వస్తున్నారనే వార్త చేరింది. సమర్థ రామదాసుని చూడగానే శివాజీ చేతులు జోడించి, గద్గద స్వరంతో సాష్టాంగ నమస్కారం చేశాడు. సమర్థ రామదాసు "రఘుపతి నీ కోర్కెను తీరుస్తాడు" అని ఆశీర్వదిస్తూ, తల నిమిరాడు.

**ఆత్మ విశ్లేషణద్వారా లభిస్తుంది తక్షణ శాంతి.**

ఈ విధంగా ఇద్దరు చారిత్రక పురుషుల సమ్మేళనం జరిగింది. ఈ బంధం పోనుపోను ఇంకా గట్టిపడింది. శ్రీ సమర్థ రామదాసు శివాజీ కలిసి చర్చించి, ఆలోచించుకున్న తర్వాతనే ముందడుగు పడేది. ఆగ్రాలో ఔరంగజేబు ఖైదునుంచి శివాజీ యుక్తిగా బయటపడ్డాడు. అతడు క్షేమంగా స్వస్థలానికి చేరటానికి కావలసిన యేర్పాట్లన్ని సమర్థ రామదాసు ముందే చేసి ఉంచాడు. రామదాసు మధుర, కాశీ, అయోధ్య మొదలైన చోట్ల మఠాల్ని ఏర్పరచి ఉంచాడు. ఆ మఠాల మహంతులకు హరికథలతోపాటు, రాజకీయాలలో కూడా ఆసక్తి పెంపొందించుకోమని బోధించాడు. ఈ యేర్పాటు ఆగ్రా నుంచి బయటపడిన శివాజీ మహారాజుకి చాలా వీలు కల్గించింది. శివాజీ మహారాజుకు సమర్థ రామదాసుపై అపారమైన భక్తి ఉంది. ఆయన సలహాపైనే శివాజీ పట్టాభిషేకానికి ఒప్పుకున్నాడు. పట్టాభిషేకానికి ముందే శివాజీ చాఫల్ వెళ్లాడు. రామదాసస్వామిని దర్శించాడు. రాజచిహ్నాల్ని ముందుగా ఆయనకు సమర్పించాడు. ఆయన దీవెనలు పొంది రాయగఢ వెళ్లాడు. పట్టాభిషేకమైన తర్వాత సమర్థ రామదాసును దర్శించాడు. నెలాపదిహేనురోజులు అక్కడే ఉండిపోయాడు. శివాజీ తన సర్వస్వాన్ని రామదాసస్వామికి సమర్పించటం వల్ల, ఆయన ఎదురుగా రాజచిహ్నాల్ని ధరించేవాడు కాదు.

ఈ సందర్భంగా ఒక కథ ఉన్నది. ఒకమారు ఛత్రపతి బేలూరులో ఉండి కర్ణాటకపై దాడికి సన్నాహాలు చేస్తుండగా, అతనికి హఠాత్తుగా వైరాగ్యం కల్గింది. అప్పుడు సమర్థ రామదాసు శివాజీని కలుసుకొని అతనిలో క్షాత్రధర్మాన్ని రగుల్కొలిపాడు. అఫ్జల్‌ఖాన్ వధ శక సంవత్సరం 1581 లో జరిగింది. "శివాజీని ప్రాణాలతో పట్టుకువస్తాను, లేదా చంపేస్తాను" అని బీజాపూరు దర్బారులో ప్రతిజ్ఞచేసి బయలుదేరాడు ఖాన్. ఈవిషయం తెలియగానే శివాజీ సమర్థ రామదాసును కలుసుకొనటానికి వెళ్లాడు. అప్పుడు సమర్థ రామదాసు శివాజీకి ధైర్యం చెప్పి, ఇచ్చిన సలహాలు శ్రీ సమర్థ రామదాసు వ్రాసిన 'దాసబోధ' అను గ్రంథంలో మనకు వివరంగా లభిస్తాయి.

సమర్థ రామదాసుకు శివాజీ పట్ల చాలా వాత్సల్యం. అతడు దేవికి నిత్యప్రార్థన చేసేటప్పుడు, ఆ ప్రార్థనలో భాగంగా ఇట్లా కోరుకునేవాడు – "శివాజీ మహారాజుకు జయం కల్గుగాక, అతడు శతృవుల్ని జయించటంలో ఎప్పుడూ కృతార్థుడు గానే ఉండాలి." రామదాసస్వామి అపారమైన గ్రంథపఠనం చేసాడు. 'శ్రీమద్దాసబోధ'లో తన రచనకు ఆధారమైన గ్రంథాల జాబితా వ్రాశాడు. ఆయన తాను వెళ్లిన చోట యోగుల్ని, సిద్ధుల్ని, మహాత్ముల్ని కలుసుకునేవాడు. మహాపురుషుల సమాధుల్ని దర్శించేవాడు. వారి గ్రంథాల్ని చదివేవాడు. వీలైతే వాటి నకలును సంపాదించేవాడు. ఆయన స్థాపించిన మఠాలలో ఆయన గ్రంథాలేకాకుండా యితర సాధుసంతుల గ్రంథాల మేలు ప్రతుల తయారీకూడా జరుగుతుండేది. ఆయనకు తన పర్యటనలో అనేక భాషలవారితో సాన్నిహిత్యం ఏర్పడటం చేత హిందీ, కన్నడం, తెలుగు కూడ వచ్చు. చాలామంది జ్ఞానం లభించిన తర్వాత కర్మ అక్కరలేదనుకుంటారు. కాని శ్రీసమర్థ రామదాసు పరబ్రహ్మ స్వరూపుడుగా ఉండి కూడ స్నాన సంధ్యలు, పూజ, భజనలు మొదలైన వాటినెన్నడూ విడిచిపెట్టలేదు.

ఒకమారు రామదాసు 'టాకళి' గ్రామానికి వెళ్లాడు. అదే రోజున ఆ గ్రామాధికారి కుమారుడు చచ్చిపోయాడు. అతని కోడలు సహగమన ప్రయత్నంలో ఉంది. ఆ సమయంలో రామదాసు అక్కడికి వెళ్లాడు. ఆమె ఆయనకు నమస్కారం చేసింది. ఆమె వైపు చూడలేదాయన. అష్టపుత్రా సౌభాగ్యవతీ భవ" అని ఆశీర్వదించాడు స్వామి. ఆమె ఆశ్చర్యంతో "స్వామీ! ఈ ఆశీర్వాదం ఈ జన్మకా? వచ్చే జన్మకా?" అని అడిగింది. ఆ ప్రశ్న వినీ వినగానే ఆయనకు విషయం అర్థమయింది. అప్పుడాయన ఆ శవాన్ని తనదగ్గరకు తెప్పించుకొని దానిపై గంగాజలం చల్లాడు. ఆ వ్యక్తి నిద్రనుండి లేచినట్లు లేచి కూర్చున్నాడు. అతడు బ్రతికాడు. కాని రామదాసు "నా వలన శ్రీరాముడు ఇంత భారం మొయ్యవలసి వచ్చిందికదా" – అని బాధపడ్డాడు. ఆ తర్వాత ఆయన ఎవ్వరు నమస్కరించినా 'జయరాం' అని మాత్రం అనేవారు. ఆ దంపతులు తమ మొదటి బిడ్డను రామదాసుకు సమర్పించారు. ఆ పిల్లవానికి 'ఉద్ధవుడు' అన్న పేరు పెట్టారు. అతడే రామదాసు మొదటి శిష్యుడు.

**సంతులిత మస్తిష్కం + కార్యక్రమం + వ్యవస్థిత కార్యపద్ధతి = విజయం.**

రామదాసు దృష్టి చాలా నిశితమైనది. ఒకమారు సామాన్‌గఢ్‌కోట నిర్మాణమౌతున్నది. వేలకొలది కూలీలు అక్కడ పనిచేస్తున్నారు. 'వీళ్లందరూ నావలనే కదా పోషించబడుతున్నారు' అన్న అహంకార భావం శివాజీ మనస్సులో తళుక్కుమన్నది. రామదాసస్వామి దాన్ని గుర్తించాడు. సమర్థ రామదాసు ఒక పెద్ద రాతిని చూపించి కూలీలతో దాన్ని పగులకొట్టించాడు. ఆ రాతిలోపల రంధ్రము, దానిలో ఒక కప్ప, కొంత నీరు ఉన్నాయి. దాన్ని చూసి రామదాసు శివాజీతో "దీన్ని కూడా నువ్వే పోషిస్తున్నావా?" అని అడిగాడు. శివాజీ సిగ్గుపడి క్షమించమని అడిగాడు. సామాన్‌గఢ్ కోట నిర్మాణంలో ఉన్నప్పుడు రామదాసస్వామి శివాజీకి నిర్మాణ పద్ధతుల్ని గురించిన మెలకువల్ని తెలియజేశాడు. ఒక విషయాన్ని వ్రాసేటప్పుడు అతి సూక్ష్మమైన అంశాన్ని సైతం పరిశీలించేవారు. ఆధి భౌతిక శాస్త్రం, వృక్షశాస్త్రం, శిల్పశాస్త్రం వ్రాసేటప్పుడు తన సూక్ష్మ పరిశీలనను పొందుపరిచాడు. **కోటలో మసీదు కూడా ఉండాలని ఆయన అన్నాడు. ముస్లింలపట్ల ద్వేషం కూడదనీ, అశ్పృశ్యులనే తేడా చూపకుండా అందరికీ పని ఇవ్వాలనీ ఆయన శివాజీకి బోధించాడు.**

సమర్థ రామదాసు సజ్జన్‌గఢ్‌లో నివసించటానికి రాగానే, ఆయన శివాజీతో "అన్నిచోట్ల ఉన్న సాధువుల్ని, సంతుల్ని ఇక్కడకు ఆహ్వానించ"మని చెప్పాడు. అన్ని వైపులకు ఉత్తరాలు వెళ్లాయి. అందరూ బయలుదేరి వచ్చారు. మహారాష్ట్రలో ఏర్పాటు చేయబడ్డ మొదటి సాధు పరిషత్ ఇది. దీనిలో రాజనీతికోవిదులు కూడా ఉన్నారు. సాధు పరిషత్ అధ్యక్షుడు స్వయంగా శివాజీయే! రామరాజ్యం స్థాపించబడాలనే పరమ లక్ష్యంతో సమావేశం ముగిసింది. ఈ సందర్భంగా సాధువులు అనేక కీర్తనల్ని ఆలాపించారు. సమర్థ రామదాసు ఆజ్ఞమేరకు శివాజీ కూడా పాడేవాడు. చివరలో సమర్థ రామదాసు పాడేవాడు. ఈ విధంగా యీ సంత్ పరిషత్ ఒక నెల రోజులు కొనసాగింది. సమర్థ రామదాసు వెళ్లినచోటల్లా సంతు, సాధు, సిద్ధ, యోగి, సన్యాసి, వీతరాగి, అనుష్ఠాతల కొరకు వెదకేవాడు. ఎవరైనా ఉన్నట్లు తెలిస్తే వెంటనే కలిసేవాడు. ఎవరైనా శిష్యులుగా చేరదలిస్తే వారిని స్వీకరించేవాడు. సామాన్య ప్రజల స్థితిగతుల్ని నిశితంగా పరిశీలించటం ఈయన ప్రత్యేకత. వాళ్ల అరమరికలు లేకుండా అన్ని విషయాలు స్వామికి నివేదించేవారు. ఈ విధంగా తన దేశ సంచార కాలంలో ఆయన దేశ పరిస్థితుల్ని క్షుణ్ణంగా ఆకళింపుచేసుకున్నాడు. భవిష్యత్ కార్యక్రమానికి మార్గదర్శనం చేశాడు. ఆయన శిష్యగణం పెరగసాగింది. వారికి భోజన యేర్పాట్లు చేయవలసి వచ్చింది. ఈ బాధ్యతను కొందరి శిష్యులపై ఉంచాడు. అయితే చిన్న హెచ్చరిక చేశాడు. "భిక్ష వేసేవారికి భారం కాకూడదు" అన్నాడు ఎంత భిక్ష స్వీకరించాలో సూచించాడు.

సమర్థ రామదాసస్వామి సామాన్య ప్రజానీకంలో చైతన్యాన్ని కల్గించిన నాయకుడు. ప్రజా సంఘటన, ధర్మ సంస్థాపన చెయ్యాలనే సంకల్పంతోనే రామదాసస్వామి తీర్థయాత్రలు చేస్తూ మఠాల్ని స్థాపించాడు. ప్రజల్లో స్వరాజ్య కాంక్ష రేకెత్తించి, రాజనీతిలో తన సాంప్రదాయ లక్షణాల్ని జోడించాడు. "ప్రపంచంలో కొనసాగేటప్పుడు రాజకీయాలు, లౌకిక వ్యవహారాలతో సంబంధం లేకుండా పారమార్థికత సిద్ధించ"దని రామదాసు చెప్పాడు.

సమర్థ రామదాసు, ఛత్రపతి శివాజీల చివరి కలయిక శకసంవత్సరం 1601లో పుష్యశుద్ధ నవమినాడు సజ్జన్‌గఢ్‌లో జరిగింది. ఆయన రాజుకు రాజ్యవ్యవస్థను గూర్చి బోధించాడు. తర్వాత రెండు నెలలకు శక సంవత్సరం 1602లో చైత్రపూర్ణిమనాడు శివాజీ మహారాజు మరణించాడు. ఈ విషయం తెలియగానే సమర్థ రామదాసు తన గదిలోకి వెళ్లిపోయాడు. అన్నం తినటం మానేసి, కేవలం పాలుమాత్రమే తీసుకునేవాడు. బయటకు రావటం మానివేశాడు. సమర్థ రామదాసు ఆరోగ్యం క్షీణించసాగింది. మాఘ కృష్ణనవమి శనివారంనాడు శ్రీరామ చంద్రుని ప్రతిమకు ఎదురుగా కూర్చుని సమాధిపొందాడు.

– అనంత కల్లోల

★★★

**సమయాన్ని వృధా చేస్తే, జీవితం పతనమవుతుంది.**

గాయత్రీ సాధన

# ఉపాసన + ఆత్మక్షాళన + సేవ

సర్వసులభమూ, సర్వతోముఖమూ అయిన గాయత్రీ సాధనద్వారా వ్యక్తి తన ఆత్మిక స్థాయిని పెంచుకోగలుగుతాడు; మహాపురుషుల వ్యక్తిత్వాలవంటి వ్యక్తిత్వాన్ని వికసింప జేసుకోగలుగుతాడు. ఈ సాధనలో భాగాలు మూడు – ఉపాసన, ఆత్మక్షాళన, సేవా సాధన.

## ఆత్మకు తాత్విక అవసరం ఉపాసన

ఉపాసన అనగా పరమేశ్వరుని సమీపంలో కూర్చొనడం. భజన, పూజ, జపం, ధ్యానములద్వారా అంతఃక్షేత్రంలోని మహాశక్తియొక్క దివ్య దర్శనం లభిస్తుంది; దాని సమీపంలో కూర్చొనగలుగుతాము; శ్రేష్ఠత్వపు వెలుగును ఆలోచనలో, వ్యవహరణలో నింపుకోవడానికి నియమబద్ధమైన ప్రయత్నం నిరంతరంగా కొనసాగుతుంది. **ఉపాసన ఆత్మకు తాత్వికమైన అవసరం.** పరమేశ్వరునితో సాన్నిహిత్యాన్ని పెంచుకోవడానికీ, ఆయన అనుగ్రహం పొందడానికీ ఉపాసన తప్పనిసరి. గాయత్రీ ఉపాసనలో నిత్యం 5 నిమిషాలనుండి 6 గంటలవరకు జపం, ధ్యానం జరపవచ్చు. ఇందుకు దినచర్యలో ఖచ్చితమైన స్థానం ఉండితీరాలి.

## ఆత్మ క్షాళనకు పద్ధతులు

ఆత్మ క్షాళనద్వారా జన్మ జన్మాంతరాలనుండి పేరుకుపోయిన పశు ప్రవృత్తులను నిర్మూలించాలి; మానవీయమైన సత్ప్రవత్తులను స్థాపించాలి.

ఉదయం నిద్రలేవగానే జీవన లక్ష్యం, దాని సదుపయోగములను స్మరించాలి. ఒక రోజును ఒక జన్మగా పరిగణించాలి. దానిని అత్యుత్తమంగా సద్వినియోగం చేయడానికై యోజనను, దినచర్యను తయారుచేయాలి. నిద్రలేచినప్పటినుండి నిద్రపోయేవరకూ ఆలోచనలను, కార్యకలాపాలను ఉత్కృష్టంగా ఉంచేందుకు ప్రయత్నించాలి. పొరపాట్లకు మనల్ని మనం నిందించుకోవాలి. తర్వాతి అడుగు మరింత మెలకువతో వేసే జాగ్రత్త తీసుకోవాలి. ప్రతిరోజూ ఈ క్రమం సాగాలి. ఫలితంగా – ఆత్మిక ప్రగతి దిశలో నిరంతరం పురోగమించగులుగుతాం. లక్ష్య సాధనకు మార్గం ఇదే.

అలాగే – రాత్రి నిద్రపోయే ముందు నిద్రయే మృత్యువని భావించాలి.

## ఇంద్రియ సంయమనం

ఇలా నియమబద్ధంగా ఆత్మక్షాళన చేసుకోవడం మరో కారణంవల్లకూడ అవసరం అవుతోంది. నేటి అవాంఛనీయ వాతావరణంలోని కాలుష్యం అంతఃకరణపై నిరంతరం జమ అవుతూ ఉంటుంది. అంతటా వ్యాపించి ఉన్న దుష్ట ప్రవృత్తులు మనల్ని ప్రభావితం చేస్తాయి. మనల్ని పతనంవైపు లాగికొనిపోతాయి. ఈ ప్రభావాన్ని జయించడానికై ఆలోచనలో పవిత్రత, మెదడులో సమతూకం, ఇంద్రియాలపై అదుపు అవసరం అవుతాయి. ఈ సంయమ సాధన ఆత్మక్షాళనలో అంతర్భాగం.

## భావ సంయమనం

ఉపయోగకరంగా, ప్రస్తుత కార్యాలపై లగ్నమయేవిధంగా ఆలోచనలను అదుపుచేయాలి. ఆలోచనలు ఆచరణకు పనికిరాని చెడు ఊహల వలలో పడకుండా చూచుకోవాలి. ఏకాగ్రత అడుగడుగునా అద్భుతాలు సాధిస్తుంది. ధ్యానయోగంద్వారా ఏకాగ్రతను సాధించగలుగుతాం. సిద్ధాంతాలపట్ల అంకితభావం ద్వారాకూడ ఈ పని జరుగుతుంది. తద్వారా మన ముందున్న కార్యాలలో తన్మయత్వంతో లీనమవుతాం. ఆ పనులు చేయడంలో ఆనందాన్ని అనుభవిస్తాం. పనిని ఉత్కృష్టతకూ, ప్రతిష్ఠకూ సంబంధించిన విషయంగా పరిగణిస్తాం. ఫలితంగా సాఫల్యం లభిస్తుంది. కీర్తి లభిస్తుంది. సంతృప్తి లభిస్తుంది. ప్రతి నిమిషం ఆలోచనలను అవసరమైన పనులపైననే లగ్నం చేయాలి; అనవసర విషయాలవైపు పరుగులు పెట్టకుండా వాటిని అదుపు చేయాలి. ఈ ప్రక్రియను అభ్యాసం చేయాలి. భావ సంయమనం అనే తపస్సు ఇది. ఇందువల్ల ఉజ్వల భవిష్యత్తు తథ్యం.

## సమయ సంయమనం

సమయ సంయమనం అంటే ఒక్క క్షణంకూడ వృధా కాకుండా జాగ్రత్తపడడం. పని, విశ్రాంతి క్రమబద్ధంగా ఉండాలి. పనిని పరమేశ్వర పూజగా పరిగణించాలి. నిరంతరం పనిలో

**పాత్రత లోపిస్తే, గౌరవాన్ని ఆశించలేము.**

నిమగ్నం కావాలి. పనులను ఆదర్శాలతో సమన్వయం చేయాలి. నిజాయితీతో, జవాబుదారీతో పనిచేయాలి. ఫలితంగా – మామూలు కార్యకలాపాలు సైతం కర్మయోగ సాధనలు అవుతాయి. యోగులకు అందే సత్ఫలితాలు మనకు అందుతాయి. కర్తవ్యపాలనకు అగ్రతమ ప్రాధాన్యం ఇవ్వాలి. అందులోనే నిండయిన సంతృప్తిని పొందాలి. అప్పుడు సాఫల్యం, వైఫల్యాలవైపు దృష్టి పోదు. ఇదే భగవద్గీతలో బోధించిన కర్మయోగం. కర్మయోగం జీవితంలోని మహత్తర సాధన అని కృష్ణ పరమాత్మ ప్రవచించాడు. భగవంతుని వరం మనకు శ్వాస రూపంలో లభించింది. దానిని వృథా చేయడం, చెడ్డ పనులకు వినియోగించడం, లేదా ఉదాత్త లక్ష్యాలకోసం అంకితంచేసి జీవనం యొక్క ప్రయోజనాన్ని పొందడం – ఈ రెంటిలో చేసే ఎంపిక ఆధారంగా మనిషి మూర్ఖత్వంకాని, విజ్ఞతకాని వెల్లడి అవుతుంది.

## ధన సంయమనం

ధనాన్ని సంపాదించడం తేలికే. దాన్ని సద్వినియోగ పరచడం కష్టసాధ్యం. జనం బాగా సంపాదిస్తారు. కానీ, ఆ సంపదను వ్యసనాలకూ, భోగ విలాసాలకూ, అహంకార ప్రదర్శనకూ వృథా చేస్తారు. కొందరు పిసినారులుగా తయారవుతారు. సంపదను తాము సద్వినియోగం చేయరు, ఇతరులను చేయనివ్వరు. డబ్బును కూడబెడితే – అది కుళ్లిపోయి, అహంకారాన్ని పెంచుతుంది; మనిషిని దుర్వ్యసనాల పాలు చేస్తుంది. వారసులుకూడ ఈ పాపపు సొమ్ముతో కొన్ని సౌకర్యాలు పొందవచ్చు. కానీ, వారి వ్యక్తిత్వాలు దిగజారే అవకాశాలు పెరుగుతాయి.

ప్రస్తుత పరిస్థితులలో అనవసరమైన సంతానాన్ని కనడం కూడ దుబారా ఖర్చే. కుటుంబంలోని ప్రస్తుత సభ్యులను చక్కగా తీర్చిదిద్దడానికీ అనేక సత్‌ప్రవృత్తులను అభివృద్ధి పరచడానికీ వినియోగించవలసిన ధనాన్ని అనవసరంగా సంతానాన్ని ఉత్పత్తిచేయడానికి వృథా చేయడం విజ్ఞత కాదు.

ఇలా ఇంద్రియ సంయమనానికీ, భావ సంయమనానికీ, సమయ సంయమనానికీ, ధన సంయమనానికీ అనువుగా సూత్రబద్ధమైన జీవనక్రమాన్ని నిర్ణయించుకోవాలి. ఇది ఆత్మ సంయమనం అనే తపస్సు. ఖచ్చితమైన దినచర్య, పై చతుర్విధ సంయమనం కలిస్తే, ఆత్మకళ్యాణం అనే లక్ష్యం పూర్తవుతుంది.

## సేవా సాధన

మనిషి సామాజిక జీవి. అతడి బ్రతుకుదెరువు, సంతృప్తి, ప్రగతి ఇతరుల సహకారంపై ఆధారపడి ఉన్నాయి. దాని ఋణాన్ని తీర్చుకోవాలి. భగవంతుడు మనకు మానవ జన్మ ఇచ్చాడు. ఇది ఆయన ఇచ్చే వరాలలో అత్యుత్తమమైనది. విశ్వమనే ఉద్యానవనాన్ని మరింత రమ్యంగా, మరింత సమున్నతంగా తీర్చిదిద్దడంలో సృష్టికర్తకు సాయపడడానికే ఈ నరజన్మ ఇవ్వబడింది. సేవా సాధనద్వారానే ఈ పని సాధ్యపడుతుంది. వ్యక్తి తన ఆశలను పరిమితం చేసుకోవాలి. సగటు భారతీయుని జీవన స్థాయిని స్వీకరించాలి. ఈ పని ఎంత హెచ్చుగా జరిగితే, సేవా సాధనకు అంత హెచ్చు అవకాశం లభిస్తుంది. ఆత్మ సంతృప్తి లభించాలంటే, అందుకు సేవా సాధన అనే మూల్యం చెల్లించాలి. ఔదార్యం, ఆత్మీయతవంటి సత్‌ప్రవృత్తులను పూర్తిగా వికసింప జేసుకోవడానికి ఒకే ఒక మార్గం సేవా సాధనకు అధికాధికంగా అంకితంకావడం.

## జ్ఞాన దానం

మనిషిలోని భావనల, ఆలోచనల స్థాయిని ఉత్కృష్టం చేయడమే అతడికి నిజమైన సేవ అవుతుంది. సద్గుణ సంపద పుష్కలంగా కలిగిన వ్యక్తి దుఃఖ, దారిద్ర్యముల వలనుండి వెలికిరాగలుగుతాడు. వ్యక్తిగత సమస్యలకూ, సామాజిక సమస్యలకూ అన్నింటికీ మూల కారణం ఆలోచనలలో వికృతి ఏర్పడడం. ఈ వికృతి తొలగించేది జ్ఞాన దానం. కనుక – జ్ఞాన దానమే ఉత్తమోత్తమమైన సేవాకార్యం.

సేవా సాధనకు మరోపేరు పరమార్థం. పరమార్థం అనే పదానికి మరో అర్థంకూడ ఉంది – పరమ + అర్థం. అనగా ఉత్కృష్టమైన దృష్టికోణం. సాధారణంగా మనుషులందరూ 'స్వ' (తన) కేంద్రంగా తమ కార్యకలాపాలు సాగిస్తూ ఉంటారు. ఇది స్వార్థ, సంకుచిత దృక్పథం. ఇలా స్వార్థంతో ఆశించింది అందకపోతే దుఃఖం కలుగుతుంది. ఉత్కృష్టమైన దృక్పథాన్ని, కర్తవ్య పాలన భావనను వికసింపజేసుకొని, జీవితంలో అనాసక్త యోగివలె పనిచేస్తే – నలువైపులా ఆనందమే ఆనందం వర్షిస్తూ ఉంటుంది.

## సంయుక్త సాధన

సర్వసులభమైన గాయత్రీ సాధనలోని మూడు అంగములు ఇవి. వీటిని కలిపి సాధన చేస్తే – గాయత్రీ సాధనద్వారా లభిస్తాయని శాస్త్రాలు చెప్పిన ప్రయోజనాలన్నీ లభిస్తాయి.

★★★

**ఇతరుల మంచిని చూస్తే, మన సద్గుణాలు వికసిస్తాయి.**

# మనం - మన ఆరోగ్యం

# ప్రాణాయామానికి సరళ విధానం

బ్రహ్మాండం ఒక మహా సాగరం. ఆ సాగరంలో ప్రాణతత్వ తరంగాలు ఎగసిపడుతున్నాయి. పిండంలోని జీవ సత్తాలో ఇమిడి ఉన్న ప్రాణతత్వం ఆత్మాగ్ని. బ్రహ్మాండంలో వ్యాపించి ఉన్న ప్రాణం బ్రహ్మాగ్ని. ఆత్మాగ్ని లఘువు, చిన్నది. బ్రహ్మాగ్ని విభువు, పెద్దది.

ఆత్మాగ్నికి బ్రహ్మాగ్ని నిరంతరం అందుతూ ఉండడం అవసరం. దీన్ని అందించే ప్రక్రియ ప్రాణాయామం.

ప్రాణ తత్వాన్ని పొడిగించడానికీ, పెంపొందించడానికీ చేసే ప్రక్రియ ప్రాణాయామం. ఈ ప్రక్రియ ద్వారా జీవాత్మయొక్క క్షుద్ర ప్రాణం (చిన్న ప్రాణం) విరాట్ చేతనయొక్క మహాప్రాణంతో ముడిపడుతుంది; దానితో సమతుల్యం అవుతుంది.

పూర్ణత్వాన్ని సంపాదించడానికి రాజమార్గం ప్రాణాయామం.

### "డీప్ బ్రీదింగ్" కాదు ప్రాణాయామం

"డీప్ బ్రీదింగ్", అనగా శ్వాసను గాఢంగా పీల్చి వదలడం ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది. దీనివల్ల ఊపిరితిత్తులకు ప్రాణవాయువు మరింతగా అందుతుంది. ఆరోగ్య సంరక్షణకూ, అభివృద్ధికీ ఇది దోహదం చేస్తుంది.

అయితే, శరీర శాస్త్ర నిపుణులు ప్రోత్సహించే ఈ ''డీప్ బ్రీదింగ్''కూ, ఆధ్యాత్మిక విజ్ఞానం బోధించే ప్రాణాయామానికీ చాలా తేడా ఉంది. గాఢంగా గాలి పీల్చి వదలడంవల్ల శరీరానికి స్థూలమైన ప్రయోజనం కలుగుతుంది. అయితే – యోగ విద్యలోని ప్రాణాయామం వల్ల బ్రహ్మాండం అంతటా వ్యాపించి ఉన్న ప్రాణతత్వాన్ని గ్రహించే అసాధారణ ప్రయోజనం కూడ అందుతుంది.

### ఆంతరిక వ్యవస్థల మేలుకొలుపు

వాస్తవానికి – ప్రాణాయామం వల్ల శ్వాస గమనంలో విశిష్టమైన మార్పు వస్తుంది. ప్రాణాయామంవల్ల అసాధారణమైన ఘర్షణ ఉత్పన్నం అవుతుంది. ఇది జీవిత నిర్వహణ అవసరాన్ని పూర్తిచేస్తుంది. అంతే కాదు. దానిని దాటి, శరీరంలో ప్రత్యేకమైన సంచలనాలను ఉత్పన్నం చేస్తుంది. కుడి, ఎడమ నాసికా రంధ్రాలనుండి ప్రవహించే ఇడ, పింగళ అనే విద్యుత్ ప్రవాహాలను ఉత్తేజపరుస్తుంది. అసాధారణమైన ఈ సంచలనాలు నిద్రాణమై ఉన్న ఆంతరిక వ్యవస్థలను మేలుకొలుపుతాయి. ఈ వ్యవస్థలు మామూలు జీవిత నిర్వహణకు అవసరం కావు. ఇవి మేలుకొన్న ఫలితంగా మనిషికి విశిష్ట స్థాయి కలిగిన అదనపు సామర్థ్యం అందుతుంది.

ప్రాణాయామం శ్వాస గమనాన్ని తీవ్రతరం చేయదు. ఆ గమనాన్ని తాళబద్ధం, క్రమబద్ధం చేస్తుంది. ఈ తాళం, లయ, క్రమముల మార్పులు ఆధారంగా ప్రాణాయామంలో అనేక పద్ధతులు ఏర్పడ్డాయి. ఒక్కొక్క పద్ధతికీ ఒక్కొక్క ప్రయోజనం ఉంది. ఈ పద్ధతులలో కొన్ని సులువైనవి, కొన్ని కఠినమైనవి.

### సరళ ప్రాణాయామం ఇది

శ్వాస గాఢంగా పీల్చాలి. ఊపిరితిత్తులను పూర్తిగా ఖాళీ చేసి దానిని బయటికి వదలాలి. శ్వాస పీల్చుతూన్నప్పుడు – విశ్వ ప్రాణం మనలోపల ప్రవేశిస్తూన్నదనీ, స్థిరపడుతూన్నదనీ భావన చేయాలి. శ్వాస వదులుతూన్నప్పుడు

**ఏకాగ్రతను మించిన అద్భుత శక్తి లేదు.**

ఇలా భావన చేయాలి - బలహీనతలూ, రోగాలూ, అనైతికతలూ అన్నీ బయటికి వెళ్లిపోతున్నాయి; అవి తిరిగి రావు.

ఇలా శ్వాస పీల్చి వదలడం ఒక ప్రాణాయామం. దీన్ని కనీసం మూడుమారులు చేయాలి. వారానికి ఒకటి వంతున ఈ సంఖ్యను పెంచాలి.

### సంకల్పం, భావన, దృఢ విశ్వాసం

గుర్తుంచుకోండి. గాఢంగా శ్వాస పీల్చి వదలడం మాత్రమే ప్రాణాయామం కాదు. దానితోపాటు సంకల్పం, భావన, దృఢ విశ్వాసం కూడ ముడిపడి ఉండాలి. ఈ విధంగా మనలో ప్రాణతత్వం యొక్క పరిమాణాన్ని నిరంతరం పెంచాలి. అది అఖిల బ్రహ్మాండంలో వ్యాపించి ఉన్నట్లు అనుభూతి పొందాలి. పీల్చుతూన్నప్పుడు అందుకు అనుగుణంగా భావన చేయాలి. ఈ ఆకర్షణవల్ల ప్రాణతత్వం అధిక పరిమాణంలో అంతరిక్షంనుండి మన శ్వాసలోనికి లాగబడుతూ ఉంటుంది, మన శ్వాసలో కలిసిపోతూ ఉంటుంది.

ప్రాణయామంలో ఉచ్ఛ్వాస నిశ్వాసముల ప్రత్యేక ప్రక్రియ, సాధకుని సంకల్ప శక్తి మేళవిస్తాయి. అపుడు అది మామూలుగా శ్వాస పీల్చడంగా మిగిలిపోదు. విశిష్టమైన శక్తిని పొందేందుకు ప్రత్యేక ఆధారంగా మారుతుంది.

### సిద్ధులకు ఆధారం

ఈ ప్రక్రియద్వారా ప్రాణతత్వాన్ని ఒక పద్ధతి ప్రకారం ఆకర్షించడం, నిలుపుకోవడం జరుగుతుంది. ఫలితంగా ఓజస్సు పొంగి వెలికి వస్తుంది; సాధకుడు మనస్వి, తేజస్వి, ఓజస్వి అవుతాడు.

సిద్ధులకూ, మహిమలకూ ఆధారం ప్రాణశక్తిని తీక్షణం చేయడమే.

★★★

## పరమవీరచక్ర - మేజర్ సోమనాథశర్మ

1947లో మనదేశం విభజింపబడింది. అప్పుడే పాకిస్థాన్ కాబూలీల రూపంలో భారతదేశంపై దురాక్రమణ జరిపింది. ఈ దురాక్రమణ కాశ్మీర్‌లో మొదలైంది. మేజర్ సోమనాథశర్మ శ్రీనగర్ సమీపంలో ఉన్న బడ్‌గావ్ విమానాశ్రయం వద్ద ఉన్నాడు. దాని రక్షణ బాధ్యత ఆయనకు అప్పగించబడింది. ఈ విమానాశ్రయం చాలా కీలకమైన చోట ఉంది. సోమనాథశర్మ వద్ద అప్పుడు ఎనభైమంది సైనికులు మాత్రమే ఉన్నారు. ఆయుధ సామగ్రి కూడా తక్కువగా ఉంది. శత్రువులు మూడువైపుల నుండి దాడిచేశారు. భీకర పోరాటం జరిగింది. సోమనాథశర్మ స్వయంగా సైనికులతోపాటు యుద్ధరంగంలో ఉన్నాడు. కాబూలీలు చూస్తే ఆసంఖ్యాకంగా ఉన్నారు. ఆరుగంటల పాటు వరుసగా తుపాకీ గుండ్ల వర్షం కురిసింది. ఇంతలో సోమనాథశర్మకు సమీపంలోనే ఒక బాంబు వచ్చి పడింది. బాంబు పేలి శర్మకు బాగా దెబ్బ తగిలింది. శర్మ సైనికులను ఆదేశించాడు, 'నాకోసం చూడవద్దు. విమానాశ్రయాన్ని రక్షించండి, శత్రువులు ముందుకు చొచ్చుకొని రాకుండా చూడండి.' ఈ మాటలు చెప్పి వెంటనే శర్మ ప్రాణాలు వదిలాడు. ఈలోగా ప్రధాన సైనిక స్థావరం నుండి అదనపు బలగాలు వచ్చి చేరాయి. విమానాశ్రయం రక్షింపబడింది. సోమనాథ శర్మ మాత్రం లేకుండా పోయినాడు. అతని వీరగాథ చరిత్ర పుటలలో వ్రాయబడింది.

నాటి భారత రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ మొట్టమొదటి అత్యున్నత వీరపతకం 'పరమవీరచక్ర'ను బహూకరించి శర్మకు నివాళు లర్పించారు. సోమనాథశర్మ తండ్రి శ్రీఅమర్ ఈ పతకాన్ని స్వీకరించాడు. మేజర్ సోమనాథశర్మ శౌర్యపరాక్రమాలకు భారతదేశ ప్రజలు నిరంతరం గర్విస్తుంటారు.

**వ్యాకులతకు సగం కారణం నీలోనే ఉంది.**

## రమణ మహర్షి వర్ధంతి వ్యాసం

# ఆధ్యాత్మిక కాంతులను విరజిమ్మే తేజోరాశి శ్రీరమణులు

తమిళనాడులో మదురై దగ్గరగా ఉన్న తిరుచ్చుళి గ్రామంలో 1879 డిశంబరు 30 తేదీన వెంకట్రామన్ జన్మించారు. ఆయనే తర్వాత రమణ మహర్షి అనే నామంతో విశ్వవిఖ్యాతి పొందారు. మదురైలో చదువుకునే రోజుల్లో తన 17వ ఏట ఎట్టి సాధనలు లేకుండా కొద్ది నిమిషాలలో ఆయనకు ఆత్మసాక్షాత్కారం కలిగింది. ఆయన ఎవ్వరితో చెప్పకుండా 1896 సంవత్సరంలో అరుణాచలానికి బయలుదేరి వెళ్ళి జ్యోతిర్లింగమైన అరుణాచలేశ్వరుని గాఢాలింగనం చేసుకొని "తండ్రీ! నీ ఆజ్ఞ మేరకు వచ్చాను" - అని ఆ తండ్రికి తన రాకను తెల్పుకున్నాడు. ఆనాటి నుంచి ఆమరణాంతం అరుణాచలం వదలలేదు. అరుణాచలేశ్వరుని ఆలయంలోని వివిధ ఏకాంత స్థలాలలో సమాధినిష్ఠలో గడిపారు. 1907లో మహాకవి, మంత్రసిద్ధుడు శ్రీకావ్య కంఠగణపతి ముని అరుణ గిరిపై విరూపాక్షి గుహలో ఉన్న ఆ బాలస్వామిని సందర్శించి, ఆయన వద్ద ఉపదేశం పొందారు. ఆ ఉపదేశానికి ఉప్పొంగిపోయి ఆయనను భగవాన్ శ్రీరమణ మహర్షి అని ప్రకటించారు. శ్రీ గణపతిమునికి గల వేలాది శిష్యులు శ్రీ రమణ భక్తులయ్యారు.

1922లో అరుణ గిరిపై స్కంధాశ్రమంలో ఉండగా రమణ మహర్షి తల్లికి మోక్షాన్ని ప్రసాదించారు. ఆమె దేహాన్ని కొండపాదంలో సమాధిచేసి మాతృ భూతేశ్వరాలయం నిర్మించారు. అదే నేటి రమణాశ్రమం. అది శ్రీరమణ శక్తి సంచారానికి దివ్య పరిణామంగా దీపిస్తోంది. అప్పటినుండి శ్రీరమణుల కీర్తి దేశదేశాలు వ్యాపించింది. ప్రపంచం నలుమూలలనుండి జిజ్ఞాసువులు వచ్చి రమణుని దర్శించుకున్నారు. ఆయన రచించిన పుస్తకాలు ఎన్నో భాషలలోకి తర్జుమా చేశారు. 1950 ఏప్రియల్ 14న రెండు సంవత్సరాలుగా బాధిస్తున్న సర్కోమావల్ల ఆయన తనువు చాలించారు.

### శ్రీరమణ విశిష్టత

1. శ్రీరమణులు పుట్టినపుడు ఒక గ్రుడ్డి అవ్వకూడ చూడగలిగిన తేజోరూపంలో ఈ భూమిమీద అవతరించి, నిర్వాణ సమయంలో అనేక వేలమంది చూస్తూ ఉండగా ఈశాన్యదిశగా మెల్లగా పయనిస్తూ తేజోరూపంలో అరుణగిరిలో అంతర్లీనమయ్యారు.
2. శ్రీరమణులు తండ్రికే జ్ఞానాన్ని బోధించిన కుమారస్వామి అవతారం. అందుచే ఎట్టి దీర్ఘ జటిల సాధనలు లేకుండానే, 17 సం॥లకే జ్ఞానాన్ని పొంది కలియుగానికి గురువయ్యారు. జ్ఞాన ప్రదాత అయ్యారు.
3. శ్రీరమణులకు గురువు లేదు. శిష్యుడు కూడా లేదు. జ్ఞాని దృష్టిలో గురువెవరు? శిష్యుడెవరు? శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, ఆది శంకరులు మొదలుగాగలవారికి గురు వవసరమయ్యారు. అంతే కాదు. సన్యాస దీక్ష తీసుకోవటానికి భార్య లేక తల్లి అనుజ్ఞలేనిదే జ్ఞాన నిరోధం ఏర్పడుతుంది. శ్రీరమణులు ఈ శాస్త్రపరిధిని దాటి చిన్న గోచిగుడ్డతో అత్యాశ్రమిగా స్థిరపడ్డారు.
4. ఋషి అంటే ఆధ్యాత్మిక మార్గంలో నూతన సత్యాన్ని కనుగొన్న వాడని అర్థం. శ్రీరమణ మహర్షి బోధించిన నూతన సత్యాలు (1) ఆత్మ శరీరంలో ఎదురు రొమ్ముకు కుడివైపున ఉంది - ఇది యోగశాస్త్రానికే నూతనాధ్యాయం. ఆ హృదయమే శక్తి కేంద్రం. దీనినుండి సహస్రారానికి "అమృతనాడి" లేక పరానాడి ఉంది. అదే జ్ఞానవాడి. అది అజ్ఞానిలో మూతపడి ఉంటుంది. దీన్ని తెరవటమే మోక్షం. అదే సాంప్రదాయ మార్గంలో అయితే మూలాధారంలో కుండలినిని ప్రజ్వలింపచేయటం.
   (2) ''నేను'' అనేది మహామంత్రం. ఓంకారంకన్నా శక్తివంతమైంది. ఇది భగవంతుని మొదటి నామం. ఓంకారాన్ని జపించేవాడు "నేనే" కదా? ఇది మంత్ర శాస్త్రానికి నూతనాధ్యాయం. ముక్తి అంటే పరిమితమైన నేను నశించి పరిపూర్ణమైన నేనుగా రూపొందటం.
5. సాంప్రదాయ మార్గంలో సమాధులలో నిర్వికల్పసమాధే గొప్పదిగా అంతిమ స్థితిగా భావింపబడింది. కానీ రమణ మహర్షి ప్రపంచంలో మనందరి మధ్యా ఉండి, అన్ని పనులూ చేస్తూ "సహజ నిర్వికల్ప సమాధి" లో అంటే తలుపులులేని స్థితిలో ఉన్నారు. శ్రీరమణులు "జ్ఞానానికి కర్మకు వైరుధ్యం

**ఎదురుచూచేవాడు నిలిచిపోతాడు; బయలుదేరేవాడు తారలను చేరతాడు.**

లేదు. అట్లా ఉంటే అది జ్ఞానమే కాదు" - అని చెప్పారు. శ్రీరమణ జీవితంలో కర్మ - భక్తి - జ్ఞానములు చక్కగా సమన్వయం చెందాయి.

6. దక్షిణామూర్తివలె - రమణుల మౌనశక్తి అపారం. స్వామి వివేకానంద, గౌతమబుద్ధుడు, ఆది శంకరులు మిగతా మతప్రవక్తలందరూ తాము పొందిన సత్యాన్ని ప్రపంచానికి బోధించటానికి శిష్యవర్గాన్ని సమకూర్చుకొని దేశాలు పర్యటించారు. కాని రమణమహర్షి 17వ ఏట అరుణాచలం వచ్చి అచటనే 70 సం ॥ వరకు ఉండి మౌనం ద్వారా ప్రపంచంలో అర్హులైన ప్రతివారిని ఆత్మ శక్తిచేత కదిలించారు. "మౌనం మాటకంటే అత్యంత శక్తివంతమైంది. దానికి కాల దూరాలు లేవు. గంటలకొద్దీ ఉపన్యాసాలు రవంత అభివృద్ధి పరచకపోవచ్చు. కాన మౌనం నిరంతర వాక్ ప్రవాహం. ఈ శరీరం పోయినా ఆ మౌనశక్తి పనిచేస్తూ ఉంటుంది. "ఉన్నచోటునే ఉండిన ఋషులే ఆత్మాన్వేషణా పథంలో విశ్వమంతా వెలుగుల్ని వెలిగించిన మహోపకారులు" - అని శ్రీరమణులు చెప్పారు. ఆయన మౌనం ద్వారా పశుపక్ష్యాదులతో మాట్లాడేవారు. క్రూరజంతువులు సహితం శ్రీరమణుల సన్నిధిలో శతృత్వం మరచి మెలగేవి. పాశ్చాత్య దేశస్థుడు పాల్ బ్రంటన్ తాను వ్రాసిన "భారతావనిలో నా రహస్య అన్వేషణ" అనే పుస్తకంలో శ్రీరమణుల మౌనశక్తిని, తన అనుభవాన్ని అద్వితీయంగా వర్ణించారు.

7. శ్రీ రమణుల సన్నిధిలో ఎందరో ప్రశ్నలు, సందేహాలు అడగటానికి వచ్చి, ఆయన మౌన గంభీర శాంతి సాగరంలో మునిగిపోయేవారు. అడగటానికి ప్రశ్నించేవాడు ఏడీ? సందేహించేవాడు పోయి, సందేహ నివృత్తులయ్యేవారు, ఆయన తేజోపూర్ణములైన నేత్రముల నుండి కరుణ లహరి ప్రవహిస్తూ, ఆ వీక్షణం ఎదుటివారి హృదయంలోకి జొచ్చి వారిని అంతర్ముఖ పరిచేది. శ్రీరమణులు ఛలోక్తిగా - దీక్ష ఇవ్వలేదంటారే. ఇస్తున్నానుగా "వీక్షణ దీక్ష" అనేవారు. అలా దీక్ష తీసుకున్నట్లు ఆ భక్తులకు కూడా తెలిసేది కాదు. అంత నిగూఢంగా ఆ ప్రక్రియ జరిగేది. అది భగవాన్ అనుగ్రహ కౌశలం.

8. శ్రీరమణ మహర్షి తన తల్లి అలగమ్మకు అవసానదశలో హస్తదీక్ష ద్వారా తన ఆత్మశక్తిని ప్రవేశపెట్టి ఆమె అనేక జన్మల ప్రారబ్ధాన్ని కొన్ని గంటల కాలంలోనే అనుభవింపజేసి మోక్షాన్ని ప్రసాదించారు. మోక్షమార్గాన్ని చూపేవారే కాక మోక్షానుగ్రహదక్షులని నిరూపించుకున్నారు.

9. "తలపులు లేని స్థితి జ్ఞాన స్థితి. అయితే భక్తుల ప్రార్థన భావ తరంగ రూపంలో జ్ఞాన హృదయానికి సోకగానే జ్ఞాని సంకల్పం లేకుండానే, ఆ దైవీ శక్తి స్వయం చలితమై భక్తుని రక్షిస్తుంది" - అని వివరించారు. అనేక రమణ భక్తుల కోర్కెలు అలా తీరేవి. అవి వారి స్వానుభవాలు.

10. శ్రీ రమణులు అరుణాచలానికి 17వ సం॥లోనే వచ్చి ఎక్కడకూ వెళ్లలేదు. కాని తమిళం, సంస్కృతం, ఆంధ్ర, మళయాళ భాషలలో అనేక రచనలు చేశారు, నే నెవడను, ఉన్నది నలుబది, ఉపదేశసారం, అరుణాచల స్తుతి పంచకం వాటిలో కొన్ని. అవి ప్రత్యక్షజ్ఞానమైన ఆత్మనుండి సూటిగా రావటం చేత వాటిలో దివ్యకవిత్వం జాలువారింది. ఆత్మజ్ఞానం, సకలజ్ఞానాలకు ఆలవాలమని, ఆధారమని ఆయన రూఢి పరిచారు. శ్రీరమణులు ద్రష్ట, ప్రవక్త కారు. సకల శాస్త్రములకు ఆయన జీవితం సజీవ భాష్యం.

11. శ్రీవినోబా భావే "శ్రీ రమణులు చూపినంతటి సమత్వం ఈ భూమండలం మీద అవతరించిన ఏ ఋషీ చూపలేద"ని అన్నారు. ఆ సన్నిధిలో శాంతి సౌరభం పరిమళిస్తూ ఉంటుంది. శ్రీ అరవిందులు శ్రీ రమణులను శాంతి సముద్రుడు. (Prince of Peace) అని అభివర్ణించారు. గాంధీజీ మనోవేదన అనుభవించేవారిని రమణ సన్నిధిలో కొన్ని దినాలు ఉండి శాంతి పూరించుకురండని పంపేవారు. శ్రీ రమణుల ప్రేమవాహిని సమస్త చరాచరాన్ని - మనిషి, జంతువు, పక్షి, చెట్టు, రాయి అనే భేదం లేకుండా సమస్తాన్ని ముంచెత్తింది. అందుచేత ఆయన తల్లికే కాక ఆశ్రమంలో ఉన్న గోవు లక్ష్మికి, తదితర పశు పక్ష్యాదులకు కూడా మోక్షాన్ని అనుగ్రహించారు.

12. "నేను ఎవడను'' అను రమణుని విచారణా మార్గం ప్రత్యేకమైనది. సూటియైనది. స్వీయానుభవం నుండి వెలువడింది. శ్రీ రమణులు ఇలా వివరించారు - "ఒక రోజు నా 17వ యేట మదురై ఇంటి వద్ద ఒంటరిగా ఉండగా నన్ను మృత్యుభీతి ఆవహించింది. ఒక అనూహ్యమైన శక్తి నాలో ఉద్భవించి నన్ను లోగొని అంతర్ముఖ పరచింది. శరీరం

**పొగడ్తకోసం పడిచచ్చేవాడి యోగ్యత మేడిపండే.**

శవమైంది. శ్వాస కట్టుపడింది. కాని ఆశ్చర్యం! నాలో నేను, నేను, అను స్ఫురణ తెలుస్తూనే ఉంది. అది నా శరీరానికి భిన్నమైనదిగా గ్రహించి, శరీరాన్ని సాక్షిగా చూస్తున్నాను. ఈ శవమైన శరీరాన్ని బూడిద చేస్తారు. దాంతో నేను అంతమేనా? నేను ఈ దేహం కాదు – అని ధృవపడింది. మృత్యుభయం శాశ్వతంగా అంతరించింది. మృత్యువు లేకుండా ఎల్లప్పుడు ఉండేవాడినేనని అనుభవ పూర్వకంగా గ్రహించాను." ఆయన ఆత్మాన్వేషణకు తన విచారణా మార్గాన్ని (నేనెవడనని అంటూ లోచూపుతో 'నేను' పుట్టుక స్థానాన్ని అన్వేషించడం) తన స్వీయానుభవం ద్వారా బోధించారు. సాంప్రదాయ మార్గం వర్ణాశ్రమ, మత బద్ధమై తర్కకర్కశమై పరిమితమై పోయింది. శ్రీరమణుల విచారణామార్గం దేశకాలాతీతం. ఒక హేతువాదికి, నాస్తికునకే కాక ప్రపంచంలో ఉండే ప్రతి వారికి, తాను చేరవలసిన సత్యం తనలో అత్యంత సమీపంలోను, అందుబాటులోను ఉంది. దేవుడు లేడనవచ్చు కాని "నేను" లేనని ఎవరూ అనలేరు కదా! నేను ప్రతివారికి నిత్య ప్రత్యక్షానుభవం.

13. విచారణా మార్గంలో ఆత్మ అనుగ్రహ గుణం కలది. ఆత్మనుండి సాధకునకు ఎంతో సహకారం లభిస్తుంది. నీవు కొంత కృషిచేసి అంతర్ముఖుడవుకా. అక్కడ నీవు ఒంటరిగా లేవు. అక్కడ ఆత్మ నీకోసం నిరీక్షిస్తూ ఉవ్వెత్తున పైకి లేచి నిన్ను లోనికి గుంజివేయడానికి సిద్ధంగా ఉంది. అందుచే ఈ మార్గంలో శరణాగతికి సముచిత స్థానం లభించింది. ఇది శ్రీరమణుల స్వానుభవం. ఈ మార్గంలో శాస్త్ర పాండిత్యం, మత బద్ధమైన అర్హతలతో నిమిత్తం లేదు. ఈ విశిష్టత వల్లనే పాశ్చాత్య ప్రపంచమంతా ఈ విచారణా మార్గానికి ఆకర్షితులౌతున్నారు. ఈ మార్గం ఆధునికులకు అత్యంత ఉపయుక్తం.

14. "లయవినాశనే, ఉభయరోధనే" – మనస్సును నిరోధించుటకు లయము, వినాశము అను రెండు మార్గములు కలవు. లయమైనది మళ్లీ విజృంభిస్తుంది. మనస్సులో నశించకుండా ఏ ఒక్క ఆలోచన ఉన్నా మళ్లీ జన్మ తప్పదు. శ్రీ రమణుల విచారణా మార్గం మనోనాశనానికే దారి తీస్తుంది. ఇది ఈ మార్గములోని విశిష్టత.

15. కైలాసం శివుని ఆవాసం. అరుణాచలం సాక్షాత్ శివుడే. స్కాందశివ, లింగపురాణాలు అరుణాచలం సాక్షాత్తు శివుడనీ, ఆ శివుణ్ణి ఆశ్రయించుకొని శివ గణం, సిద్ధులు, ఋషులు ఉంటారని, ఈ అరుణగిరికి మూడు యోజనాల దూరం లోపల నివసించేవారికి ఆచరించ తగిన నియమాలు లేకపోయినప్పటికి శివ సాయుజ్యం కలుగుతుందనీ, సాక్షాత్ అరుణాచల శివుడే సిద్ధరూపంలో అరుణగిరిపై తపస్సు చేస్తున్నాడని, "అరుణాచలా" అని స్మరించినంత మాత్రాన్నే ముక్తి లభిస్తుందని, అరుణగిరి ప్రదక్షిణం ముక్తి నిస్తుందని ఎంతగానో కొనియాడినవి. పురాణాల్లో పేర్కొనబడింది యథార్థమేనని స్వయంగా తన జ్ఞాననేత్రంతో చూచి చెపుతున్నానని రమణ మహర్షి చెప్పారు. ఎవరిని ఏమీ అడగని శ్రీరమణులు ప్రతివారినీ అరుణగిరి ప్రదక్షిణం చేసి రమ్మని కోరే వారు. స్వయంగా ఆయనే చాలాసార్లు అరుణగిరి ప్రదక్షిణం చేశారు. అరుణాచలాన్ని స్తుతిస్తూ శ్రీరమణులు వ్రాసిన అరుణాచల స్తుతి పంచకంలో పరాభక్తి తాండవిస్తుంది. అలా శివునకు శరణాగతి చెంది ముక్తిని పొందటానికి ఒక అపూర్వమైన క్షేత్రాన్ని కూడ రమణులు మనందరికీ అందించారు. ఆత్మ విచారం కష్టం అనే వారికి అలా శరణాగతి మార్గాన్ని సూచించారు.

16. స్వామి వివేకానంద 1897లో అమెరికానుండి వచ్చి కొలంబోలో ఇచ్చిన ఉపన్యాసంలో దక్షిణ భారతదేశం నుండి ఒక ఆత్మశక్తి ఉత్తుంగ తరంగంగా లేచి ఒక్క భారదేశాన్నేకాక యావత్ప్రపంచాన్నే ఆధ్యాత్మికశక్తితో ముంచెత్తి వేస్తుందని భవిష్యత్‌వాణి వెల్లడించారు. సుప్రసిద్ధ మానసికశాస్త్రవేత్త కార్లే యంగ్ తన గ్రంథం (Way to self) 'ఆత్మాన్వేషణ'లో మహర్షి గూర్చి ఇలా వ్రాశాడు – "భారతమాత కన్న నిజమైన బిడ్డ శ్రీరమణులు. వారి జీవితం స్వచ్ఛమైంది. విలక్షణమైంది కూడా. భారతావనిలో ఆధ్యాత్మిక ధవళకాంతులు విరజిమ్మే తేజోరాశి అది. ఆయన జీవితం, బోధలు మానవజాతిని విముక్తులను చేయగల వీచికలు. యుగ యుగాల గీతికలు. అవి అపస్మారంలో తన్నుతాను మరచిపోయి దారితప్పనున్న మానవాళికి హెచ్చరికలు కూడా."

– ఆకునూరి సాంబశివరావు

★★★

**మంటను ఆర్పడానికి నీళ్లు కావాలి; కోపాన్ని ఆపడానికి ప్రేమ కావాలి.**

వ్యక్తి నిర్మాణం

# ఆత్మవిశ్వాసంలో అద్భుతశక్తి

## మనోబలం మహత్తర వైభవం

మానసికంగా ఓడిపోయిన వ్యక్తి అన్ని రంగాలలో ఓడిపోతాడు. తన విజయంలో పూర్తి నమ్మకం కలిగిన వ్యక్తి పరిస్థితి ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంటుంది. తనలో అద్భుతమైన శక్తి సామర్థ్యాల భాండారం ఉన్నదని అతడు గుర్తిస్తాడు. తనకా సంగతి ఇంతవరకు తెలియనే లేదని భావిస్తాడు. ఆ విషయం గురించి ఆలోచించే అవకాశం రాలేదని అతడు అనుకుంటాడు.

వాస్తవానికి – మనిషిలోని మనోబలమే మహత్తర వైభవం. ఆ మనోబలం ఆసరాగా మనిషి మనీషిగా మారతాడు. తక్కువ యోగ్యత కలిగి ఉన్నప్పటికీ, సమర్థులని పిలబడేవారిని చిత్తుచేస్తాడు. ఆత్మవిశ్వాసం కలిగిన తాబేలు మనసు నిలకడలేని కుందేలును పరుగు పందెంలో ఓడించిన కథ తెలిసిందే.

తాము దీనులమనీ, హీనులమనీ, బలహీనులమనీ భావించేవారి మనోబలం ఇట్టే దిగజారిపోతుంది. నేటికన్న రేపును మరింత ఉత్తమంగా మలచుదామనే ఆలోచనే వారికి తట్టదు. **తనను తాను సహాయం చేసుకోని వ్యక్తికి సహాయం అందించడానికి దేవుడుకూడా ముందుకురాడు.**

గర్భంలో ఉన్న పిండానికి తగినంత బలం వచ్చిన తర్వాత అది గర్భం బయటికి రావడానికి ప్రయత్నిస్తుంది. కష్టాలను ఎదిరించి నిలబడడానికి మరో పేరే 'ప్రసవ వేదన.' ఆ వేదన తర్వాతనే శిశువు జన్మించడం సాధ్యమవుతుంది. పిండం చాలా బలహీనంగా ఉంటే, బయటికి వచ్చేందుకు అది క్రియాశీలత చూపకపోతే – దానికి సరైన స్థితిలో జన్మించే అవకాశమే ఉండదు ఒకోసారి.

గ్రుడ్డు లోపల ఉన్న అండం పక్వం అయినపుడు, బయటికి రావలసిన అవసరం దానికి అనుభవం అయినప్పుడు – గ్రుడ్డును చీల్చడానికై లోపలనుండే అది బలాన్ని ప్రయోగిస్తుంది. గ్రుడ్డు చీలుతుంది. పిల్ల బయటికి వస్తుంది.

ఇలా జన్మించడానికి ముందే అది ఆత్మవిశ్వాసాన్నీ, పరాక్రమాన్నీ నేర్చుకుంటుంది. జీవితమంతా వాటిని మరచిపోదు. కష్టాలను ఎదిరిస్తుంది. ప్రగతి పథంలో ముందుకుపోవడానికి ప్రతి క్షణం ప్రయత్నిస్తుంది.

ఇలాంటి మానసిక స్థితి ఉన్నప్పుడే వ్యక్తి స్వతంత్రంగా నిర్ణయం తీసుకోగలుగుతాడు. తన పరిస్థితికి అనుగుణంగా కోరుకున్న లక్ష్యాల కోసం సాహసంతో ముందడుగువేయడం సాధ్యపడుతుంది. ఈ మౌలిక సామర్థ్యం లేని వ్యక్తి, ఆత్మబలంలేని వ్యక్తి సాయంకోసం ఇతరులను ప్రాధేయపడుతూ ఉంటాడు. అవకాశం వచ్చి తన ఒడిలో పడాలనీ, సాఫల్యం పైకప్పు చీల్చుకుని సావిట్లోకి దూకుతుందనీ కొందరు ఎదురుచూస్తూ కూర్చుంటారు ఇలాంటి నీరస మనస్తత్వం కలిగిన వ్యక్తులు నిరాశ చెంది అదృష్టవాదులుగా మారుతారు. లేదా ఊహల పల్లకీలో ఊరేగుతూ ఉంటారు. గాలిమేడలు కడుతూ ఉంటారు. పగటి కలలు కంటూ ఉంటారు.

## తీగలోని విద్యుత్తు ఆత్మవిశ్వాసం

విద్యుత్ తీగలో విద్యుత్తు ప్రవహిస్తూ ఉన్నప్పుడే బల్బు వెలుగుతుంది, ఫ్యాను తిరుగుతుంది. ఆ విద్యుత్తు ఆగిపోతే – బల్బూ వెలగదు, ఫ్యానూ తిరగదు. ఆత్మవిశ్వాసం ఒక విధమైన విద్యుచ్ఛక్తి. అది వ్యక్తులలో పలు విధములైన ప్రత్యేకతలను ఉప్పొంగజేస్తుంది. నిద్రాణమై ఉన్న సామర్థ్యాలను మేలుకొలుపుతుంది. ఫలితంగా వ్యక్తి అద్భుతాలను సాధిస్తాడు. తన కార్యకలాపాల ద్వారా పలువురిని ప్రభావితులను చేస్తాడు. వారిని ప్రతిభావంతులుగా మలచుతాడు. మనిషిలోని సామర్థ్యంలో సగం శరీరంలో, కౌశల్యంలో ఉంటుంది; మిగతా సగం ఆత్మవిశ్వాసంలో ఉంటుంది. ఇది అక్షర సత్యం.

## ఆత్మవిశ్వాసం ద్వారా ఆత్మగౌరవం

ఆత్మవిశ్వాసం ఆత్మగౌరవాన్ని వికసింపజేస్తుంది. అనుగుణమైన మనఃస్థితినీ, పరిస్థితినీ నిర్మాణం చేస్తుంది. భూమిలోని సారం, విత్తనంలోని బలం కలిస్తే అంకురం ఏర్పడుతుంది. ఆ అంకురం మొక్క అవుతుంది. మహా వృక్షం అవుతుంది. అయితే ఇందుకు చాలా సమయం పడుతుంది. ఒకనాటి అంకురమే వికాసక్రమంలో పువ్వులతో, పండ్లతో, కొమ్మలతో, రెమ్మలతో నీడ ఇచ్చే మహావృక్షం అవుతుంది. ఈ వికాసక్రమం ఆత్మవిశ్వాసపరునికి వర్తిస్తుంది. అతడు హేయమైన పరిస్థితిలో అణిగి పడి ఉండలేడు. మామూలు జనంలా బ్రతుకు దెరువు సాగించడంతో తృప్తిపడి ఊరుకోలేడు. ఆత్మవిశ్వాసంలో ఉన్న మహత్తర సామర్థ్యం ఇదే. ఆత్మవిశ్వాసంలో ఉన్న అద్భుతం ఇదే.

★★★

నమ్రతతో కూడిన ప్రసన్నత గొప్పతనానికి చిహ్నం.

ఆచరణలో అధ్యాత్మ

# సుఖాన్ని పొందడం ఎలా?

తమకు కలిగిన ఏదో ఒక దుఃఖాన్ని గురించి ఏడుస్తూ ఉండే వ్యక్తులు చాలామంది కనబడతారు నేటి ప్రపంచంలో. ప్రపంచంలో వాళ్లను మించిన దుఃఖితులు లేరని అనిపిస్తుంది కొందరి మాటలు వింటూ ఉంటే. నిజానికి ఇలాంటి వ్యక్తులు తమ పరిస్థితి గురించి మాత్రమే ఆలోచిస్తూ ఉంటారు. ఇతరులను గురించి ఎన్నడూ ఆలోచించరు.

మరో విషయం ఏమిటంటే - వారు తప్పులు తాము చేస్తారు. దుఃఖాలకు కారణాన్ని ఇతరుల మీద రుద్దుతారు. ఒకోసారి దైవాన్ని నిందిస్తారు. దేవుడికి మామీద దయలేదు, ఆయన మాకు రకరకాల దుఃఖాలు కలిగిస్తున్నాడు - అని నెపం వేస్తారు. ఫలానా వ్యక్తి తమను వ్యతిరేకిస్తున్నాడనీ, తమకు కష్ట నష్టాలు తెచ్చిపెడుతున్నాడనీ ఆరోపిస్తారు.

ఇలాంటి ఆలోచనలన్నీ వట్టి భ్రమలు.

## మన కర్మకు బాధ్యులం మనమే

దుఃఖాలనుండి బయటపడాలనే కోరిక నిజంగా మనకు ఉంటే - మనం మొట్టమొదట ఒక పని చేయాలి. ఏదో ఒక వస్తువుకాని, ఎవరో ఒక వ్యక్తికాని మన దుఃఖానికి కారణం - అనే ఆలోచనను మన మనస్సునుండి పెకలించివేయాలి. మన కర్మలకు మనం తప్ప మరొకరు బాధ్యులు కారనీ, మన సుఖ దుఃఖాలు మన కర్మల ఫలితాలనీ మనం స్పష్టంగా గ్రహించాలి.

ప్రతి మనిషి జీవితమూ పూర్తిగా అతడి చేతుల్లో ఉంది. మన సుఖ దుఃఖాల వెనుక కార్య-కారణముల ఒక ప్రత్యేక నియమం ఉంది. మన దుఃఖాలకు కారణం మనమే. మనిషి కావాలని అజ్ఞానంలో, అంధకారంలో, పొరపాట్లలో కూరుకుపోయి, తాను దుఃఖిస్తున్నానని ఫిర్యాదు చేస్తూ ఉంటే - అతడి దుఃఖం తొలగిపోతుందా? వాస్తవానికి - సుఖం కావాలంటే మనస్సు ప్రశాంతంగా, చిత్తం ఏకాగ్రంగా ఉండడం అత్యవసరం. సుఖం కోసం ఇతర వస్తువుల ఆసరా కోసం ప్రాకులాడవలసిన అవసరం లేదు.

ఒకో మనిషి ఉంటాడు. అతడు ఎక్కడకు వెళ్లినా ఆనందమే అందుతుంది. ప్రతి వస్తువూ అతడికి సుఖాన్ని ఇస్తుంది. ప్రతి పరిస్థితీ అతడికి అనుకూలం అవుతుంది. మరో మనిషి ఉంటాడు. అతడికి ప్రతి వస్తువులో చెడుమాత్రమే కనబడుతుంది. ప్రతి మనిషి సాన్నిహిత్యంలోనూ అతడు ఖిన్నుడు అవుతాడు. ప్రతి మనిషి గురించీ ఫిర్యాదు చేస్తాడు. అతడికి ఎక్కడా ఏ వస్తువులో ఆనందం దొరకదు. ఈ ప్రపంచం నివసించదగినది కాదని అతడు భావిస్తాడు.

## సుఖం బయటి వస్తువుల్లో లేదు

సాధన సంపదలన్నీ కలిగి ఉన్న వ్యక్తులు పలువురు మీకు కనపడతారు. వారు తమ మనస్సులలో ఏవేవో లేనిపోని కారణాలు ఊహించుకుని దుఃఖపడుతూ ఉంటారు. వైభవాల మధ్య, భోగ భాగ్యాల మధ్య దుఃఖాలలో, చింతలలో మునిగి ఉన్న వ్యక్తులు పలువురిని మేము చూచాము. రోజు కూలీ తెచ్చుకునే పేదవాడు వారికన్న సుఖవంతుడని మాకు అనిపించింది. అలాంటి వ్యక్తులు ఎవరినీ నమ్మరు. తమ భార్యలనూ, పుత్రులనూ, దగ్గర బంధువులనుసైతం నమ్మలేరు. అన్నీ ఉండికూడా వారు నిస్సహాయులుగా జీవితాలు గడుపుతూ ఉంటారు.

మరి, ఈ పరిస్థితి రావడానికి కారణం ఏమిటి? కారణం ఎక్కడో లేదు. మన యోగ్యతలో, మన అయోగ్యతలో ఉంది. ప్రపంచంలో నివసిస్తూ రకరకాల కొరతల నుండి, బాధలనుండి, ఇబ్బందులనుండి, ఆధివ్యాధులనుండి తప్పించుకోవడం సాధ్యం కాదు. అయితే, ఆ పరిస్థితులలో శాంతంగా, ధైర్యంగా ఉండడం మన చేతుల్లో ఉంది. బయటి వస్తువులు ఆసరాగా సుఖపడదామని ఆశించే వ్యక్తి మోసపోవడం ఖాయం.

కనుక - సుఖపడదలచుకుంటే - నిన్నూ, నీ మనస్సునూ అదుపుచేయడం నేర్చుకో. జీవితంలో ఇబ్బందులు చిన్నవీ పెద్దవీ వస్తూనే ఉంటాయి. వాటిని ఎదిరించాలి. ప్రశాంతంగా, ధైర్యంగా ఆ పరిస్థితులతో సమన్వయం ఏర్పరచుకోవాలి. శ్రీరాముడు, శ్రీకృష్ణుడువంటి అవతార పురుషులకు ఎన్నెన్ని కష్టాలు వచ్చాయి! దీన్ని గురించి ఆలోచించాలి.

ఆనందంగా ఉండడానికి ఉపాయాలు రెండే రెండు - అవసరాలను తగ్గించుకోవడం, పరిస్థితులతో సమన్వయం.

★★★

**అంతరాత్మ నీకు మంచి మిత్రము.**

## పరశురామ జయంతి వ్యాసం

# అత్యాచారులను సహించని అవతారం

పెరుగుతూ వస్తున్న సమష్టి జీవన వ్యవస్థను వ్యక్తి స్వాతంత్ర్య తత్వంతో మేళవించి భారతీయ జాతీయతకు సమృద్ధతను, వైశిష్ట్యాన్ని ప్రాప్తింపజేశాడు పరశురాముడు.

### పరశురాముడి జన్మ

కన్యాకుబ్జంలో గాధి అన్న రాజుండేవాడు. అతని కుమార్తె సత్యవతి వివాహం ఋచీకుడనే విద్వాంసుడు, తపస్వి, ఋషితో జరిగింది. గాధి రాజుకు పుత్ర సంతానం లేదు. ఋచీకుడి క్కూడా చాలా సంవత్సరాల వరకు పుత్ర సంతానం లేదు. ఋచీకుడు పుత్రప్రాప్తికోసం బ్రహ్మవీర్య తేజస్సును సంప్రాప్తించుకుని పాయసంలో ఆవాహన చేశాడు. ఋచీక పత్ని సత్యవతి "స్వామీ! మీరు మరికొంచం పాయసం ప్రాప్తింపజేస్తే మా తల్లికిస్తాను. ఆమె వల్ల నాకు సోదరుడు లభిస్తాడు గదా" అని అర్థించింది. ఋషి 'తథాస్తు!' అని క్షాత్రవీర్య స్థాపన చేశాడు మరో పాయస పాత్రలో. "మొదటి క్షీరం నువ్వు సేవించు, రెండోది మీ అమ్మకివ్వు" – అని చెప్పాడు. తర్వాత తన పని మీద బయటకు వెళ్లాడు.

సత్యవతి తల్లిని పిలిచి మొత్తం కథ వినిపించింది. అంతా విని వాళ్ల అమ్మ అన్నది – "నా పాయసం నువ్వు తాగు నీది నాకియ్యి. నీ సోదరుడు పృథ్వీ పతి అవుతాడు. అతనిలో ఉత్తమోత్తమ గుణాలు ఉండాలి కదా! బ్రాహ్మణ పుత్రుడికి అంత అవసరం లేదు గదా? అతనిలో ఏవో కొన్ని మంచి గుణాలుంటే చాలు గదా." అలా అంటూ పాయస పాత్రల్ని మార్చుకుని తల్లీ, బిడ్డా త్రాగేశారు.

ఋచీకుడు ఇంటికి తిరిగి వచ్చాడు. యథాలాపంగా భార్యవైపు చూచి ఆశ్చర్యపోయాడు. ఆమె ముఖం క్రూరంగా, వికారంగా కనిపించింది. తప్పక పాయసం త్రాగటంలో ఏదో గందరగోళం అయి ఉంటుందని కోపంగా దులిపెయ్యటం మొదలు పెట్టాడు.

"నువ్వు మీ అమ్మకని సృష్టించిన పాయసాన్ని త్రాగావు కదూ? ఆ పాయసంలో నేను క్షత్రియోచిత శౌర్య, వీర, క్రూర సంపత్తిని స్థాపించి ఇచ్చాను. నీ పాయసంలో శాంతి, జ్ఞానం, సహనశీలత లాంటి విప్రోచిత సాత్విక సంపత్తిని ఆవాహన చేశాను. ఈ మార్పు చేసి తాగటంతో నీకు పుట్టేవాడు క్రూరకర్మలు చేసేవాడు, క్షత్రియ గుణాలు కలవాడు అవుతాడు. నీ సోదరుడుగా పుట్టబోయేవాడు యమ – నియమాచరణుడు బ్రాహ్మణవృత్తి చేసుకునే ఇచ్ఛగల బుద్ధిమంతుడవుతాడు."

భర్త మాటలు విన్న సత్యవతి భయపడిపోయి గజగజా వణికిపోసాగింది. ఋచీకుడి కాళ్ల మీద పడి మీరు సర్వసమర్థులు. నా కొడుకు క్రూరకర్ముడు కావద్దు. కానీ వాడి కొడుకు అయితే అవనీండి" – అని ప్రార్థించింది.

"నేనైతే పుత్రుడు, పౌత్రుడు మధ్య భేదం ఉందనుకోను. నువ్వు అలా కోరితే సరే అలాగే అవుతుంది" – అన్నాడు ఋషి. కాలానుగుణంగా సత్యవతికి పుత్రోదయం అయింది. ధగధగా మండుతున్న యజ్ఞాగ్నిలా వెలిగిపోతున్నాడా శిశువు. అతనికి 'జమదగ్ని' అని పేరు పెట్టారు. పెరిగే కొద్దీ మంచి తపస్విగా పేరు బడ్డా, బాల్యం నుంచే ధనుర్వేదంలో మహాజ్ఞాని. పెద్దయ్యాక జమదగ్ని నర్మదా నదీ తీరంలో ఆశ్రమాన్ని నిర్మించుకుని జీవించసాగాడు. ఆయన పత్ని రేణుక. వారికి అయిదుగురు పుత్రులు కలిగారు. కనిష్ఠ పుత్రుడు మహాతేజస్వి! శాస్త్రాల్లో నిపుణుడయ్యాడు. భుజం మీద గొడ్డలి పెట్టుకుని నిరంతరం తిరుగుతుండేవాడు. అతనికి పరశురాముడు అన్న పేరు స్థిరపడింది.

### సహస్రార్జునుడు

ఆశ్రమానికి కొంత దూరంలో చరిత్రలో ప్రసిద్ధికెక్కిన

**అందం తరిగిపోతుంది. సౌశీల్యానికి ఉంది శాశ్వత ఆకర్షణ.**

'హై హయ'కుల క్షత్రియ రాజుల రాజధాని ఉండేది. దాన్ని ఆ కాలంలో సహస్రార్జునుడు అన్న రాజు పాలించేవాడు. కార్తవీర్యార్జునునికి ఖ్యాతి రెండు విధాలుగా లభించి విస్తరించింది. అతని సహస్ర బాహువుల వల్ల, అతని ఉద్దండ ప్రవృత్తి వల్ల! అర్జునుడు అత్రి పుత్రుడు అయిన దత్తాత్రేయుని భక్తుడు. అతను దత్తాత్రేయుడి ద్వారా రెండు వరాలు పొందాడు. ఒకటి - యుద్ధసమయంలో తనకు వెయ్యి బాహువులు ప్రకటంగావాలి; అవి చాలా తేలిగ్గా ఉండి శరీరం మీద వాటి భారం పడరాదు. రెండోది తన మరణం కేవలం తన కంటే శ్రేష్ఠుడైన ఓ మహాపురుషుడి ద్వారానే సంభవించాలి. అప్పట్నుంచి అతనికి సహస్రార్జునుడు అన్న పేరు కలిగింది. సమర్థుడు, సాహసి, పరాక్రమవంతుడు, అన్నిటినీ మించి అతి గొప్ప సంఘటనాశీలి సహస్రబాహు కార్తవీర్యార్జునుడు. ఇంత సమర్థుడు, ప్రచండ సాహసి క్రమేపీ అహంకారి కావటం సహజమే. అతని సంఘటనలో కొంత దోషమూ ఉంది. మొదటిది తనను అనుకరించి మరొకరెవ్వరూ తన కంటే గొప్ప సంఘటనను నిర్మించకుండా ఉండాలి. రెండోది తన అనుయాయులకు నిరంతరం ఏదో పని పురమాయించి వాళ్లను ఆ పనులలో వ్యస్తపరిచి, వారికి అసలు ఆలోచించే సమయమే లేకుండా చెయ్యటం. కొత్త రాజ్యాన్ని ఆక్రమించుకోగానే మొదట చేసే పని అందర్నీ నిరాయుధుల్ని చేసేయటం. అలా అతను సంఘటన స్వార్థానికే ఉపయోగించసాగాడు. ఈనాటి భాషలో ఈ అర్జునుడు కేవలం సామ్రాజ్యవాది. మోటు భాషలో అతనిది దొంగల, దోపిడీవాదుల సంఘటనే!

## పరశురాముడి విరోధం

జమదగ్ని ఆశ్రమం సహస్రార్జునుడి రాజధానికి సమీపం. జమదగ్ని కఠోర తపస్వి. ఏ పనైనా అతిశాంతంగా చేసే స్వభావం అతనిది. కానీ పరశురాముడలా కాదు. అంటే జగడాలమారి అనీ కాదు. కానీ సహస్రార్జునుడి 'నిరాయుధ ఆజ్ఞ' అతన్ని కుపితుడ్ని చేసింది. ఆ ఆజ్ఞను లెక్కపెట్టకుండా తన పరశువును భుజాన వేసుకునే సంచరిస్తున్నాడు పరశురాముడు, పేరుకు తగ్గట్లు. సహస్రార్జునిడి ఉద్దండతను విరోధించే ఏకైక పురుషుడుగా అందరూ అతన్ని గుర్తించసాగారు.

## సహస్రార్జునుడు - పరశురాముల పోరాటం

సహస్రార్జునుడి చెవుల్లో పరశురాముడి గురించి మాటి మాటికి, రకరకాలుగా వార్తలు సోకసాగాయి. వినీ వినీ కార్తవీర్యార్జునుడు ఒకరోజు పరశురాముడితో యుద్ధానికి సిద్ధపడ్డాడు. తన అనుయాయుల్ని పంపి జమదగ్ని హోమధేనువును లాక్కుని రమ్మన్నాడు. ఆశ్రమవాసులు సహజంగా రాజు కాబట్టి అతని దగ్గరకు వెళ్లి ఫిర్యాదు చేశారు. 'మీ సంరక్షణకు పరశురాముడున్నాడు గదా! చెప్పుకోండి పొండి' - అని పొగరుగా జవాబిచ్చాడు సహస్రార్జునుడు.

తిరిగి తిరిగి సాయంకాలానికి ఆశ్రమం చేరాడు పరశురాముడు. మొత్తం వృత్తాంతం వినిపించారు ఆశ్రమవాసులు. బాహాటంగా జరుగుతున్న అన్యాయాన్ని సహించని పరశురాముడు తన అనుయాయులతో రాజధాని మీద దాడి చేశాడు. కార్తవీర్యుని అంగాలైన సైనికుల్ని, అనుయాయుల్ని సంహరించాడు. పరశురాముడితో యుద్ధానికి దిగాడు సహస్రార్జునుడు. ఇద్దరి మధ్య భీకర సంగ్రామం జరిగింది. ఆఖరుకు పరశురాముడు సహస్రార్జునుడిని సంహరించి ధేనువును ఆశ్రమానికి తీసుకుని వచ్చాడు. సహస్రార్జునుడి పుత్రులు అతనిలానే క్షాత్రతేజం, అహంకారం ఉన్నవాళ్లు. ప్రతీకారాగ్నితో దహించుకుపోతూ అనుకూల సమయంరాగానే ఆశ్రమం మీద దాడి చేశారు. అయితే వెంటనేగాకుండా అనుకూల సమయం కోసం పొంచి ఉన్నారు.

గతంలో భృగుమహర్షి అత్యాచారాలు సాగించే ఉన్మత్త రాజుల్ని ఏరేరి వధించాడు. తర్వాత వెంటనే పృథువును రాజుగా ఎంపిక చేసి "ధర్మానుసారం పాలిస్తాను!" అని ప్రతిజ్ఞ చేయించి సింహాసనాధిష్ఠుణ్ణి చేశాడు. పురాణాల్లో ఈ పృథువు

**అజ్ఞానం మార్పునకు భయపడుతుంది.**

గురించి 'సుప్రసిద్ధ ఆదర్శ పాలకుడని' వర్ణించటం చూస్తాం. ఇలాగే పృథు వంశీకుడైన పరశురాముడు కూడా తల్చుకుంటే మంచివాడు, ధర్మానువర్తి అయిన రాజును గద్దె ఎక్కించి ఉండవచ్చు. అలా చెయ్యలేదు.

పరశురాముడికి యాత్రలు చెయ్యటం అంటే ఇష్టం. తీర్థయాత్రల పేరు మీద సంపూర్ణ భారత భ్రమణం చేశాడు. అలానే ఓసారి తీర్థయాత్ర కోసం ఆశ్రమం వదిలి వెళ్లాడు. సహస్రార్జునుడి పుత్రులు సమయం కోసం కాచి ఉన్నారు గదా. ఉన్మత్తుల్లా ఆశ్రమం మీదికి విరుచుకుపడ్డారు. ముందు వెనుకా ఆలోచించకుండా జమదగ్ని మహర్షిని క్రూరంగా, అమానుషంగా హత్య చేశారు. యాత్ర నుంచి తిరిగి వచ్చిన పరశురాముడు రేణుకామాత ద్వారా జరిగింది వినగానే అతని దుఃఖానికి, ఆవేశానికి, క్రోధానికి పరిమితి లేకుండాపోయింది. తన తండ్రిని హత్య చేసిన సహస్రార్జునుడి కొడుకుల్నే గాకుండా అందరు క్షత్రియుల్ని సంహరించి వాళ్ల రక్తంతో తన తండ్రికి తర్పణం చేస్తానని ఘోర ప్రతిజ్ఞ చేశాడు. ఓ పెద్ద జైత్రయాత్ర సాగింది. క్షత్రియ సంహారం భీకరంగా సాగింది. ఓ కథనం ప్రకారం 21 సార్లు సాగిందీ దండయాత్ర.

పరశురాముడు సహస్రార్జునుడి ఉద్దండత, అహంకారానికి గల మూల రహస్యం తెలుసుకున్నాడు. ప్రతీకారం పేరు మీద ఒక నవీన సంఘటన నిర్మాణం చేశాడు పరశురాముడు. స్వార్థ ప్రయోజనాలకు జరిపిన సంఘటన కంటే తత్వాధిష్ఠ సంఘటన ఎప్పటికైనా శ్రేష్ఠమైనదే! ఈలాటి సంఘటన ఆధారంగానే పరశురాముడు సహస్రార్జునుడి అహంకార, అభిమానాల్ని ధ్వంసం చేశాడు. తన కంటే శ్రేష్ఠుడి చేతిలో మరణించాలన్న అతని కోరికా నెరవేర్చాడు.

## 21 సార్లు పృథ్వీ క్షాళనం

సహస్రార్జునుడి వధ తర్వాత పరశురాముడు తిరిగి తన తీర్థయాత్రల్లో మునిగిపోయాడు. అయితే తాను శస్త్ర విద్య నేర్పినవాళ్లకు పని లేకుండా పోతోంది. ఫలితంగా వాళ్లు సహస్రార్జునుడి రాజ్యంలో గూండాగిరీ చలాయించటం మొదలు పెట్టారు. పరశురాముడు మళ్లీ శస్త్రధారణ చేశాడు. తన వాళ్లైనా అధర్మపరులైనందువల్ల ఆ ఉన్మత్త క్షత్రియుల్లాగానే అందరినీ వధించసాగాడు. ఈ పని అతను చాలాసార్లు చెయ్యాల్సి వచ్చింది. ఈ విషయాన్నే పురాణకారులు వర్ణిస్తూ 'పరశురాముడు 21 సార్లు పృథ్విని నిక్షత్రియం చేశాడు' అని అన్నారు.

క్రమేపీ అతని ధ్యాస మరోవైపుకు మళ్లింది. మొదటి ఆవేశం, ఊపు తగ్గాయి. నిజానికి పరిష్కారం క్షత్రియ సంహారం కాదు, క్షత్రియ సంస్కారం. క్షత్రియుల్ని నియంత్రించాలి. అయితే ఈ జ్ఞానం కలిగేసరికే ఆలస్యమైపోయింది. సంహార యాత్రలో ఎంతగా ముందుకు వెళ్లాడంటే తిరిగి తనను తాను వ్యవస్థితం చేసుకోవటం అసంభవ మనిపించింది.

"నా తండ్రి మీద 21 గాయాలు చేసి సంహరించిన కారణంగా నేను 21 సార్లు పృథ్విని నిక్షత్రియం చేశాను" - అని జనాన్ని సమాధానపెట్ట ప్రయత్నించి మౌనంగా ఉండిపోయాడు పరశురాముడు.

## క్షత్రియ వధల దుష్పరిణామాలు

సమాజంలో క్షత్రియ ప్రవృత్తి గల చాలామందిని అంతం చెయ్యటంతో విపరీత పరిణామాలు కలిగాయి. పాలను మాటిమాటికీ కాచి మీగడ తీస్తూ కూర్చుంటే ఏమవుతుంది? తమకు ఆపద కలిగే అవకాశమున్నా అవమానాల్ని సహించనివాళ్ల సంఖ్య సమాజంలో చాలా ఉంటుంది. ఈ గుణంతోబాటుగా కొంత భోగలాలసత, కొంత స్వచ్ఛంద వృత్తి కలిసి ఉంటే కొంత హద్దు వరకు క్షమార్హమవుతుంది. సమాజ విషయంలో యోజనాబద్ధంగా వ్యవహరించి కొంత నియంత్రణను అమలుచేస్తూ సమాజాన్ని కాపాడే వాళ్లలో, నాయకత్వం వహించే వాళ్లలో ఇలాంటి గుణాల్ని సహించాల్సి ఉంటుంది. సమాజ కల్యాణార్థం క్షత్రియుల ఆవశ్యకత ఉంటుంది. సముచిత నియంత్రణతో, అప్పుడప్పుడు కొన్ని

**అడుగు ముందుకువేయని వ్యక్తిని ఏదేవుడూ ఆదుకోలేడు.**

కష్టాల్ని ఎదుర్కుంటూ సమాజంలో ఆ వర్గాన్ని సజీవంగా ఉంచటం బుద్ధిమంతుల లక్షణం. ఈ సమాజ పోషణ తత్వజ్ఞానం లేనందువల్ల పరశురాముడు క్షత్రియ సంహార కార్యాన్ని అత్యుత్సాహంగా చేసిపారేశాడు.

ఆనాటి విచారశీల పురుషులు భవిష్యత్తులో ఏర్పడబోయే ప్రమాద పరిస్థితుల్ని అంచనావేసుకుని యుక్తమార్గాన్ని బోధించారు. కశ్యపుడు ఇలాటి వివేకవంతుల్లో ఒకడు. పరశురాముడు కొంత శాంతించాక అతన్ని కలిశాడు. శాంతంగా ఇలా అన్నాడు :

"నీ పరాక్రమం అద్వితీయం. నీ పని పూర్తయింది. నీ ప్రతిజ్ఞానుసారం నీ పూర్వజులకు తర్పణం వదిలి తపస్సుకు వెళ్లు."

కశ్యపుడి మాటలు మనస్సుకు హత్తుకున్నాయి. క్షత్రియ రుధిరంతో ఎర్రబారిన తటాకంలో పితృతర్పణం చేశాడు పరశురాముడు. తన అవతార సమాప్తి గ్రహణకు వచ్చింది. ఉన్మత్త క్షత్రియులను తన శక్తితో సంహరించి జయించిన భూమిని కశ్యపునికి దానమిచ్చాడు.

## దక్షిణ భారతానికి ప్రస్థానం

పరశురాముడు లాటి జ్వాలాముఖి తనకు ఇచ్చిన రాజ్యంలో ఉంటే భవిష్యత్తులో మరే సంకటాలు వస్తాయని అనుకున్నాడోయేమో కశ్యపుడు "నువ్వు నాకిచ్చిన భూభాగాన్ని వదిలి వెళ్లా"మని ఆజ్ఞాపించాడు. పరశురాముడు దక్షిణాన సుదూరపు ప్రయాణం చేసి మహేంద్ర పర్వతం మీద ఆశ్రమం నిర్మించుకుని తపస్సులో లీనమయ్యాడు. ఎప్పుడైనా యాత్రలు చేసే కోరిక కలిగితే పశ్చిమ తీరానికి వెళ్లి అక్కడి ఆటవికుల చేత తీర ప్రాంత భూముల్ని బాగు చేయించి కృషియోగ్యం చేసేవాడు. తన పరశువుతో ముళ్లచెట్లను, అడ్డం వచ్చిన వృక్షాల్ని నరికి భూముల్ని శుభ్రం చెయ్యటంలో ఆనందాన్ని పొందేవాడు. సముద్రాన్ని కొంత వెనక్కి మళ్లించే ప్రక్రియతో (ఈనాటి డైక్‌ల నిర్మాణం - బహుశా) కొత్త సేద్యపు భూముల్ని తయారుచేసి అక్కడివాళ్లకు అందించేవాడు. 'పరశురాముడు బాణప్రయోగం చేసి సముద్రాన్ని వెనక్కి జరిపాడు' - అని పురాణాల్లో వర్ణించిందిదే మరి! ఈనాటికీ ఈ తీరప్రాంత భూముల్ని 'పరశురామ క్షేత్రం'గా గుర్తించటం జరుగుతోంది.

సమాజం పట్ల ఉన్మత్త మదాంధకారులు చేసే అత్యాచారాలను సహించని ప్రవృత్తే పరశురామావతార విశిష్టత. 'అత్యాచారాన్ని నోరుమూసుకుని సహిస్తూ పోతే ఆ అత్యాచారుల ప్రవృత్తి అధికాధికమవుతూ పోతుంది. ప్రతి దానికీ ఓ హద్దుంటుంది. అన్యాయాన్ని నిర్జించాలి. కానీ, మళ్లీ దానికీ హద్దుండాలి' - ఇదే పరశురామావతార సందేశం. ఈ ఆలోచనలో రెండో భాగాన్ని విస్మరించినందువల్ల సమాజంలో పిరికితనం పెరిగిపోయింది. పాలగుణం తరిగిపోయి తెల్లటి నీళ్లుండిపోయాయి.

## అరాచకం నుంచి రాజ్యవిహీనతవైపు

కశ్యప మహర్షి పాలన ప్రారంభమైంది. అతని పాలన ఎలా సాగింది? ఈ విషయమూ గమనార్హమే.

చుట్టుపక్కల రాజ్యాల్లో కూడా పరశురామ ప్రభావం, పరశువు శౌర్యం విస్తరించటం వల్ల ఆక్రమణ భయం లేదు. యోగ్యుడైన శాసకుడు లేనందువల్ల అరాచకం ప్రబలి ప్రజలు రసాతలంలో తలదాచుకోసాగారు. మహాభారత కథ ప్రకారం 'అప్పుడు కశ్యపుడు వాళ్లను తన చంకల్లో బంధించి ఉంచాడు. అందుకనే పృథ్విని 'ఉర్వి' అని కూడా అనటం ప్రారంభమైంది. మనం వైశ్యుల్ని సమాజ పురుషుడి జంఘగా తల్చటం జరుగుతోంది. అంటే మహాభారతం ప్రకారం ఆ రోజుల్లో (అంటే పరశురాముడి తర్వాత కాలంలో) సమాజ శాసనాన్ని వైశ్యవర్గంవారు (వ్యాపారులు) తమ చేతుల్లోకి తీసుకుని పాలనను సాగించ ప్రయత్నించారని అర్థం చేసుకోవచ్చు.

ప్రాచీన భారతీయ రాజ్య సంస్థలో చాతుర్వర్ణాల సమావేశం జరిగేది. రాజు అంటే ఏదో సింహాసనాధిష్ఠుడైన వ్యక్తి అని గాక సంపూర్ణ రాజ్య యంత్రాంగం అని ప్రతీతం

**అదృష్టం నుదుటిలో లేదు, కృషిలో ఉంది.**

అయి ఉండవచ్చు. చాలా పురాతన భారత్‌లో, ఈ సందర్భంగా అతి ప్రాచీన సాహిత్యంలో మనకు లభించే వివరాలు మహత్తరమైనవి. వేన ప్రకరణం ఆధారంగా మనం అర్థం చేసుకోగలిగిందిది. రాజ్య యంత్రాంగంలో వైశ్యవర్గంవారి అపరాధాలు మిన్నంటటంతో క్షత్రియుల్లో ఉత్తమ గుణాలున్నవాడికి ఋషులు పాలనను అప్పగించారు. పద్మపురాణం ప్రకారం, ఎడమవైపు మథనం చేస్తే నిషాదుడు ఉద్భవించాడు. ఆతర్వాత దక్షిణ భాగాన్ని మథిస్తే మహాత్మా పృథు అవతరించాడు. అంటే ఆ రోజుల్లో శాసనాధికారుల్లో రెండు దళాలుండేవి! 1. రైటిస్టులు, 2. లెఫ్టిస్టులు. (ఈనాటి భాషలో సుమా!). వాళ్లల్లో ఎంపిక చేసిన వాళ్లు నిషాద, పృథులు. అలా పాలనాధికారం ఎవరిదో తేల్చేవారు ఋషులు. అసలింకా పూర్వకాలంలో

'న రాజ్యం న చ రాజాసీత్ న దండో నచ దాండికః ॥
ధర్మేణైవ ప్రజాః సర్వాః రక్షంతి స్మ పరస్పరమ్ ॥

అన్న స్థితి ఉండేది – భీష్ముడు యుధిష్ఠురుడికి చెప్పిన దాని ప్రకారం. అనగా – రాజ్యం, రాజు, దండ విధానం, దండించేవాడు లేరు. ధర్మమే ప్రజలందరినీ పరస్పరం రక్షించింది.

ప్రస్తుత కథనంలో అలా వైశ్యపాలనా యంత్రాంగం విఫలం కాగా కశ్యపుడు చింతాగ్రస్తుడయ్యాడు. అతను స్వయానా బ్రాహ్మణుడు, తపస్సే ప్రధానంగా తలిచేవాడు. నామమాత్రంగా పాలననైతే స్వీకరించాడు, ఆనాటి పరిస్థితులవల్ల. పరశురాముడి అంతులేని క్రూరతా ప్రభావం నుంచి సమాజాన్ని రక్షించటం తత్కాల తక్షణ అవసరం. కొంతకాకపోతే కొంతవరకైనా క్షాత్రాన్ని కలిగిఉన్న వాళ్లను వెతికి, వాళ్లు చేసే వృత్తుల నుంచి మళ్లించి, తనకు దగ్గరగా పరిసరాల్లో ఉన్న ప్రదేశాల్లో పాలనా వ్యవస్థ చూచేందుకు వాళ్లను ప్రేరేపించాడు కశ్యపుడు. క్రమేసీ భిన్న దేశాలుగా ఏర్పడ్డది పాలనా వ్యవస్థ. దీన్నే ఛప్పన్న దేశాలన్నారు. అంటే 56 ప్రాంతాల్లో భిన్న పాలన. భిన్నత ప్రస్ఫుటం కాగానే మళ్లీ కశ్యపుడికి పని తగిలింది. అయితే ఓ విశేషం ఏమంటే అందులో ఎక్కడా పాత ఉద్దండతగానీ కటుత్వంగానీ కనిపించలేదు. క్షత్రియోచిత తీవ్రత్వం లేకుండా నియమిత పాలకులుగా ఉండిపోయారు. అలా అయోధ్య పరిసరాల్లోని ఓ పెద్ద రాజ్యాన్ని సూర్యవంశజు డొకడు పాలించేవాడు. పురాణాల్లో వర్ణించిన వంశావళి ప్రకారం అతని పేరు త్రయ్యారుణుడు. అతని పుత్రుడు దురాచారి. అందువల్ల తన రాజ్యభారాన్ని పుత్రుడికివ్వక పురోహితుడైన వసిష్ఠుడికి అప్పజెప్పాడు.

## వసిష్ఠుడి ధర్మరాజ్యం

వసిష్ఠుడు ఋషి, త్యాగధనుడు, ప్రజ్ఞాశాలి. భౌతిక సుఖాల పట్ల అనాసక్తుడు. రాజ్యపద్ధతి పట్ల స్వతంత్ర, విశాల భావాలున్నవాడు. బాధ్యతను స్వీకరించి ఒక విశిష్ట పాలనా ప్రణాళికను అమలుజరిపాడు. కశ్యపుడిలానే వసిష్ఠుడూ తపస్వి. కానీ ఆయన ఆశ్రమం ఏదో మూల కేవలం తపస్సుకే వినియోగించబడేది గాదు. అక్కడ ఓ విశాల గురుకులం నడిచేది. వసిష్ఠుడు దాని కులపతి. అక్కడి విద్యార్థుల యోగక్షేమాలు ఆయనే చూచేవాడు. శిక్షణా పద్ధతి కూడా అతి విశిష్టంగా ఉండేది. ఓ రాజుకు కావలసిన వైభవంగాని, శక్తియుక్తులుగానీ ఆయన దగ్గర కనిపించవు. సాధన సంపత్తులూ లేవు. ఆయన మొత్తం రాజ్యవ్యవస్థ ధర్మానుసారం నడిచేది. ఆయన గురుకుల వ్యవస్థే రాజ్యవ్యవస్థ. దాని వర్ణన ఎలా ఉందంటే – ఇంతకు క్రితం అనుకున్నట్లు "న రాజ్యం న చ రాజ్యాసీత్....".

ఆధునిక పరిభాషలో 'అ రాజ్యం' అన్నట్లు వసిష్ఠుడు సంపూర్ణ సమాజ రచన చేశాడు. పరశురాముడి క్షత్రియ సంహారం కారణం వల్ల మిగిలినవాళ్ల కోసం శాసన యంత్రాంగం అవసరమే లేకుండాపోయింది. అలాటి స్థితి చాలా ఏళ్లు కొనసాగింది.

– ఉమాకాంత కేశవ ఆప్టే

★★★

**అనుభవాన్ని మించిన గురువు లేదు.**

## శ్రీరామనవమి వ్యాసం

# శ్రీరామచంద్రుని పదహారు కళ్యాణ గుణాలు

వాల్మీకి కొన్ని గుణాలను చెప్పి ఆగుణాలు కల నరుడెవడైనా ఈలోకంలో ఉన్నాడా? అని అడిగాడు. గుణవాన్, ధర్మజ్ఞః, కృతజ్ఞః సత్యవాక్యః, దృఢవ్రతః చారిత్రేణచకోయుక్తః, సర్వభూతేషు కోహితః, విద్వాన్కః, కస్సమర్థః, కశ్చైక ప్రియదర్శనః, ఆత్మవాన్కో, జితక్రోధో, ద్యుతిమాన్, కో న సూయకః, కస్యబిభ్యతి దేవాశ్చజాత సంయుగే – అని 16 గుణములు అడిగాడు. ఇవీ మనకి కావలసిన గుణాలు.

గుణమంటే సౌశీల్యం ఇదే మొదటి గుణం. ఐశ్వర్యం చేత గొప్పవాడివైనా, విద్యచేత గొప్పవాడివైనా, జాతిచేత గొప్పవాడివైనా, ఆమూడింటిచేత తక్కువ వానితో అరమరిక లేకుండా ప్రవర్తించగలిగితే దానికే సౌశీల్యం అని సంస్కృతంలో పేరు.

అలాగే మనకి శక్తి కలిగి, మన లోపలికి వాడి దోషాలు రాకుండా, వాడికి మన గుణాలు సంక్రమింపజేశేలా, వాడితో చేరాలి. దీనినే వీర్యం అంటారు. తాను ఉత్తమమైన కులములో జన్మించాడు. గొప్ప విద్యావంతుడు, ధనవంతుడు అయినా గుహుని, ఒక పడవ నడుపుకునే పల్లెవాణ్ణి, 'ఆత్మ సమః సఖా' నాతో దీటైన స్నేహితుడని ఆచరణచే చూపించాడు. కౌగిలించుకున్నాడు. దానికంటే ఆశ్చర్యమైన విషయం. ఒక కోతితో స్నేహం చేసుకున్నాడు శ్రీరాముడు. ఒక రాక్షసునితో స్నేహం చేసుకున్నాడు.

"తేన త్యక్తేన భుంజీథాః". త్యక్తేన త్యాగముతో, భుంజీథాః అనుభవించు, పాలించు. పాలించినప్పుడు తాను ట్రస్టీ. అది నాదీ అనే భావన వదిలి భుంజీథాః నీవు దాని ఉపయోగాన్ని పొందుతూ ఉండు. ఇది జీవితం. ఇది నీకు తెలిస్తే అహంకారం కలుగదు. మాగృధః. ఇదీ ఆదర్శం మానవునికి. ఇది నా వస్తువుగా కావాలి అని ఏవస్తువును కోరను. ఎందుచేత? అది నాది ఎప్పుడూ కాదు కనుక.

ఉపనిషత్తులోని అటువంటి సిద్ధాంతాన్ని మనకు తెలపడం కోసం రాముడు మానవుడుగ వచ్చినాడు. రామ జీవితం రాజ్య త్యాగంతో ప్రారంభమైంది. భార్యా పరిత్యాగంతో జీవితం అంతమయింది. మొదటిది త్యాగమే, చివరిదీ త్యాగమే. ఇవీ మానవుని జీవితమునకు ఇవతల ఎల్ల, అవతల ఎల్ల. త్యాగమును ఈ ప్రక్క ఆ ప్రక్క పెట్టు, మధ్యలో భోగములు అనుభవించు. రాముడు పదునాలుగేండ్లు అరణ్యంలో ఉన్నాడు. పన్నెండేండ్లు రెండవసారి భార్యను అరణ్యంలో విడిచి పెట్టాడు. మిగిలిన కాలం అంతా భోగమే. కాని రామకథ మనకందరికీ ఏది తెలుసును? ఇరువది ఆరేండ్లు కథే తెలుసును. భోగానికి కథ లేదు. త్యాగానికి కథ ఉన్నది. కాబట్టి రామాయణం అంటే త్యాగ కథ.

తరువాత ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు కావాలి. నడిచే నడవడికి ధర్మం అని పేరు. ఒక వస్తువుకి ఒక రకం స్వభావం ఉంటుంది. తాను ఒకరి కొరకు వినియోగపడటం, వారిని ఆనందింప చేయడం, వారినిచూచి ఆనందించడం మానవుని స్వభావం. కాని విజ్ఞానమును పొందిన మానవుడు సర్వ పదార్థములను తన కొరకు వినియోగించుకొని, తాను ఇతరులకు వినియోగపడకుండా ఉండాలనే స్థితికి వచ్చాడు. ఇదే అసురత్వం. అదే మన ధర్మాన్ని మనం మరవడం. సర్వ పదార్థములు పరార్థమే. అంటే ఇతరుల కొరకే. అందుచేత మనము ఇతరుల కొరకే.

నాల్గవది కృతజ్ఞుడు.

1. కథంచిత్ ఉపకారేణ కృతేన ఏకేన తుష్యతి.
2. నస్మరతి అపకారాణాం శతమపి ఆత్మ వత్తయా.

ఉపకారానికి రాముడు పొంగిపోయేవాడట. అవతలి వాడు వంద అపకారాలు చేసినా స్మరించేవాడుకాడట. ఎన్ని అపకారాలు? శతం – నూరు. ఏకం – ఒక్క ఉపకారం ఇక్కడ.

ఐదవది సత్యవాక్యః : మాటలో నిజాయితీ పాటించు. ఇది ప్రధానం. దీనికి రాముడే ఆదర్శం. స్వామి రామచంద్రుడు రాజ్యాన్ని వదలి వెళ్తానని తండ్రికి మాట ఇచ్చి, రాజ్యాన్ని వదలి వెళ్లి, ప్రజలందరూ ఏకగ్రీవమై వచ్చి, భరతుడు వచ్చి, గురువు

**ఆశయంలేని జీవితం దీపం లేని ఇల్లు.**

వచ్చి, ఇందరు వచ్చి చెప్పినా, అంగీకరించలేదు.

ఆరవది దృఢవ్రతః : ఏదైనా ఒక పని చేద్దామంటే దానియందు పట్టుదల ఉండాలి. అధ్యవసాయము ఉండాలి. అది రామచంద్రునికి ఎక్కువ.

ఋషులను రక్షిస్తానని చెప్పాడు. వచ్చాడు ఆశ్రమానికి. మనకూ వారికీ వైరం లేకుండా రౌద్రం చూపించడం తప్పు కాదా అని సీతమ్మ అడిగింది. వైరము మానవులతో కాదు, అధర్మంతో. ధర్మాన్ని నేను పాలించవలసిన వాణ్ణి, పాలించవలసిన నేను శక్తి కలిగి, అధర్మం ధర్మాన్ని ఆక్రమిస్తూంటే చూస్తూ ఉపేక్షిస్తే ఆదోషం నాకు వస్తుంది. లోకం నన్ను ఒక త్రాచుపామును చూచినంత భయంతో చూస్తుంది అన్నాడాయన.

ప్రధానమైనది చారిత్రము అని చెప్పినాడు. ఏడవ గుణం చారిత్రేణచ కోయుక్తః.

ఎనిమిదవ గుణం సర్వ భూతేషు కో హితః - సర్వభూతహితత్వం. మొట్టమొదటిది సత్యం, రెండవది ధర్మం, మూడవది ఆనందం, నాల్గవది సౌందర్య ఆరాధన, ఐదవది దానిచే కల్గిన ప్రేమ, ఆరవది త్యాగము. ఈ త్యాగానికి వెనుక కనబడనటువంటి ఆరుదశలు ఉన్నాయని మన పెద్దలు చెప్పినారు. మానవుడు మొదట జ్ఞానాన్ని సంపాదించాలి. దానితో ధర్మాన్ని ఆచరించాలి. దానివల్ల తాను ఆనందాన్ని అనుభవించాలి. ఆనందం అనుభవించినందువల్ల సౌందర్య దర్శనం చేయగలగాలి. ఏవగింపు కలగకూడదు. ఏవగింపు కలగకపోతే కలిగేది ప్రేమ. ప్రేమతో త్యాగం. ఇది సర్వ భూతహితత్వం.

ఒక పక్షి చనిపోతే, ఆ చనిపోయిన పక్షి కోసమని, తన భార్య కన్పడకుండా పోయినప్పుడు ఎంత ఏడుస్తున్నాడో ఆ ఏడుపును కూడ మరచిపోయి ఏడిచినాడు. జటాయువు అనే పక్షిని కౌగిలించుకొని అయ్యో నా పాపం వల్ల ఈ పక్షి చనిపోయింది అన్నాడు. ఆ పక్షికి తన తండ్రికి చేయలేని దహన సంస్కారాన్ని చేసాడు. ఎంత ఉదారమైన ప్రవృత్తి. ఇది సర్వభూతహితత్వం.

శ్రీరాముడు, రావణాసురుడు చనిపోయిన తరువాత విభీషణుని రావణాసురునికి సంస్కారం చెయ్యమంటాడు. చాలా దుర్మార్గుడు మా అన్న, నా చేతులతో సంస్కారం చేయడం నాకు ఇష్టంలేదు అన్నాడు విభీషణుడు. అప్పుడు రాముడు అన్నాడు - 'నువ్వు చెయ్యవా? మాకు పగలేదు. మేం చేస్తాం. పగ ఎంతవరకు? వానిని మార్చడానికే పగ,. వానిని బ్రతికి ఉండగా మార్చడానికి ప్రయత్నించాము కుదరలేదు. చనిపోయినాడు. అంతటితో పగ సరి.' ఏమి ఔదార్యం స్వామిది. ఇదే సర్వభూత హితత్వం.

"విద్యాన్కః" తొమ్మిదవ గుణం 'కస్సమర్ధశ్చ' పదవ గుణం. జ్ఞానం ఉండాలి. మనకు రామాయణం, మహాభారతం మనలోని రెండు దోషాలను తొలగించడానికి వచ్చాయని చెప్పారు మన పెద్దలు. కామము, మన్యువు అనే రెండు శత్రువులు ఉన్నాయి మనలోపల. కామము రావణాసురుణ్ణి సమూలంగా నాశనం చేసింది. మన్యువు - పగ మహాసముద్రంలా పెరిగి భారతంలో కౌరవవంశాన్ని నాశనంచేసింది.

మన్యుమయ మహాద్రుమం అని చెట్టుతో పోల్చారు భారతంలో. ఆ మహాద్రుమానికి అడుగున ఒకే వేరు. రెండు ప్రక్క వేళ్లు, ఒక కూకటి వేరు మధ్య ఉంటుంది. ధర్మమయ మహాద్రుమానికి రెండు ప్రక్క వేళ్లు, ఒక మధ్య వేరు ఉన్నవి. ఆ మధ్య వేరు కృష్ణుడు. ప్రక్క వేళ్లు బ్రాహ్మణులు. బ్రహ్మ అంటే వేదము ఎరిగిన వారు. రెండవది వేదము. మన్యువనే మహాద్రుమానికి ఒకటే వేరు, ఆ ధృతరాష్ట్రుడు. ఆ ధృతరాష్ట్రునికి మూడు విశేషణాలు - "రాజా, అమనీషి, అంధః". వాడు రాజు అహంకార పూర్ణుడు. అమనీషి = వివేకహీనుడు. అంధః = పుట్టుకతోటే లోపల, బయటా కూడా గుడ్డివాడు. వాడు దీనికి వేరు. కౌరవ పక్షం మన్యుమయ మహాద్రుమం. అదే మనకి హాని చేస్తుంది.

గుణాలలో పదకొండవ గుణం "ఏకప్రియ దర్శనః". ఎపుడూ చూచేవారికి చూడాలనిపించే దర్శనమునిచ్చువాడు. రాముడు మనుష్యులకే కాదు, ఋషులకే కాదు, రాక్షసులకు కూడా అలా కన్పించాడు. ముక్కు చెవులు కోసి పంపితే శూర్పణఖ "తరుణౌ రూపసంపన్నౌ పుండరీక విశాలక్షౌ" అంటుంది. భర్త వాలి చనిపోయి ఉంటే, శ్రీరాముని నిందించాలని కోపంతో తార లోపలనించే ఒక్కసారి శ్రీరాముని చూచింది. మందహాసంతో నిలబడ్డాడు. చెక్కు చెదరలేదు. అలా నిలబడ్డ వాణ్ణి చూసి, "త్వమప్రమేయశ్చ దురాసదశ్చ" అని పొగుడుతుంది రూపం వర్ణిస్తోంది, గుణాలను వర్ణిస్తోంది. ఇదీ మహాను భావత.

**ఇతరుల తప్పులను నీవు మన్నించు; నీ తప్పులను భగవంతుడు మన్నిస్తాడు.**

అవతలివాడు కన్పించేసరికి, ఎదురుగా ఏమీ అనలేని ఒక ఆకర్షణ శక్తి ఉంటుంది. అది నడవడి వలన వస్తుంది. అది కలిగిన వాడు రాముడు.

పన్నెండవ గుణం ఆత్మవాన్కః. తరువాత దానికి అనుబంధంగా వచ్చే గుణాలు మిగిలినవి. నాలుగు. ప్రశస్తమైన మనస్సు ఉండాలి. మనస్సు యొక్క మాలిన్యాలు తొలగాలి. ఇవి తొలగడానికి మనస్సును నిగ్రహించుకోవడమే ప్రధానమై సాధనమని శాస్త్రాలు అన్నీ బోధించాయి. అటువంటి మనస్సును కలిగిన వాడు ఆత్మవాన్. మనస్సునే రావణుడు అని వ్యవహరించారు. కావ్య పద్ధతిలో, వ్యంగ్యంగా. బాహ్యంగా రావణుడు లోపల ఉన్న మనస్సే. వాడు చావకుండా వరం పొంది ఉన్నాడు. ఆ రావణుని జయించడానికి నీవు రాముడివి, అంటే మానవుడివి కావాలి. మానవుడే వానిని జయించగలడు. ఎప్పుడో రాముడు పుడితే మనకేమి ఉపయోగం? ఎప్పుడూ రాముణ్ణి పూజిస్తూంటే మనకేమి ఉపయోగం? **రాముడిలా నీవు ప్రవర్తించడానికి రాముని పూజించాలి. నీవు రాముడివి కావాలి.**

రామత్వము మనకు అలవడితే మానవత్వం వస్తుంది. మానవత్వం నీలో కలిగితే సర్వభూతములు నిన్ను ప్రేమిస్తాయి.

ఆఖరికి ఒక రెండు గుణాలు చెప్పాడు. "జిత క్రోధః కస్యబిభ్యతి దేవాశ్చ జాతరోషస్య సంయుగే." జితేంద్రియుడు కావాలి. ఇంద్రియములు ఉండాలి. కాని ఆ ఇంద్రియములు తన వశంలో ఉండాలి. అలాగే మానవునికి క్రోధం ఉండాలి. కాని జిత క్రోధుడు కావాలి. కోపాన్ని జయించిన వాడు కావాలి. వాల్మీకి 'క్రోధమ్ ఆహారయత్' అంటారు. రాముడు కోపమును తెచ్చుకొనెను అని. కోపం తెచ్చుకొని పిల్లల్ని భయపెట్టకపోతే అసలు లొంగరని ప్రేమగల తల్లి కోపం తెచ్చుకొంటుంది. కాని ప్రేమగల తల్లికి కోపం రాదు.

ఒక సన్నివేశంలో మాత్రం కోపానికి రాముడు లొంగిపోయాడు అని చెప్పాడు. యుద్ధం చేస్తూంటే, శ్రీరాముని తనపై వహించిన హనుమను బాణములతో రావణుడు కొట్టే, అప్పుడు హనుమ శరీరం రక్తంతో తడిసింది. శ్రీరాముడు మీద కూర్చుంటే వానికి దెబ్బ తగలకుండా, తన దెబ్బలను లక్ష్యంచేయకుండా ఎగురుతున్నాడు హనుమ. ఆ సన్నివేశంలో హనుమను చూచిన రామునికి రావణాసురునిమీద కోపం వచ్చినది. ఇదీ కావాలి. నీకు బాధ కల్గితే రాకూడదు కోపం. ఆశ్రయించినవారికీ, ప్రేమించినవారికీ బాధ కల్గినప్పుడు నీకు నిజమైన కోపం రావాలి. కాని దాన్ని వశంలో ఉంచుకోవాలి.

ఈ విధంగా వాల్మీకి పదహారు గుణములు చెప్పి ఈ పదహారు గుణములు ఎప్పుడూ కలిగిన మానవుడు ఎవడైననూ ఇప్పుడు ఈ లోకంలో ఉన్నాడా అని అడిగాడు. ఉన్నాడు, అతడు రాముడు – అని నారదుడు సమాధానం చెప్పాడు.

ఈ పదహారు గుణములలో ఏ ఒక్కటైనా మనం అలవర్చుకోగల్గితే, మనం పదహారోవంతు మానవులం. రెండు నేర్చుకోల్గితే ఎనిమిదో వంతు మానవులం. ఇలా లెక్క వేసుకుంటూ మానవులం కావాలి. **మన మానవత్వాన్ని మనం పర్యవేక్షించుకొనడానికి శ్రీరామాయాణం నేర్వాలి.**

నీవు ప్రవర్తించి, వాళ్లను ప్రవర్తింపజేయి. ఇది మన భారతీయమైన సంస్కృతి. ఈ సంస్కృతికి మూలం రామాయణం. రామాయణంలో ఉండే రాముడు మానవుడే. ఆయన మానవులను మానవులుగా నిలపడానికి అవతరించాడు. అట్టి మానవుడైన శ్రీరామచంద్రుని మనం అందరం సేవించి తరిద్దాం. వారి గుణ గణములను కీర్తిద్దాం. అలవరుచుకొని ఆచరిద్దాం.

– శ్రీభాష్యం అప్పలాచార్యులు

★★★

## శ్రీరాముని ప్రతిజ్ఞ

**సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే !**
**అభయం సర్వభూతేభ్యో దదామ్యేతత్ వ్రతం మమ !!**

"ఎంతటి అల్పుడైనా ఒక్కసారి 'నీవాడను' అని పలికిన చాలును. సర్వప్రాణుల నుండి వానిని రక్షించి తీరుదును. ఇది నా వ్రతము. వ్రతనిష్ఠుడు నియమము తప్పిన దోషియైనట్లే అడిగినవానిని రక్షించనిచో నేనునూ దోషినగుదును."

సత్యవాక్పాలనతో మానవత్వం నిండిన వానికి సర్వప్రాణులూ సర్వ లోకాలూ స్వాధీనమైయుండుననుటకీ ప్రతిజ్ఞయే నిదర్శనం.

**ఇనుమును తుప్పు చెడగొడుతుంది; మనస్సును బద్ధకం జడప్రాయం చేస్తుంది.**

## ధారావాహిక : గాయత్రీ మహావిజ్ఞానం- 10

# ఉన్నతికి ఒకేఒక మార్గం తపస్సు

ఏ వస్తువునైనా దోషరహితము, పవిత్రము, లాభదాయకము చేయాలంటే తపింపజేయాలి. బంగారము పుటము పెట్టడం వలన మేలిమి అవుతుంది. డాక్టర్లు పరికరాలను ఆవిరిలో తపింప జేసిగానీ, ఆపరేషను మొదలుపెట్టరు. కత్తులకు పదునురావడానికి ముందు ఎర్రగా కాల్చి నీటిలో ముంచి సాగకొట్టాలి. సానబెట్టాలి. వజ్రాన్ని అదేవిధంగా సానబెడితేగాని తళుకు బెళుకులు కనిపించవు. వ్యాయామమువంటి కష్టసాధ్యమైన అభ్యాసాలు చేయకపోతే ఎవరూ మల్లుడు కాలేరు. కఠోర పరిశ్రమకోర్చి అధ్యయనం చేయనిదే ఎవరూ విద్వాంసులు కాలేరు. తల్లి తన బిడ్డను నవమాసములు గర్భమున మోసినగాని పుత్రవతి అనిపించుకొనదు. గుడ్డలను ఎండలో ఆరవేయకపోతే కంపు కొట్టితీరతాయి. గోదాములలో నిల్వఉంచిన ధాన్యము అప్పుడప్పుడూ ఎండలో ఆరబెట్టకపోతే పుచ్చిపోతాయి. ఇటుకలను బట్టీలో కాల్చకపోతే గట్టితనం రాదు. వండని ఆహారము ప్రాణరక్షణ చేయలేదు.

ప్రాచీనకాలమందు పార్వతి తపముచేసి మనసునందలి కోరిక నెరవేర్చుకొన్నది. భగీరథుడు తపము చేసి గంగను భూలోకమునకు పిలుచుకొని రాగలిగినాడు. తాపసులు కఠోరతపము చేసి సిద్ధులను పడసినారు. రావణుడు, కుంభకర్ణుడు, మేఘనాథుడు, హిరణ్యకశిపుడు, భస్మాసురుడు మొదలగువారు తపము యొక్క ప్రభావముచేతనే విలక్షణ వరదానమును పొందినారు. నేటికి కూడా ఎవరికేది ప్రాప్తించినను అది తపముచేతనే ప్రాప్తించుచున్నది.

ఈశ్వరుడు తపస్వులయెడనే ప్రసన్నుడై అభీష్ట, ఆశీర్వాదముల నిస్తాడు. ధనసంపన్నుడు, సుందరుడు, ఆరోగ్యవంతుడు, విద్వాంసుడు, ప్రతిభాశాలి, నాయకుడు, అధికారి మొదలైన రూపములయందు భాసించు ప్రకాశము ఈ జన్మయందో, పూర్వజన్మలయందో చేసిన తపస్సునుబట్టి లభించును. మరల తపస్సు చేయనియెడల ఆ ప్రకాశము పూర్వ పుణ్యము తరిగినంతనే మసకబారును.

ప్రస్తుతము తక్కువలో ఉన్న వారు ఉచ్ఛస్థితి నొందుటకు ఒకేమార్గమున్నది. అది తపము. తపస్సు చేయక ఎట్టిస్థితి సాఫల్యము ఆత్మికముగానీ ప్రాపంచికముగానీ లభించదు. కళ్యాణము తపస్సునందే ఉన్నది. తపస్సుననే అభీష్ట వస్తువుల కోశము తెరువబడును.

రెండు అరచేతులు రాస్తే వేడి పుడుతుంది. రెండు ఎండుకట్టెలను రాస్తే అగ్ని పుడుతుంది. గమనము, వేడి, క్రియ ఈ మూడూ రంగు యొక్క పరిణామములు. యంత్రములను చలింప జేయుటకు త్రోయడమో, నెట్టడమో చేయాలి. లేకపోతే ఎంతటి ఖరీదుగల యంత్రమైనా స్తబ్దంగా ఉండిపోతుంది.

శరీరానికి కదలిక నివ్వడానికి వ్యాయామాన్ని చేయాలి. శ్రమయైనా చేయాలి. ఆత్మయందు తేజస్సు, సామర్థ్యము, చైతన్యము ఉత్పన్నం కావడానికి తపస్సుచేయవలసి ఉన్నది. పాత్రలను తోమకపోతే ఇంటిని దులిపి ఊడ్వకపోతే కసువు, మురికి పేరుకుపోతుంది. తపశ్చర్యను వదలినంతనే ఆత్మకూడ, అశక్తము, నిస్తేజము, వికారగ్రస్తము అయితీరుతుంది. సోమరితనము, ఎల్లప్పుడూ సుఖమును కోరుకొనుట అన్నమయ కోశమును ఆరోగ్యంగా ఉండనీయవు. అందులకే ఉపవాసములు, ఆసనములు. తత్వశుద్ధితోపాటు తపశ్చర్యకూడ ప్రథమకోశము యొక్క సువ్యవస్థకు ఆవశ్యక అంగముగా చెప్పబడింది.

ప్రాచీనకాలమందు తపశ్చర్యకు గొప్ప మహత్వ మీయబడినది. ఏ వ్యక్తి ఎంత కష్టపడి చేశాడు? ఎంతటి కష్టములను సహించాడు? ఎంతటి సాహసము, ప్రయత్నము, క్రియాశీలత కలిగినవాడు – అనే వాటినిబట్టి సిద్ధుడయ్యేవాడు. ధనవంతుడుగానీ, రాజుగానీ, చక్రవర్తిగానీ అందరూ తమ

**ఊహకూ, బ్రతుకుకూ మధ్య వంతెన ఉండాలి.**

పిల్లలను గురుకులములకు పంపి, కఠోర జీవనమందు శిక్షణ ఇప్పించేవారు. అప్పుడు వారు ఎట్టి ఆపదలనైనా ఎదుర్కొని సంపత్తిని పొందు సామర్థ్యం కలిగిఉండేవారు.

ప్రస్తుతం తపస్సు యొక్క మహత్వమును ప్రజలు మరిచిపోయినారు. సోమరితనము, బద్ధకము, నాజూకు ధనవంతుల లక్షణాలుగా పరిగణింపబడుతున్నాయి. అందువలన పురుష ప్రయత్నము తగ్గిపోతున్నది. యోగ్యతద్వారా అర్జించడం మానేసి అన్యాయము, మోసము, ధూర్తత్వములతో గొప్పవారు కావడానికి ప్రయత్నం జరుగుతున్నది.

గాయత్రీ సాధకుడు తపస్వియై తీరాలి. అస్వాదు వ్రతము, ఉపవాసము ఋతుప్రభావ (శీతోష్ణ) సహిష్ణుత, తితీక్ష, ఘర్షణ, ఆత్మకల్ప ప్రదాయిత్వము, నిష్కాసనము. సాధన, బ్రహ్మచర్యము, చాంద్రాయణము, మౌనము, అర్చన మొదలైన తపశ్చర్యా విధులు చెప్పబడినవి. శ్రమ, కర్తవ్యపరాయణత్వము, జాగరూకత, పురుషార్థములను తోడునీడగా ఉంచుకొనుము. సమయమును బహుమూల్య సంపత్తిగా గ్రహించి ఒక్కక్షణమైననూ నిరర్థకంగా వృధా చేయరాదు.

పరోపకారము, దేశసేవ, సత్కార్యములకై దానము, యజ్ఞ (త్యాగ) భావనతో కూడిన పరమార్థ జీవనము, ప్రత్యక్ష తపస్సు, ఇతరుల లాభముకొరకు తన స్వార్థమును బలిదానము చేయుట తపస్వీ జీవనముయొక్క ప్రధాన చిహ్నములు. ప్రస్తుత పరిస్థితులలో ప్రాచీన కాలములో వలె తపస్సు చేయడం కష్టం. భగీరథుడు, పార్వతి, రావణుడు మొదలైన వారివలె ఉగ్ర తపస్సు చేయుటకు తగిన శరీర స్థితి మనకు లేదు. దీర్ఘకాలము నిరాహారముగా నుండుట, విశ్రాంతి ఎరుగక దీర్ఘకాలము సాధనా నిరతులగుట నేడు సంభవము గాదు. అటుల జేసిన శరీరము గ్లాని నొందును.

కృతయుగమందు దీర్ఘకాలము తపము, దానము జరుగుతూ ఉండేవి. దానికి కారణం అప్పట్లో శరీరంలో వాయుతత్వం ప్రధానంగా ఉండేది. త్రేతాయుగమున అగ్నితత్వం ప్రధానంగా ఉండేది. ద్వాపరయుగమునందు జలతత్వము అధికంగా ఉండేది. ఆయుగములందు చేయబడిన సాధనలకు ఇప్పుడు మనం యోగ్యులం కాదు. నేడు కలియుగమందు, మానవదేహమందు పృథ్వీతత్వము ప్రధానముగా ఉన్నది. పృథ్వీతత్వము ఇతర తత్వములకంటే స్థూలము. అందువలననే నేటికాలమందు శరీరము కృత, త్రేతా, ద్వాపరయుగములనాటి కఠోర తపశ్చర్య చేపట్టలేదు.

ఇంకొక విషయం. వర్తమానకాలంలో సంయమమందు, సామాజిక, ఆర్థిక, భౌతిక వ్యవస్థలయందు పరివర్తన కలుగుట వలన మనుష్యుల జీవన, సహనములయందు గొప్ప అంతరము సంభవించినది. పెద్దనగరములలో నివసించేవారికి యాంత్రిక సభ్యత యొక్క తోడు లభించడంవలన శారీరక శ్రమ చాల తగ్గిపోయి అధికాంశము కృత్రిమ వాతావరణం కారణంగా శుద్ధ జలము, వాయువుల నుండి గూడ వారు వంచితులు కావడం జరుగుతున్నది. ఇట్టి స్థితిలో శరీరము పూర్వకాలమువలె యోగ్యంగా ఉండటం అసంభవంగా తోస్తున్నది.

కొద్దికాలం క్రితం వరకు నేతి, ధౌతి, వస్తి, న్యోరి, ప్రధోల, కపాలభూతి మొదలగు క్రియలు సులభంగా చేయగలిగేవారు. అవి చేసేటటువంటి యోగులు చాలామంది కనిపించేవారు. ఇప్పుడు యుగ ప్రభావంవల్ల సాధన కఠినమైపోయినది. ప్రస్తుతం అట్టి క్రియలు చేసినందువలన కలుగవలసిన లాభంకూడా కలుగుట లేదు.

ఎక్కువమంది హఠయోగులు ఈ క్రియలు చేయడంవలన కష్టసాధ్య రోగపీడితులవుతున్నారు. రక్తపిత్త, అంతర్దాహ, మూలాధార కఫ, అనిద్ర ఇత్యాది రోగములచే గ్రసితులైన హఠయోగులను మనం చూస్తున్నాము. అందువలన వర్తమాన కాలము యొక్క శారీరకస్థితులయందు ధ్యానము, తపశ్చర్యయందు బహుసావధానమగు పాత్రయొక్క ఆవశ్యకత ఉన్నది. నేడు సమాజసేవ, జ్ఞాన ప్రచారము, స్వాధ్యాయము, దానము, ఇంద్రియ సంయమము మొదలగు ఆధారములపైన మన తపోసాధన నిర్మితం కావాలి.

★★★

**ఆశపడకపోతే అసంతృప్తి ఉండదు.**

# ధారావాహిక : యువతరానికి మేలుకొలుపు - 5

# విశ్వవిప్లవాలలో యువశక్తి విశిష్ట భూమిక

### ఒంటరి పోరాటానికి సిద్ధపడాలి

ప్రపంచపు సవాళ్లను ఎదుర్కొనడానికై నీవు ఒంటరిగా పురోగమించాలి. ముందు ముందు ఇతరులు సహకరించడానికి ముందుకు రావచ్చు. అయితే, అందుకోసం ఎదురుచూడడంలో సమయాన్ని వృధా చేయడం విజ్ఞత కాదు. నీ పౌరుషంపై, నీ సాహసంపై, నీ వివేకంపై భరోసా ఉంచు. పరమాత్మ కృపపై అచంచల విశ్వాసం ఉంచు. సత్యం కోసం, ధర్మం కోసం, న్యాయం కోసం ఒంటరిగా పురోగమించడానికి సిద్ధంగా ఉండు.

సాఫల్యానికి మార్గం ప్రమాదాలతో నిండిన మార్గం. ఈ ప్రమాదాలను ఎదుర్కొనే సాహసం, కష్టాలను సహించే సాహసం, కఠోర పరిశ్రమ జరిపే సాహసం నిన్ను ప్రతి పరిస్థితిలోనూ సఫలుణ్ణి చేస్తుంది. అప్పుడే జాతి ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్లను కూడ ఎదుర్కొనడంలో సాఫల్యం సాధిస్తావు. విశ్వ విప్లవాన్నీ, సాంస్కృతిక సద్భావననూ ప్రబోధించిన జాతి నేడు ఉగ్రవాదాల, తీవ్రవాదాల విస్ఫోటనాలలో చిక్కుకుని ఉంది. కులతత్వపు, మతతత్వపు హింస దేశపు విశిష్ట వ్యక్తిత్వానికి పెనుసవాలుగా నిలుస్తోంది. జాతి యావత్తూ అవినీతిలో పీకలవరకు మునిగి ఉంది. ఒకప్పుడు బంగారు పిచ్చుకగా విశ్వ విఖ్యాతి పొందిన దేశం నేడు విదేశీయుల ఎదుట భిక్షాపాత్ర పుచ్చుకుని తిరుగుతోంది. సమాజమంతా నేడు నాయకత్వ విహీనం అయింది. రాజకీయ రంగం అవినీతికీ, అపరాధానికీ మారుపేరు అయింది. ప్రజాస్వామ్యపు వ్యవస్థ నవ్వులపాలు అవుతోంది. జాతి నిర్మాణ లక్ష్యం దారీ తెన్నూ కానరాని చీకటి సందుల్లో తప్పిపోయింది. దేశవ్యాప్తమైన అసంతృప్తి, అవ్యవస్థ సమాజపు రోగగ్రస్త స్థితికి అద్దం పడుతున్నాయి.

ఇలాంటి విషమ పరిస్థితిని ఎదుర్కొనే సామర్థ్యం, వ్యతిరేక దిశలో సాగుతూన్న ప్రవాహాన్ని మలుపుత్రిప్పి సరైన దిశకు తెచ్చే సాహసం - ఇవి సమైక్య యువశక్తికే సాధ్యపడతాయి. యువతలో ప్రచండమైన శక్తి ఉన్నదని అందరూ ఏకగ్రీవంగా ప్రకటిస్తున్నారు. అయితే నేడా శక్తి దిశ లోపించడంవల్ల చెల్లాచెదరు అయిపోతోంది. జాతిని వికట పరిస్థితినుండి వెలికితీసి, దానిలో నవ చైతన్యాన్ని నింపగల చేవ యువశక్తికి ఉన్నదని నేటి జాతీయ, సామాజిక వాతావరణం చాటిచెపుతోంది.

### స్వరాజ్య సమర సారథి యువశక్తి

మన జాతీయ గౌరవ గరిమను పరిరక్షించడానికై ఎపుడూ ముందుకు ఉరికింది యువతయే. సరిహద్దులవద్ద ప్రమాదం ఏర్పడినా, సామాజిక రాజకీయ రంగాలలో ప్రమాదం ఏర్పడినా - దాని నివారణలో మన దేశపు యువతీ యువకులు తమ సర్వస్వాన్నీ బలిదానం చేయడానికి ఎన్నడూ వెనుకాడలేదు.

స్వరాజ్య సమర చరిత్ర ఇందుకు సాక్ష్యం చెపుతోంది. 1857 నుండి 1947 వరకు సుదీర్ఘంగా సాగిన స్వరాజ్య సమరంలో దేశ ప్రజల హృదయాలలో జాతీయ చైతన్య దీప్తినీ, విప్లవ జ్వాలలనూ రగిలించడంలో యువత పాత్ర అతి ప్రముఖమైనది. 1857నాటి ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ మహానాయకులలో ఝాన్సీ లక్ష్మీబాయి, తాత్యాటోపే, మంగళ్ పాండేలు యువతరానికి చెందినవారు. అప్పుడు రాణీ లక్ష్మీబాయి వయస్సు 26 సంవత్సరాలు మాత్రమే. ఆంగ్లేయులను గడగడలాడించిన లక్ష్మీబాయి సేనలోని ఒక సేనాని ఝత్‌కారీ బాయి యువతియే. ఆమె ప్రేరణ ఫలితంగా

**తరగని మూలధనం మంచితనం.**

– ముందర్, జుహీ, మోతీబాయి వంటి వారాంగనలు విప్లవంలో వీరాంగనలుగా రూపొందారు. కాలిగజ్జెల రవళితో ప్రారంభమైన వారి జీవితాలు ఫిరంగుల మహోర్భటులతో సమాప్తం అయినాయి.

బెంగాలీ యువతను విప్లవ బలిదాన వేదికమీదకు తెచ్చిన శ్రీఅరవిందులు అపుడు 25 – 30 సంవత్సరాల యువకులే. నాడు అత్యున్నతమైన ఐ.పి.యస్ పరీక్షను కాలదన్ని, దేశభక్తితో ఉప్పొంగిన ఆయన జాతి జాగరణ మహాయజ్ఞంలో దుమికారు. కర్మయోగిన్, వందేమాతరం వంటి విప్లవ పత్రికల ద్వారా యువకులలో జాతీయ స్వాభిమానాన్నీ, విప్లవ భావాలను, దేశభక్తినీ పూరించారు. ఎందరెందరో యువకులు ఈ ప్రేరణవల్ల నవ్వుతూ నవ్వుతూ ఉరికంబాలు ఎక్కారు. 1908లో స్వరాజ్య యజ్ఞ బలివేదికపై అమరుడైన ఖుదీరామ్ బోస్ 18 సంవత్సరాల సింహకిశోరం. ఉరికంబం ఎక్కేముందు ఆయన ఇలా నినదించారు – **హాఁసీ – హాఁసీ చాఢ బె ఫాంసీ, దేఖిలే జగత్‌వాసీ, ఏక్‌బార్ విదాయ్ దే మా, ఆమి ధూరే ఆసీ ।**

అనగా –

నేను నవ్వుతూ నవ్వుతూ ఉరికంబం ఎక్కడాన్ని ప్రపంచం చూస్తుంది. ఓ భరతమాతా! నాకు వీడ్కోలు ఇవ్వు. నేను మళ్లీ మళ్లీ నీ ఒడిలో జన్మించాలి.

కాకోరీ కుట్ర కేసు స్వరాజ్య సమర చరిత్రలో ఒక మహత్తర ఘట్టం. 1925లో నడిచిన ఈ కేసులో విప్లవ ముద్దాయిలందరూ యువకులే. తమ సాహసంద్వారా, సంతోషపూర్వక ఆత్మబలిదానంద్వారా వారు దేశప్రజల హృదయాలలో దేశభక్తి జ్వాలను రగిలించారు. వీరిలో ప్రముఖ విప్లవ ముద్దాయి పండిత రామప్రసాద్ బిస్మిల్ ఉరితాడును పుచ్చుకుంటూ ఇలా గర్జించాడు –

**అబ్ న కోఈ బల్‌బలే హై, ఔర్ న అరమానోం కీ భీడ్, ఏక్ మిటజానే కీ హసరత్, అబ్ దిలే బిస్మిల్ మే హై ।**

ఇతర విప్లవ ముద్దాయిలు అమరవీరులు అశ్‌ఫాక్ ఉల్లా ఖాన్, రాజేంద్రప్రసాద్ లాహిడీ, రోషన్ సింహ్ మున్నగువారంతా యువకులే. తన నిరుపమాన దేశభక్తి ద్వారా, ఆత్మబలిదానం ద్వారా దేశమంతటిలో నవ విప్లవ తరంగాలను వ్యాప్తిచేసిన అమరవీరుడు భగత్‌సింగ్ వయస్సు అప్పుడు 23 సంవత్సరాలు. ఆయన విప్లవ సహచరులు రాజగురు, సుఖదేవ్‌లుకూడ యువకులే. వీరుకాక – అగణిత అజ్ఞాత యువకులు స్వరాజ్య సమర మహాయజ్ఞంలో తమ ఆహుతులు ఇచ్చారు. 1942 నాటి క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో కూడ యువశక్తి వీరోచితంగా విజృంభించింది. జాతిశక్తికి మారుపేరుగా నిలచింది.

## మహావిప్లవాలలో యువశక్తి పాత్ర

ప్రపంచమంతటిలో జరిగిన మహత్తర పరివర్తనలలో, సామాజిక, ఆర్థిక, ధార్మిక, రాజకీయ విప్లవాలలో యువ భావనలు పని చేస్తూవచ్చాయి.

ప్రబోధం పొందిన కొద్దిమంది యువకులు సమయపు అవసరాన్ని గుర్తించారు. స్వార్థాన్నీ, విలాస జీవనాన్నీ వదులుకున్నారు. ఫలితంగా – కొద్దివేలమంది భిక్షువులు తయారైనారు. చూస్తూ ఉండగానే బౌద్ధ మతం ఆశియా ఖండమంతటా వ్యాప్తి పొందింది.

2000 సంవత్సరాలలో ప్రపంచ జనాభాలో మూడవవంతును క్రైస్తవ మతంలో చేర్చిన ఘనత ఏసుక్రీస్తు యొక్క కొద్దిమంది శిష్యులకు దక్కుతుంది.

మార్క్స్ మరణించినప్పుడు ఆయన మృత దేహాన్ని ఖననం చేయడానికి 5 – 10 మందే వెళ్లారు. కానీ, ఆయన సిద్ధాంతంవల్ల ఆకర్షితులైన కొద్దిమంది యువకులు ప్రపంచంలోని పెక్కు దేశాలను కమ్యూనిస్టు దేశాలుగా మార్చారు.

**ఎలాగూ చేయవలసిన పనిని చిరునవ్వుతో చెయ్యి.**

### అమెరికా, రష్యాలలో

వాస్తవానికి - ఏ దేశ నిర్మాణం అయినా అక్కడి యువశక్తి కార్యశూరతవల్లనే జరిగింది. అమెరికా నేడు అతి సమృద్ధము, అతి బలీయము అయిన దేశంగా పరిగణించబడుతోంది. అక్కడి సామాజిక, ఆర్థిక, చట్ట, వైజ్ఞానిక, పారిశ్రామిక రంగాలలో జరిగిన తీవ్ర పరివర్తనల చరిత్ర ఇటీవలిదే. 1910లో అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో మొత్తం తొమ్మిదిమంది వ్యక్తులు ప్రభుత్వ పరిశోధన సంస్థల వివరాలను తీసుకుని సమావేశం అయినారు. వారు బుకింగ్ ఇన్‌స్టిట్యూట్ అనే సంస్థను స్థాపించారు. ఆ దేశపు చట్టపాలనా, విద్యా, విజ్ఞాన రంగాలలో విప్లవాత్మక పరివర్తనను తీసుకురావడం ఆ సంస్థ లక్ష్యం. ఆ సంస్థ ఈ విప్లవాత్మక కార్యక్రమాలకు సూత్రబద్ధమైన రూపం ఇచ్చి, వాటిని ప్రచురించింది అంతే. అయితే, అక్కడి యువ మేధావులు ఆ ప్రచురణనుండి ప్రేరణ పొందారు. ఈ ఉద్యమం నుండి బేవుడ్, జాన్ గార్డనర్, చాలీడోర్ వంటి కర్మవీరులూ, ప్రతిభావంతులూ అయిన వ్యక్తులు నిర్మాణం అయినారు. వారి కార్యక్రమాల వల్ల ప్రభావితులు కానివారు ఎవరూ లేరు. ఆ కార్యక్రమాలు పెను తుపానును సృష్టించాయి. ఫలితంగా - చట్టంలోనే కాక, ఆచార వ్యవహారాలలో, జాతీయ ప్రగతిలో తీవ్ర పరివర్తన వచ్చింది. అమెరికా ప్రగతి చరిత్ర అక్కడి యువ మేధావుల చెమటతో లిఖించబడి ఉంది.

ఒకప్పుడు అగ్రరాజ్యంగా ఉన్న రష్యా ప్రగతి చరిత్రకూడ యువశక్తి నిర్వహించిన ప్రముఖ పాత్రను స్పష్టం చేస్తోంది. ఖండితమైన సోవియట్ రష్యా ప్రస్తుత పరిస్థితి ఎలా ఉన్నా - 1920 నుండి 1960 వరకు నాలుగు దశాబ్దాలలో జరిగిన అద్భుత ప్రగతి చరిత్ర యువశక్తికి ఉదాహరణగా నిలుస్తోంది. 20వ శతాబ్దం ప్రారంభంలో ఆ దేశ జనాభాలో నాలుగింట మూడు వంతులు నిరక్షరాస్యులుగా, నిరుపేదలుగా ఉన్నారు. వైజ్ఞానిక రంగంలో ఆ దేశం బాగా వెనుకబడి ఉంది. ఆ తర్వాత - యువత తెచ్చిన సూత్రబద్ధ విప్లవం ఫలితంగా భారీయెత్తున పరివర్తన జరిగింది. యువశక్తిలోని నిర్విరామ కృషికీ, త్యాగానికీ, పట్టుదలకూ ఉజ్వల ఉదాహరణ అది.

ఆ నాలుగు దశాబ్దాలలో ఒక్క విద్యారంగంలో వచ్చిన విప్లవాన్ని రష్యన్ రచయిత ఎ.పుల్కో ఇలా వివరించారు: 1920లో 10 లక్షలమందిలో ఉన్నత విద్య గడించినవారు 3000 మంది మాత్రమే; ఆ తర్వాత యువతరం అక్షరాస్యతా పథకాన్ని రూపొందించారు. కరవు, వినాశనముల మధ్య సైతం ఈ పథకం గ్రామాలలో, గృహాలలో, పారిశ్రామిక సంస్థలలో అమలు జరిగింది. వైజ్ఞానికులనూ, రచయితలనూ, కళాకారులనూ రూపొందించడంకూడ ఈ విద్యా విప్లవ లక్ష్యం. ఈ ఉద్యమంలో లెనిన్, కోన్సతాన్తిన్ త్రియోల్కీవస్కో, ఇవాన్ పావ్‌లోవ్ వంటి వారు అగ్రభాగంలో నిలచారు. అయితే, ఈ విద్యా విప్లవ ప్రచార ప్రసారాలలో నిర్విరామ కృషినీ, త్యాగాన్నీ చూపినవారు యువతీ యువకులే. ఉన్నత విద్య పొందినవారి సంఖ్య 1940లో 1,10,000కు, 1960లో 3,34,000కు పెరిగింది.

### క్యూబాలో విద్యా విప్లవం

క్యూబా ఒక చిన్న దేశం. ఫలితంగా - దాని సామర్థ్యం పరిమితమే. అయినా, అక్కడి యువ మేధావులు అద్భుతమైన విద్యా విప్లవాన్ని సాధించి చరిత్ర సృష్టించారు. ఆ దేశంలో విద్యావంతులందరూ నిరక్షరాస్యులను వెదకి వెదకి వారికి విద్య గరిపారు. క్యూబానుండి నిరక్షరాస్యతను నిర్మూలించిన ఘనత అక్కడి యువతరానిదే.

చైనా, జపానులలో జరిగిన రాజకీయ పరివర్తనలలో, సాంఘిక సంస్కరణలలో కూడ యువతరం కీలక పాత్ర నిర్వహించారు.

★★★

**పెడత్రోవ పట్టే మనస్సే పెద్ద శత్రువు.**

ధారావాహిక : సమాజానికి వెన్నెముక వానప్రస్థం - 1

# నేటి వికృతులకు విరుగుడు - వానప్రస్థం

*అఖండజ్యోతి పత్రిక 1973 జూలై సంచిక వానప్రస్థ ప్రత్యేక సంచికగా వెలువడింది. వానప్రస్థ ఆశ్రమాన్ని వివిధ కోణాలనుండి విశ్లేషించే ఆ సంచికలోని వ్యాసాలు మహత్తరమైన ఆ విషయంపై పాఠకుల అవగాహనను అభివృద్ధి చేస్తాయి. ఆ వ్యాసాలను ఈ సంచికనుండి ధారావాహికగా ప్రచురిస్తున్నాం.*

జాగృత ఆత్మలు యుగ పరివర్తనకు నడుము బిగించవలసిన తరుణం ఇది. దుష్ట ప్రవృత్తులు విలయతాండవం చేస్తున్నాయి. ఈ పరిస్థితి కొనసాగడం వాంఛనీయం కాదు. జన మానసంలో వికృతులు పెచ్చుపెరిగిపోయాయి. అవి విజృంభించి, ఉపద్రవాలను సృష్టించవచ్చు - ఏ క్షణంలో అయినా.

## దాంపత్య జీవనపు దుస్థితి

ప్రత్యక్ష నేరాలూ, పరోక్ష నేరాలూ శృతిమించిపోతున్నాయి. ఫలితంగా - సన్మార్గుడు అని చెప్పబడే వ్యక్తి మారువేషంలో ఉన్న దుర్మార్గుడేమో అని అనుమానం కలుగుతోంది. శీల సంపద ఒక వాస్తవంకాకుండా పోతోంది; మాటల గారడీగా, పరస్పర ఉపదేశాల ప్రక్రియగా మిగిలిపోతోంది.

మనిషికీ మనిషికీ మధ్య అపనమ్మకం శిఖరాగ్రానికి చేరుతోంది. ఎవరికీ ఎవరిమీదా నమ్మకం లేదు. నేటి స్నేహితుడు రేపు శత్రువుగా మారి వెన్నుపోటు పొడుస్తాడేమో అన్న భయం మనిషి మనసును పట్టి పీడిస్తోంది. భార్యా భర్తల పెళ్లినాటి ప్రమాణాలు నవ్వులపాలు అవుతున్నాయి. చిన్నచిన్న కారణాలకే భార్యను వదలివేసే సంఘటనలు మితిమీరుతున్నాయి. అమాయకులయిన మహిళలు భర్తల చేతుల్లో హత్యలకు గురి అవుతున్నారు. ఇలాంటి పైశాచిక చర్యలు మినహాయింపులుగా మిగిలిపోవడం లేదు. పెళ్లినాడు కన్న కలలు రౌరవ నరకాలుగా పరిణమిస్తున్నాయి. రక్త కన్నీరుకు దారితీస్తున్నాయి. సుఖ సంతృప్తులతో కూడిన ఆనందమయ దాంపత్య జీవనం బహుకొద్దిమంది అదృష్టవంతులకే అందుతోంది. కాముక దృష్టి ప్రాధాన్యం వహించడంతో - పవిత్రమైన వివాహ వ్యవస్థ కలుషితం అవుతోంది.

## పశు ప్రవృత్తికి ప్రాధాన్యం

తండ్రీ కొడుకుల సంబంధం నామమాత్రం అయిపోతోంది. పిల్లలు వయస్సు వచ్చేవరకు మాత్రమే కొడుకులుగా వ్యవహరిస్తున్నారు. పెళ్లయి, ఉద్యోగం సంపాదించిన తర్వాత - తల్లి దండ్రుల బంధం, అన్నా చెల్లెళ్ల బంధం తెగిపోతున్నాయి. 'ప్రపంచం అంతటిలో కుటుంబ వ్యవస్థ కుప్పకూలిపోతోంది. మరి ఒక్క భారత్‌లో అది ఎంతకాలం నిలిచి ఉంటుంది? పశువుల, పక్షుల పిల్లలు తమ తల్లి దండ్రులను పట్టించుకుంటాయా? పశువులలో పక్షులలో తల్లి దండ్రులు తమ సంతానంమీద ఆశ పెట్టుకుంటాయా? మరి మనిషి ఆ బంధనంలో ఎందుకు బంధింపబడాలి?' - ఇలాంటి ఆలోచనలు తలెత్తుతున్నాయి. ఉపేక్ష సంతానం నుండే ఆరంభం అయినా - దాని ప్రతిక్రియ తల్లి దండ్రుల మీద కూడ పడుతుంది కదా. పాశ్చాత్య దేశాలలో భార్యా భర్తలమధ్య, తండ్రీ కొడుకుల మధ్య కష్ట సమయాలలో పరస్పరం ఆదుకునేటంతగా అనుబంధాలు లేవు. పశు ప్రవృత్తియే, జంతు జీవనమే లక్ష్యం అయినప్పుడు - కుటుంబ వ్యవస్థలోని ఉదాత్త ఆదర్శం ఎంతకాలం బ్రతికి బట్టకడుతుంది? కుటుంబం ఒక హోటల్‌గా, క్యాంటీన్‌గా తయారవుతోంది. కుటుంబం ఒకప్పుడు జాతి స్వరూపానికి ఒక చిన్న నమూనాగా, ప్రయోగశాలగా ఉండేది; స్వర్గమయ అనుభూతుల ఆనందాన్ని వెదజల్లేది. అలాంటి కుటుంబాలు ఇప్పుడు ఎక్కడ ఉన్నాయి?

## మందులమీద సాగుతూన్న బ్రతుకు బండి

సంయమనాన్ని కోల్పోయిన మనిషి నిరంతరం తన వ్రేళ్లతో తన కళ్లను పొడుచుకుంటున్నాడు. త్రాగుడు అలవాటు

**మనసును నరకం చేస్తుంది అనుమానం.**

నానాటికీ విస్తరిస్తోంది. మంచినీళ్లలా - పొగాకు అవసర వస్తువు అవుతోంది. జిహ్వా చాపల్యం ఆహారాన్ని విషంలా చేస్తోంది. మనం తిండిని తినడం లేదు; తిండి మనల్ని తినివేస్తోంది.

కౌమార దశకు ముందే కాముకత ప్రారంభం అవుతోంది. పరిపక్వత లేని ఆ దశలోనే జీవన రసం క్షీణించిపోతోంది. ఫలితంగా - యౌవనం, వృద్ధాప్యం చెట్టాపట్టాలు వేసుకుని వ్యక్తి జీవితంలో ప్రవేశిస్తున్నాయి. యౌవనం రాకముందే శరీరం దుర్బలమై రోగగ్రస్తం అవుతోంది. ఈనాడు మందులూ, డాక్టర్లూ రోజువారీ అవసరాలుగా మారిపోవడం కానవస్తోంది. వాటి సాయం లేనిదే బ్రతుకు బండి ముందుకు సాగడం లేదు.

## కట్టలు త్రెంచుకున్న హింసా ప్రవృత్తి

ఇక మానసిక వికారాలకు అంటే ఉండడం లేదు. శరీరం క్షీణించిపోతూ ఉండడం కళ్లకు కనబడుతుంది. మనసులో చొచ్చుకుపోయిన వికృతులూ వికారాలు లోతుకుపోయి చూస్తేకాని కనబడవు. మనిషికి తగిన గుణకర్మ స్వభావాలు కలిగిన వ్యక్తులు, మనిషికి తగిన ఆలోచనలూ, అభిరుచులూ, ఆకాంక్షలూ కలిగిన వ్యక్తులు అరుదుగా కనిపిస్తున్నారు. ఎవరి దురాలోచనలు వారివి. ఎవరి దుష్ప్రవృత్తులు వారివి. సదాచారాల కట్టలు త్రెంచుకుని విచ్చలవిడితనం పరవళ్లు త్రొక్కుతోంది. క్రోధం, ఆవేశం, ఉద్రేకాల గుప్పిళ్లలో చిక్కుకున్న మనస్సు చిన్న చిన్న విషయాలకే రెచ్చిపోయి హింసాకాండకూ, విధ్వంసక చర్యలకూ సిద్ధమవుతోంది. అసూయ, ప్రతీకారం, విద్రోహం అనే అసురులు తమ ఆయుధాలతో సన్నద్ధులై రక్త తర్పణం విడుస్తున్నారు.

హత్యలూ, ఆత్మహత్యలూ హద్దులు మీరి, సమాజ జీవితంలో మామూలు విషయాలుగా, అంతర్భాగాలుగా తయారవుతున్నాయి. నాగరికత ముసుగు వేసుకున్న మనిషి అడవి మృగం స్థాయికి దిగజారిపోయి నేరాలకూ, ఘోరాలకూ పాల్పడుతున్నాడు. ప్రగతి పేరిట ముందుకు వెళుతున్నామా వెనుదిరుగుతున్నామా అని మనల్ని మనం ప్రశ్నించుకోవలసి వస్తోంది.

## అడుగంటిపోతూన్న ఆదర్శవాదం

చింత, నిరాశ, శంక, అభద్రత, అవిశ్వాసాలు అంటని నిర్మలమైన మనస్సు అరుదుగా కనిపిస్తోంది. మనో నిబ్బరంతో, మానసిక సంతులనంతో పరిస్థితిని అంచనా వేయగలిగేవారూ, వాస్తవాన్ని విశ్లేషించగలిగేవారూ వెదకినా దొరకడం లేదు. ఎవరిలో చూచినా - పక్షపాత బుద్ధి, మొండి వైఖరి. ఇలాంటి స్థితిలో - వివేకాన్ని గురించీ, న్యాయాన్ని గురించీ, ఔచిత్యాన్ని గురించీ పదేపదే ప్రస్తావించడం అరణ్యరోదనమే అవుతుంది, నిరర్థకమే అవుతుంది. బలవంతుడిదే రాజ్యం - అనే ఆటవిక న్యాయం గుండా చర్యలకూ, ఉగ్రవాదానికీ దారితీస్తుంది. ప్రస్తుతం జరుగుతూన్నది ఇదే. కొద్దిమంది ఉగ్రవాదులు అడ్డూ అదుపూలేకుండా స్వైర విహారం చేస్తున్నారు. సజ్జనులు సగౌరవంగా జీవించడం కష్టమయిపోతోంది.

న్యాయంపై చర్చ జోరుగా సాగుతోంది. కానీ, భగవంతుణ్ణి పొందడంకన్న న్యాయాన్ని పొందడం కష్టమయిపోతోంది. ఇలాంటి స్థితిలో సదాశయాలపై, ఉదాత్త ఆదర్శాలపై మనిషికి ఉన్న నిష్ఠ క్షీణించిపోతోంది. ప్రజలు శ్రద్ధా విహీనులుగా తయారవుతున్నారు.

## అన్ని రంగాలలో అస్తవ్యస్త పరిస్థితి

ఇలాంటి దయనీయ పరిస్థితి మనచుట్టూ వ్యాపించి ఉంది. మానవ జాతి దుర్భరమైన దుస్థితిలో చిక్కుకుని ఉంది. అయితే - సజ్జనులూ, సత్ప్రవృత్తులూ, సదాశయాలూ పూర్తిగా లోపించిపోలేదు. ఎడారిలో అక్కడక్కడ చిన్నచిన్న నీటి పడియలూ కనిపిస్తూ ఉంటాయి. అయితే అవి బహు అరుదు. మొత్తం పరిస్థితి దారుణంగా ఉంది. అది నానాటికీ విషమిస్తోంది. ఆ పరిస్థితిని చూస్తే - నిరాశ చిమ్మచీకటిలా మూసుకువస్తూన్నట్లు అనిపిస్తోంది.

మరోప్రక్క - సంస్కరణవాద శక్తుల పరిస్థితి హాస్యాస్పదంగా ఉంది. మత, ఆధ్యాత్మిక, సామాజిక, రాజకీయ రంగాలలో సంస్కరణ గురించీ, ఉద్ధరణ గురించీ నినాదాలు జోరుగా వినిపిస్తున్నాయి. కానీ, ఆయా రంగాలలో మాటలకూ, చేతలకూ పొంతన ఏమాత్రం ఉండడం లేదు. ఇలాంటి స్థితిలో ఉజ్వల భవిష్యత్తును గురించిన ఆశ క్షీణించిపోతోంది. శాస్త్ర విజ్ఞానం, కళా సాహిత్యాలు, ప్రముఖుల పాత్ర - వీటివల్ల సత్ఫలితాలు అందుతాయనే ఆశ కలగడం లేదు; దుష్ఫలితాలు

**అహంభావం చికిత్సకు లొంగని జబ్బు.**

దాపురిస్తాయనే అనుమానం పెరుగుతోంది. వివిధ దేశాల రాజకీయ చదరంగాలలో శకుని పాత్రలే ప్రాధాన్యం వహిస్తున్నాయి. అంతర్జాతీయ పరిస్థితి సంక్షోభకరంగా తయారయింది.

## ఇది మన కార్యశూరతకు సవాలు

ఇలాంటి విపత్కర క్షణాలలో మనం జీవనం సాగిస్తున్నాం. మరి ఈ పరిస్థితిని ఇలాగే ఉండనివ్వాలా? మనం చేతులు ముడుచుకుని కూర్చోవాలా? మనం నిస్సహాయులుగా, అసమర్థులుగా మిగిలిపోవాలా? పరిస్థితిని మార్చడానికి మరెవరో వస్తారని ఆశిస్తూ ఉండిపోవాలా?

అలా జరగడానికి వీలు లేదు. మార్పు కోసం ప్రముఖులు ముందుకురాకపోయినా మనం నిరాశ చెందకూడదు. చిన్నవాళ్లం మనం కలసికట్టుగా కార్యశూరత చూపాలి. దీపావళిరోజున చిన్న చిన్న ప్రమిదలలోని దీపాలు అమావాస్య అంధకారాన్ని పటాపంచలు చేస్తాయి; వెలుగుల వెల్లువను సృష్టిస్తాయి. భావనాశీలురమూ, కర్మనిష్ఠులమూ అయిన మనం ఆ పని చేయలేమా?

## పరివర్తనను సాధించిన వానరసేన

ఈ పరిస్థితులలో మనం నిష్క్రియంగా, ప్రేక్షకులుగా కూర్చుని ఉండిపోకూడదు. చరిత్రలో ఇలాంటి పరిస్థితులు ఎప్పుడైనా ఏర్పడ్డాయా, ఏర్పడినప్పుడు మార్పుకోసం ఏ మార్గం అనుసరించబడింది - అని మనం ఆలోచించాలి.

ఇలాంటి పరిస్థితి త్రేతాయుగం చివరలో ఏర్పడింది. అప్పుడు అసురత్వం విజృంభించింది. ఆ అసురత్వానికి కేంద్రం లంకను పాలిస్తున్న రావణాసురుడు. ఈ పరిస్థితిని మార్చడానికి జటాజూటాలు ధరించిన ఇద్దరు రాజకుమారులు ముందుకు వచ్చారు. వారికి సహకారం అందించడానికై వానర సైన్యం ప్రాణాలను అరచేత పుచ్చుకుని నిలబడింది. అసాధ్యములు అనుకున్నవి సాధ్యపడ్డాయి. సముద్రంపై వారధి నిర్మించబడింది. వానరసేన రాళ్లతో జయించింది అపారమైన రాక్షస సేనావాహినిని. నేడుకూడ ఆ చరిత్రను పునరావృతం చేయవచ్చు, పునరావృతం చేయాలి.

## సేవావ్రతుల సేన నేటి అవసరం

నాటి వానరులవలె - ప్రాణాలను ఒడ్డి అసురత్వాన్ని జయించే భావనాశీలురూ, కర్మనిష్ఠులూ అయిన వ్యక్తులు నేడు ముందుకు రావాలి. పేరు ప్రతిష్ఠల కోసం కాక, ప్రజాసేవను ఆడంబరంగా ప్రదర్శించడానికి కాక - యుగపరివర్తన కోసం తమను తాము జ్వలించుకునే, కరిగించుకునే వ్రతాన్ని స్వీకరించి వారు పురోగమించాలి. అలాంటి వ్యక్తిత్వాలు లభిస్తే - వ్యక్తినీ, కుటుంబాన్నీ, సమాజాన్నీ, ప్రతి రంగాన్నీ ఆవరించిన చిమ్మచీకటిని తరిమివేయవచ్చు. మండే దీపం చుట్టూ ఉన్న చీకటిని మ్రింగివేయగలుగుతుంది. యుగ పరివర్తన కోసమై తమను తాము ఆహుతి చేసుకునే సంస్కరించబడిన వ్యక్తిత్వాలు నేటి సంక్షోభాలను సమాప్తం చేయగలుగుతాయి.

## యుగ పరివర్తనకు ఆయుధం వానప్రస్థం

ఈ మహోద్యమానికి అద్భుతంగా ఉపకరించే ఒక మహత్తర సంప్రదాయం మన సాంస్కృతిక వారసత్వంలో ఉన్నది. అదే వానప్రస్థం. మన జాతి గౌరవం శిఖరాగ్రానికి చేరుకున్న రోజులలో మేలుకొన్న ప్రతివ్యక్తీ తన జీవితంలోని మలిసగాన్ని ఈ ఆశయంకోసం సమర్పించేవాడు. వికృతులను మొగ్గలోనే త్రుంచివేయడానికీ, సత్ ప్రవృత్తులను పెంపొందించడానికీ అంకితం అయేవాడు. సమాజాన్ని దిగజార్చే, నిర్వీర్యం చేసే వికృతులను నిర్మూలించడానికై ఒక బృందం నిరంతరం క్రియాశీలంగా నిలచి ఉండడం అనేదే వానప్రస్థం యొక్క లక్ష్యం. మరమ్మత్తులు చేసే ఏర్పాటు లేకపోతే - భవంతులు ఎక్కువ కాలం నిలచి ఉండవు. ఉత్కృష్టులైన ప్రజాసేవకులు సమాజ భవనానికి మరమ్మత్తులు చేసే పనిని నిర్వహించగలుగుతారు. ప్రాచీన కాలంలో వానప్రస్థ ఆశ్రమం అలాంటి ప్రజాసేవకులను తీర్చిదిద్దేది.

యుగం యొక్క అవాంఛనీయ స్థితిని మార్చడానికై మనం వానప్రస్థ ఆశ్రమ పునరుద్ధరణకు పూర్తి శక్తిని వినియోగించాలి. ఈ పని జరిగితే - యుగం మారుతుంది; నేటి అంధకారాన్ని అంతంచేసే వెలుగుల వెల్లువ అవతరిస్తుంది.

★★★

**అశాంతికి మూలం ముదిరిన స్వార్థం.**

## ధారావాహిక : దివ్యజీవన దర్శనం - 28

# దీక్షా భూమికి యాత్ర - 4

### హిందూ విశ్వవిద్యాలయంలో సంక్షోభం

మాలవ్యాజీ అరెస్టుతో - విశ్వవిద్యాలయ వాతావరణం వ్యాకులత, చింత, ఆవేశాలతో నిండిపోయింది. ఆచార్య ఆనంద శంకర బాపూ భాయి ధ్రువ విశ్వవిద్యాలయానికి ప్రో - వైస్ చాన్సలర్‌గా ఉన్నారు. ఆయన ఇబ్బందులను ఎదుర్కొనవలసివచ్చింది. సహాయ నిరాకరణ ఉద్యమానికి ఆశ్రయం ఇవ్వడం, జాతీయ భావనలు ఉప్పొంగడం చూచి, పరాయి ప్రభుత్వం వెంటనే విశ్వవిద్యాలయానికి గ్రాంటు నిలిపివేసింది. ఆ చిక్కునుండి బయటపడడానికై ఆచార్య ధ్రువ వెంటనే లక్నో వెళ్లారు. అక్కడి అధికారులు ఆయనకు ప్రభుత్వపు తీవ్ర అసంతృప్తిని వెల్లడి చేశారు. విశ్వవిద్యాలయం రాజకీయాలకు కేంద్రంగా మారిందని ఆంగ్ల అధికారులు భావిస్తున్నారు. గ్రాంట్లు నిలిపివేస్తే, విశ్వవిద్యాలయం దారికి వస్తుందన్నది వారి ఆలోచన. విశ్వవిద్యాలయం ఒక జాతీయ సంస్థ అనీ, ధర్మం నైతికతలు ఆధారంగా యువకులను ఆదర్శపౌరులుగా తీర్చిదిద్దడం దాని లక్ష్యమనీ, దానికి రాజకీయాలతో ఎలాంటి సంబంధమూ లేదనీ స్పష్టంచేయడానికి ఆయన విశ్వప్రయత్నం చేశారు. సమకాలీన పరిస్థితులవల్ల ఇక్కడి యువకులలో జాతీయ భావ తరంగాలు ఎగసిపడుతున్నాయనీ, ఆ తరంగాలకు ఎవరూ దూరంగా ఉండజాలరనీ ఆయన వివరించారు. ఈ స్పష్టీకరణతో ఆంగ్ల అధికారులు సంతృప్తిచెందలేదు. విశ్వవిద్యాలయంలో అల్లకల్లోలం కొనసాగింది.



విశ్వవిద్యాలయ వాతావరణంలో వ్యాపించి ఉన్న ఆవేశాన్నీ, ఉత్సాహాన్నీ శ్రీరామ్ అవగాహన చేసుకున్నారు. తన ప్రేరణా భూమి సంస్కారాలను స్వంతం చేసుకోవాలని ఆయన అనుకున్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణం నుండి బయటకు వస్తున్నప్పుడు ఆయన మనస్సులో మరో ఆలోచనా తరంగం ఉబికింది - అవకాశం లభిస్తే, భారతీయ సంస్కృతి, ధర్మాల నవోన్మేషానికీ, నవ్యవికాసానికీ సమర్పితమైన ఇలాంటి విశ్వవిద్యాలయాన్ని నిర్మాణం చేయాలని; దానిని రాజకీయ ప్రభావానికీ, జోక్యానికీ దూరంగా ఉంచాలని. ఆ ఆలోచనా తరంగం లేచింది, తీసింది - ఇది ఎలా సాధ్యమనే ప్రశ్నతో. మళ్లీ మరో తరంగం వచ్చింది. మార్గదర్శక సత్తాయే ఈ తరంగాన్ని సంకల్పంగా మార్చుతుందనీ, అదే ఆ పని పూర్తిచేస్తుందనీ.

మహామనా మాలవ్యా ఆ సమయంలో నైనీ (ప్రయాగ) - సెంట్రల్ జైలులో ఉన్నారు.

విశ్వవిద్యాలయాన్ని మూసివేయించడానికి కొన్ని అవాంఛనీయ శక్తులు ప్రయత్నిస్తున్నాయి. వ్యతిరేకత మొదటినుంచీ ఉంది. విశ్వవిద్యాలయం చిక్కులనుండి బయటపడి నిలబడుతుందనే నమ్మకం వ్యతిరేకులకు కలగలేదు. సాధన సంపద లేదు; ప్రజల సహకారం లేదు; పెట్టుబడిదారులూ, పారిశ్రామికవేత్తలూ, సంపన్నులూ వెన్నుదన్నుగా నిలవడం లేదు; కనుక విశ్వవిద్యాలయం కొద్ది రోజుల్లోనే మూతపడుతుందని వారు భావించారు. కానీ, వారి దురాశ ఫలించలేదు. చిన్న చిన్న అంశదానాలతో భారీమొత్తం సమకూరింది. విశ్వవిద్యాలయ స్వప్నద్రష్ట తన ఊహ సాకారం కావడం చూడసాగారు. ఆటంకాలు కల్పించి సంతోషించే వ్యక్తులు నిరాశ చెందారు. స్థానిక కాంగ్రెస్ కమిటీ ఇలాంటి వ్యక్తులతో నిండి ఉంది. విశ్వవిద్యాలయాన్ని అప్రతిష్టపాలు చేయడానికి వారు అన్ని రకాల కుతంత్రాలను సాగించారు.

### మాలవ్యాజీ ఉద్బోధ

1929 డిసెంబరులో మాలవ్యాజీ విశ్వవిద్యాలయ

**ఐశ్వర్యానికి అలంకారం మంచితనం.**

స్నాతకోత్సవంలో ప్రసంగించారు. దేశంకోసం తమ సర్వస్వాన్నీ బలిదానం చేయాలని ఆయన ఆ ప్రసంగంలో విద్యార్థులకు ప్రేరణ ఇచ్చారు. ఆ ప్రసంగం విద్యార్థి ఉద్యమ చరిత్రలో ఒక మైలురాయి. ఆ ప్రసంగంలో మాలవ్యాజీ విద్యార్థులను ఇలా ఉద్బోధించారు–

'మీరు ఇక్కడనుండి వెళ్లి ప్రజలలో విద్యను వ్యాప్తి చేయండి. పరిశుభ్రత గురించీ, ఆరోగ్యరక్షణ గురించీ వారికి వివరించండి. మీమీ గ్రామాలలో సహకార సంస్థలను స్థాపించండి. స్వరాజ్యం కోసం ఎలాంటి త్యాగాలకయినా సిద్ధపడండి. మీ హృదయాలలో స్వాతంత్ర్య కాంక్షనూ, మాతృభూమికోసం త్యాగం చేయాలనే భావననూ పెంపొందించుకోండి.'

ఈ స్నాతకోత్సవానికి కొద్దిరోజుల తర్వాత గాంధీజీ నాయకత్వంలో సహాయ నిరాకరణ ఉద్యమం ప్రారంభమయింది. కాశీ విశ్వవిద్యాలయ విద్యార్థులుకూడ ఉద్యమంలోనికి దుమికారు. విశ్వవిద్యాలయాన్ని కూకటివ్రేళ్ళతో పెళ్ళగించివేయ జూస్తున్న వ్యక్తులకు ఇది చక్కని అవకాశం అయింది. విద్యార్థి ఉద్యమంలో దూరి, వీరు గూండా చర్యలు, లూటీలు జరిపారు. సహజంగానే – విద్యార్థులపై ఆరోపణలు వచ్చాయి. 1930 తొలి నెలలో స్థానిక కాంగ్రెసువాదులు ఎంత హంగామా చేశారంటే – ఉద్యమానికి దూరంగా ఉండవలసిందిగా విద్యార్థులకు సలహా ఇచ్చే విషయం మాలవ్యాజీ ఆలోచించసాగారు. అయితే , నిజం ఎక్కువసేపు దాగలేదు. కాంగ్రెసులో చేరిన అరాజక శక్తుల కుతంత్రాలు బయటపడనే పడ్డాయి. అప్పుడు కాంగ్రెసు అధ్యక్షుని పని చూస్తున్న సర్దార్ పటేల్ దృష్టికి వచ్చింది ఈ సంగతి. ఆయన అరాజక శక్తులకు గట్టి హెచ్చరిక చేశారు. వాటిని అదుపుచేయవలసిందని స్థానిక నాయకత్వాన్ని ఆదేశించారు. ఆ రోజుల్లో కాంగ్రెసు అధ్యక్షుని ఆదేశం రాజాజ్ఞయే. స్థానిక కమిటీ క్రమశిక్షణ పాటించి పని చేయాలి, లేదా నిష్క్రియంగా కూర్చోవాలి – అని సర్దార్ పటేల్ ఆదేశించారు. ఈ ఆదేశం విశ్వవిద్యాలయ వ్యతిరేకులను కొంతవరకు అదుపుచేసింది.

విశ్వవిద్యాలయ ప్రాంగణంలో అక్కడక్కడ చర్చలు జరుగుతూవచ్చాయి. వాటిలో వర్తమాన పరిస్థితులేకాక గతంలో జరిగిన సంఘటనలుకూడ ప్రస్తావనకు వచ్చాయి. ఈ కాశీ యాత్రలో శ్రీరామ్ రాజకీయాలను, స్వరాజ్య ఉద్యమంలోని సమకాలీన పరిణామాలను నిశితంగా పరిశీలించారు. మూడు నాలుగు రోజులపాటు ఆ స్థలానికి వెళుతూ వచ్చారు. నగరంలోనికి ఒక మాతాజీ వచ్చారని ఆ సందర్భంగా ఆయనకు తెలిసింది. ఆమె సమాధి స్థితిలో ఉంటారనీ, ఆమె దర్శనం చేసుకోవాలనీ అక్కడివారు చెప్పారు.

సమాధి స్థితి ప్రస్తావన వినగానే, శ్రీరామ్‌లో ఉత్కంఠ ఉదయించింది. ఆయన ఆమె చిరునామా అడిగారు. ఆమె రామాపురాలో ఒక భక్తుని గృహంలో బస చేశారు. ఆమెతోపాటు ఆమె భర్తకూడ ఉన్నారు. మాతకు సంతానం లేదు. మామూలు గృహస్థ జీవితంపట్ల ఆమెకు ఆసక్తిలేదని అక్కడివారు తెలిపారు. వివాహ సమయంలోనైతం ఆమె భావసమాధిలోనే ఉన్నారు. ఆమె పేరు బహుకొద్దిమందికే తెలుసు. ఆమె మీరాబాయి అవతారమని కొందరు శ్రద్ధాళువులు చెప్పేవారు. ఆమె భర్తకూడ ఆమెను మాతాజీ అని పిలుస్తారు.

## మాతా ఆనందమయితో సమావేశం

శ్రీరామ్ ఆమెను కలుసుకోవాలని నిర్ణయించారు. రామాపురా చిరునామా తీసుకుని బయలుదేరారు. మాత పేరు నిర్మలాదేవి. ఆ ఇంటి రెండవ అంతస్థులో ఆమె బసచేశారు. ఆమె దర్శనం కోసం 25–30 మంది బయట నిలబడి ఉన్నారు. శ్రీరామ్ చేరే సమయానికి మాతాజీ సమాధిలో ఉన్నారు. ఇప్పుడు దర్శనం సాధ్యపడదని ఆమె సేవకులు చెప్పారు. సమాధి పూర్తయిన తర్వాత ఆమె స్వయంగా బయటికి వస్తారని వారు వివరించారు. శ్రద్ధాళువులు చాలాసేపు కూర్చున్నారు. సుమారు రెండుగంటల తర్వాత సమాధి పూర్తయింది. ఆమె బయటికి వచ్చారు. ఇంతటి తేజస్సు కలిగిన మహిళను ఎన్నడూ చూడలేదని శ్రీరామ్ అనుకున్నారు. నిర్మలాజీ వ్యక్తిత్వంలోని దివ్య తేజస్సు ఆయనకు తొలి దర్శనంలోనే అవగాహన అయింది.

సనాతన ధర్మ ప్రచారంలో నిమగ్నులైన స్వామి దయానందజీకూడ అక్కడికి వచ్చారు. స్వామీజీ తన లక్ష్యసాధన కోసం 'భారత ధర్మ మహామండల్' స్థాపించారు. కాశీలోని ప్రసిద్ధి

**విద్యకు అలంకారం నీతి.**

పొందిన పలువురు సాధు – మహంత్‌లు ఆ సంస్థలో సభ్యులు. స్వామీజీ స్థాపించిన ఈ సంస్థనుండి ఆ తర్వాత అనేక ధార్మిక సంస్థలు ఉదయించాయి. విద్వత్ పరిషద్, ధర్మప్రచార మండల్, సనాతన ధర్మ ప్రతినిధి సభవంటి సంస్థలను స్థాపించిన ధర్మాచార్యులు స్వామి దయానంద శిబిరంనుండే బయలుదేరారు. సనాతన ధర్మ ప్రవాహానికి తీవ్ర వేగాన్ని కలిగించిన కారణంగా విఖ్యాతులైన స్వామి దయానంద అక్కడ ఉన్న శ్రద్ధాళువులతో ఇలా చెప్పారు – మాతాజీ సాక్షాత్తు దేవి; ప్రపంచానికి సద్భావ సందేశాన్ని, భక్తి సందేశాన్ని అందించేందుకు దిగివచ్చింది. స్వామీజీ చేసిన ఈ ఉద్బోధ అక్కడ చేరిన ప్రజలను ఎంతగానో ప్రభావితం చేసింది.

మాతాజీతో సంభాషణ జరపాలనే ఆకాంక్ష శ్రీరామ్ మనస్సులో జనించింది. ఆరోజున ఆ అవకాశం దొరకలేదు. మరునాడు 10–11 గంటలకు ఆయన తిరిగి మాత నివాసానికి వెళ్లారు. ఆ సమయంలో ఎక్కువ జనం లేరు. మాతాజీ జాగృత స్థితిలో ఉన్నారు. సులువుగా సమావేశం జరిగింది. అక్కడ ఉన్న వ్యక్తుల ఎదుటనే చర్చ జరపడానికి ఆమె అనుమతి ఇచ్చారు. శ్రీరామ్ "మీరు ఎవరు?" అని అడిగారు.

మాతాజీ ఇలా అన్నారు – "నేను ఏమి చెప్పను? మీరంతా అనుకున్నది సరైనదే అవుతుంది."

"మీరు నిరంతరం సమాధిలో ఉంటారని ప్రజలు చెపుతారు. ఆ సమాధి సవికల్పమా, నిర్వికల్పమా?"

"నేను చదువుకున్నదాన్ని కాను. శాస్త్రాలలో నాకు ప్రవేశం లేదు. కనుక – నేను ఏ భావదశలో ఉంటానో చెప్పలేను."

'మాతాజీ! ఈ యుగంలోకూడ సిద్ధ పురుషులు ఉన్నారా?" – అని ఒక సాధకుడు అడిగాడు.

మాతాజీ ఇలా చెప్పారు – "ఎందువల్ల? ఈ యుగానికి ఏమయింది? సిద్ధ పురుషులు ప్రతి యుగంలోనూ ఉంటారు. బ్రాహ్మీ స్థితిని పొందిన వ్యక్తులవల్లనే ఈ జగత్తు స్థిరంగా ఉంది. వారు లేకపోతే జగత్తు లయం అవుతుంది."

ఆ సాధకుడు మళ్లీ ఇలా అడిగాడు – "వారు ఉన్నప్పటికీ మన దేశం బానిసత్వంలో ఎందుకు ఉంది?"

మాతాజీ ఇలా జవాబిచ్చారు – "ప్రభువు ఇచ్ఛ. ఆయన తన లీలలోని తామస గుణంలో ఆనందం పొందుతున్నారు. ఇప్పుడు రజోగుణం మేలుకొన్నది కనుక, స్వాతంత్ర్య కాంక్ష రగిలింది. కొద్ది సంవత్సరాలలో దేశానికి స్వరాజ్యం వస్తుంది."

"అందుకోసం కృషి చేయవలసిన అవసరం లేదా మాతాజీ?" – అని శ్రీరామ్ అడిగారు. మాతాజీ జవాబు – "ప్రయత్నం చేయక తప్పదు. కోరుకొనకపోయినా, దేశ ప్రజలు ప్రయత్నిస్తారు. ఎందుకంటే – ప్రభువు తన మాయయొక్క రాజస గుణాన్ని మేలుకొలుపుతున్నారు. సోమరితనం, పొరపడడం తామస గుణాలు. వాటిలోనికి వెళ్ళడానికి ఏ ప్రయత్నమూ అవసరం లేదు."

"మరి మన దేశం ఎన్నడైనా సత్వ గుణంలో స్థిరపడుతుందా?"

"స్థిరపడుతుంది, తప్పక స్థిరపడుతుంది. ఆ స్థితిలో నలువైపులా దివ్యభావం విస్తరిస్తుంది. దేశం తన గౌరవాన్ని తిరిగి సంపాదిస్తుంది. భగవానుడు ఎంపిక చేసిన గౌరవాన్ని సంపాదిస్తుంది."

ఈ సంభాషణ జరుగుతూ ఉండగా, మాతాజీ సమాధిలోనికి వెళ్లిపోయారు. జనం అక్కడే కూర్చొని ఉన్నారు. సమాధి స్థితిలో ఆమె కళ్లు మూసుకుని కూర్చున్నారు. ఆమె ముఖమండలంపై అద్భుత శాంతి తాండవించింది. ఆమెలోని కణ కణం భగవానుని స్మరణ చేస్తున్నదని అనిపించింది. అరగంటసేపు ఆమె ఆ స్థితిలో ఉన్నారు. ఆ స్థితినుండి మేలుకొన్న తర్వాత ఆమె దృష్టి శ్రీరామ్ మీద పడింది. ఆమె హఠాత్తుగా ఇలా అన్నారు –

"మీరు మీ స్థలానికి ఎప్పుడు వెళుతున్నారు, శ్రీరామ్? ముందుముందు హరిద్వార్‌లో మీతో సమావేశం జరగవలసి ఉంది. అప్పుడు మీరు గంగాతీరంలో దివ్యభావనను స్థాపిస్తూ ఉంటారు."

ఆ మాట విని, శ్రీరామ్ చకితులు అయినారు. మాతాజీ చెపుతున్నది ఏమిటి? ప్రస్తుతం హరిద్వార్ గురించి మనసులో ఎలాంటి సంకల్ప – వికల్పం కాని, భావం కాని లేదు. ఆశ్చర్యం

**ధనానికి అలంకారం దానం.**

కలిగించే మాతాజీ మాటలకు ఆయన తనకు తానే సమాధానం చెప్పుకున్నారు - సంత్-మహాత్ముల లీలలు విలక్షణంగా ఉంటాయని.

శ్రీరామ్ ఈ ప్రశ్నను ఊహించలేదు. జవాబుగా ఏమి చెప్పాలా అని ఆయన ఆలోచించసాగారు. ఆ తర్వాత ఇలా అన్నారు - "రెండు మూడు రోజుల్లోనే."

ఆయన కాశీలో నెలరోజులు ఉండాలని సంకల్పించారు. ఆ ప్రకారం ఇంకా 8-10 రోజులు కాశీలో ఉండాలి. కానీ త్వరగా తిరిగివెళ్లాలని శ్రీరామ్ నిన్న సాయంత్రమే ఆలోచించసాగారు. కాశీ హిందూ విశ్వవిద్యాలయానికి వెళుతూవస్తూ ఉన్న ఫలితంగా - దేశ కాల పరిస్థితులను గురించి చాలా సమాచారం తెలిసింది. ఆవల్‌ఖేడాకు తిరిగివెళ్లాలని ఆయన మనస్సు తహతహలాడింది. నలువైపులా వాతావరణం వేడెక్కుతోంది. దేశంలో జాతీయ భావనలు ఉప్పొంగుతున్నాయి. ఈ పరిస్థితులలో ఇక్కడ తీర్థాలను సేవిస్తూ ఉండడంలో ఔచిత్యం ఏముంది? మాతాజీ ఎదుట ఆయన నిశ్చయం వ్యక్తమయింది.

## స్వగ్రామానికి తిరిగిరాక

శ్రీరామ్ మరి రెండు రోజులు కాశీలోని ఇతర క్షేత్రాలను దర్శించారు. ఆ తర్వాత సారనాథ్ మీదగా ఆవల్‌ఖేడా తిరిగివచ్చారు. అనుకున్న సమయానికి ముందే ఆయన రావడం చూచి, తాఈజీ చకితులు అయినారు. మూడు వారాల తర్వాత తన కుమారుణ్ణి చూచి, ఆమె ఆనందంతో పులకించిపోయారు. అతడి తలమీద చేయి ఉంచారు. వీపును, చేతులను తట్టారు. ఇలా అన్నారు - "ఇన్నాళ్లూ భోజనం చేయలేదా? ఎంత చిక్కిపోయావు?" కొద్ది రోజుల తర్వాత తన కుమారుణ్ణి చూచిన తల్లికి కుమారుడు చిక్కిపోయినట్లు కనిపించడం మాతృవాత్సల్యపు విశేషం. అయితే, సహచరులు కూడ ఆ మాటే అన్నారు. అసలు శ్రీరామ్ శరీరం లావూ కాదు, సన్నమూ కాదు. ఆయన్ని చూచి సన్నంగా ఉన్నావనీ అనవచ్చు, పూర్వంకన్న బాగున్నావనీ అనవచ్చు. సహచరుల వ్యాఖ్యలలో చింతా ఉంది, ఆత్మీయతా ఉంది. స్వచ్ఛంద సేవకుల దళంలోని సహచరులు ఎవరు వచ్చినా, సాయంత్రం విప్లవ కార్యాలయానికి రావలసిందని శ్రీరామ్ వారిని కోరారు. ఒక్కొక్కరుగా సహచరులంతా వచ్చారు. రానివారికి ఇతర సహచరులు కబురు అందించారు. సాయంత్రం భవంతిలో ఉన్న కార్యాలయంలో అందరూ సమావేశమైనారు.

శ్రీరామ్ తన కాశీ యాత్ర గురించి వివరిస్తారని సహచరులు అనుకున్నారు. అలా జరగలేదు. సమావేశం ప్రారంభం కాగానే, ఆయన అక్కడ జరిగిన ఉద్యమ కార్యకలాపాల గురించి అడిగారు. యువ కార్యకర్తలు శ్రీరామ్ ఊళ్లో లేని సమయంలో కరపత్రాలు పంచారు, పోస్టర్లు అతికించారు. పరిసర గ్రామాలకు వెళ్లి ప్రజలను సంపర్కం చేశారు. నిరక్షరాస్యులకు అక్షర జ్ఞానం కలిగించారు. సంతకం పెట్టడం నేర్పారు. నివేదిక తీసుకున్న తర్వాత శ్రీరామ్ ఇలా చెప్పారు -

"ఈ నిర్మాణాత్మక కార్యక్రమాలతోపాటు ఆంగ్ల పాలకులకు విరుద్ధంగా కూడ చర్యలు జరపాలి. యువకులలో సంఘర్షించే సాహసం ఉన్నదని ప్రజలకు తెలిసే విధంగా కొన్ని కార్యక్రమాలు నిర్వహించాలి. యువకులు తమను తాము ఆహుతి చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని ప్రజలకు తెలియాలి. బలిదానానికి సంసిద్ధత చూచినప్పుడు ప్రజలలో ఉత్సాహం వస్తుంది. కార్యక్రమాలలో పాల్గొనడానికి వారుకూడ నడుం బిగిస్తారు."

## స్వరాజ్య ఉద్యమంలో భాగస్వామ్యం

ఆరోజుల్లో భగత్‌సింగ్ జరిపిన విప్లవ చర్యలపై తీవ్రంగా చర్చ జరిగేది. భగత్‌సింగ్ యువకులకు ఆదర్శం అయినాడు. సాండర్స్ వధ, అసెంబ్లీలో బాంబు విసరడం, ఆయుధాగారాన్ని లూటీ చేయడంవంటి సంఘటనలు యువకులలో ఉత్సాహాన్ని నింపాయి. మహాత్మా గాంధీ నాయకత్వంలో సాగుతున్న సహాయ నిరాకరణ ఉద్యమం ఈ కార్యకలాపాలకు దూరంగా ఉంది. అయినా, ఉద్యమకారులలో పలువురు ఇలాంటి కార్యక్రమాలను ఉధృతం చేయాలని భావించేవారు. ఆవల్‌ఖేడాలోని స్వచ్ఛందసేవకుల దళం రెండు విధాల కార్యక్రమాలలోనూ ఆసక్తి చూపసాగింది. ఆ దళం ఆయుధ ప్రయోగానికి దూరంగా ఉంది. అయితే - టెలిఫోన్ తీగెలు కత్తిరించడం, పోలీసులను వేధించడం, వారికి ధోకా ఇవ్వడం, అధికారులను మాయచేయడంవంటి

**అన్ని గుణాలకూ అలంకారం శీలం.**

పనులలో వారు తమ తెలివిని ప్రయోగించసాగారు.

దేశభక్తితో పొంగిపొరలే రచనలు చేసే పనిని శ్రీరామ్ ఉద్ధృతం చేశారు. ఆయన కవితలు 'సైనిక్' పత్రికలో ఎక్కువగా ప్రచురితం అయ్యేవి. ఆయన పేరుతోపాటు 'మత్త' అనే పదం జోడించబడింది. అది ఎందుకు జరిగిందో తెలిపే అద్భుత సంఘటన ఉంది. సందర్భం వచ్చినప్పుడు దాని వర్ణన జరుగుతుంది.

పట్టణాలలో ఆంగ్ల అధికారులు జరిపే అత్యాచారాలను గ్రామాలలో జాగీర్దార్లూ, ఠాకూర్‌లూ, సాహుకార్లూ జరిపేవారు. బానిసత్వం ఒక ప్రవృత్తిగా మారింది. దీనికి మూలం తెల్ల అధికారులే. వారినుండి జనం నేర్చుకునేవారు.

ఆవల్‌ఖేడాలో అవసరం ఉన్నవారికి వడ్డీకి అప్పు ఇచ్చేందుకై ఆగ్రా నుంచి ఒక సాహుకారు వచ్చేవాడు. అతని పేరు బిరదీచంద్. గ్రామంలోని కమలసింగ్ అనే రైతు అతడికి ఏజెంటుగా పని చేస్తున్నాడు. వడ్డీలమీద వడ్డీలు పెరిగిపోయి – వంద రూపాయలు అప్పు తీసుకున్నవాడు జీవితమంతా వడ్డీ కట్టవలసివచ్చేది. అసలు సొమ్ము అలాగే మిగిలిపోయేది. కొన్ని కుటుంబాల చిన్నపిల్లలు బిరదీచంద్ ఇంటిలో వెట్టిచాకిరీ చేసేవారు. వారికి తిండీ, బట్ట, పడుకోవడానికి బల్ల మాత్రమే ఇచ్చేవారు. ఒకే గదిలో పలువురిని ఉంచేవారు. ఈ పిల్లలలో పలువురు పొలంలోనే రాత్రింబవళ్లు శ్రమించేవారు. నాగలి (హల్)తోనే జీవితమంతా గడపడంవల్ల వీరిని 'హాలీలు' అనికూడ పిలిచేవారు. ఆవల్‌ఖేడా పరిసరాలలో ఇలాంటి వెట్టిచాకిరీ చేసే చిన్నపిల్లలు ఆరుగురు ఉన్నారు.

స్వచ్ఛందసేవకుల దళం విప్లవ పథకాన్ని తయారుచేస్తూ ఉండగా – వారి దృష్టి ఈ వెట్టిచాకిరీ పిల్లలమీద పడింది. సమావేశం జరిగింది. ఈ పిల్లలను విడిపిస్తే, దేశీయ పెత్తందార్లకు మంచి గుణపాఠం నేర్పినట్లు అవుతుందనే సూచన వచ్చింది. విముక్తి పథకం తయారయింది. ఆ పిల్లలలో నలుగురు పొలాలలో ఉంటారు, ఇద్దరు సాహుకారు ఇంటిలో ఉంటారు. పొలంలో పనిచేసే పిల్లలు రెండు వేర్వేరు పొలాలలో ఉన్నారు. నత్థూ, వృందావన్, గోపీనాథ్, రామ్‌సరన్ అనే నలుగురు స్వచ్ఛందసేవకులకు ఈ విముక్తి పని అప్పగించబడింది. ఈ నలుగురూ పలుమారులు ఆ పొలాలచుట్టూ తిరిగారు. వివిధ సమయాలలో వీరిలో వేర్వేరు యువకులు పొలాల లోపలికి వెళ్లారు. ఆ పిల్లలతో పరిచయం ఏర్పరచుకున్నారు. అక్కడనుండి బయటపడాలనే కోరిక ఆ పిల్లలకు ఉందో లేదో తరచి చూశారు. వారికి బయటపడాలనే ఉంది. అయితే, తాము నిస్సహాయులమని వారు వాపోయారు. ఈ నలుగురూ జరిగిన పని నివేదికను శ్రీరామ్‌కు అందజేశారు. వారిని విడుదల చేయడానికి అది సరిపోతుందని చర్చించిన మీదట నిర్ణయం తీసుకున్నారు. వారిలో ఆ కోరిక ఉంటే, ఇతర ఏర్పాట్లు చేయడం ఏమంత పెద్ద విషయం కాదని వారు తీర్మానించారు.

## వెట్టిచాకిరీనుండి పిల్లల విముక్తి

పథకం తొలిదశలో ఒక ఉత్తరం తయారుచేయబడింది. భగత్ సింగ్ బ్రిగేడ్ తరఫున ఈ ఉత్తరం వ్రాశారు. వెట్టిచాకిరీ పిల్లలను మూడు రోజులలో విడుదల చేయమని ఆ ఉత్తరంలో సేఠ్ బిరదీచంద్‌ను కోరారు. ఇది హెచ్చరిక. విడుదుల చేయకపోతే, తర్వాతి చర్య తీసుకుంటామని వ్రాశారు. మూడు రోజుల తర్వాత – 'ఇవాళ రాత్రి పిల్లలను విడుదుల చేస్తాం' అని లేఖ వ్రాశారు. రెండు రోజుల తర్వాత మొదటి లేఖ సాహుకారుకు అందింది.

ఆరోజు రాత్రి నత్థూ, రామ సరన్‌లు ఒక పొలానికీ, వృందావన్, గోపీలు మరో పొలానికీ వెళ్లారు. విడిపించడంలో వారికి ఎక్కడా ఆటంకం రాలేదు. ఆ పిల్లలను ఎవరైనా విడిపిస్తారని సాహుకారుకు అసలు అనుమానమే కలగలేదు. నత్థూ భగత్‌సింగ్ బ్రిగేడ్ తరఫున మరో లేఖ వ్రాశాడు. ఈ పిల్లలు భగత్‌సింగ్ బ్రిగేడ్‌లో చేరారనీ, వారు స్వేచ్ఛ పొందారనీ, ఇకముందు వారు స్వరాజ్యం కోసం పోరాడతారనీ, వారి కుటుంబాలను వేధించవద్దనీ, వేధిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయనీ ఆ లేఖలో వ్రాశాడు. మరునాడు ఉదయం పిల్లల నివాసంలో ఒక రాతి క్రింద ఉన్న ఈ లేఖను కమల్‌సింగ్ చదివాడు. ఆ లేఖ తీసుకుని సేఠ్ వద్దకు పరుగెత్తాడు. ఏం ప్రయోజనం! వెట్టి చాకిరీ పిల్లలు విముక్తి పొందారు.

★★★

**నిలకడలేని కొలనులో ప్రతిబింబం కనపడదు. నిలకడలేని మనసులో శాంతి నిలబడదు.**

గురుదేవుల అమృతలేఖిని

# సమస్యలకు మూలం శ్రద్ధా సంక్షోభం

గ్రహ నక్షత్రాల గమనం, విధి విధానం, ప్రకృతిలోని పరిస్థితులు వ్యతిరేకంగా ఉండడంవల్ల కష్టాలూ, ఆపదలూ వస్తాయని అదృష్టవాదులు నమ్ముతారు. ప్రకృతి ప్రతికూలంగా ఉండడంవల్ల కష్టాలూ, ఆపదలూ వస్తాయని గ్రహ నక్షత్రాల గమనాన్నీ, విధి విధానాన్నీ నమ్మనివారుకూడ చెపుతారు. సౌకర్యాలు పెరిగితే, అందుకై వీరు ప్రకృతికి ధన్యవాదాలు చెపుతారు. అలా జరుగుతుంది కూడా. అయితే అవన్నీ మినహాయింపులు మాత్రమే. ఎందుకంటే – మనిషిలోని విలక్షణమైన బుద్ధి ప్రకృతిలోని ప్రతికూల పరిస్థితులనుండి తప్పించుకోవడానికీ, అనుకూల పరిస్థితులను నిర్మాణం చేయడానికీ మార్గాలను కనుగొంటుంది.

ప్రకృతిలోని మార్పులు ప్రాణులను ప్రభావితం చేస్తాయి; అనుకూల, వ్యతిరేక పరిస్థితులలో అవి నివసించేటట్లు చేస్తాయి. అయితే, ఈ నియమం మామూలు ప్రాణులకు మాత్రమే వర్తిస్తుంది. ప్రకృతి యొక్క ప్రభావంనుండి తప్పించుకునే సామర్థ్యం మనిషి బుద్ధికి ఉంది. మనిషి ప్రకృతిమీద పూర్తిగా ఆధిపత్యం స్థాపించలేకపోవచ్చు. అయినా, పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చుకోవడంలో అతడు పూర్తిగా సఫలం అవుతాడు. ముందు ముందు ఈ సాఫల్యం స్థాయి, మోతాదు పెరుగుతూ ఉంటుందని మనం ఆశించవచ్చు.

## ఆలోచన, ప్రయత్నాల ప్రభావం

మంచి, చెడు పరిస్థితులకు ప్రకృతి బాధ్యురాలు కాకపోతే, ఈ హెచ్చు తగ్గులకు కారణం ఏమిటి – అనే ప్రశ్న వస్తుంది. దీనికి సమాధానం ఒక్కటే : మనిషి ఆలోచన, అతడి కృషి. ప్రకృతిని తనకు అనుకూలంగా మార్చుకునే శక్తి మనిషికి ప్రమాదాలనుకూడ తెచ్చిపెట్టవచ్చు. ప్రకృతి ఒక పరిమితి మేరకే ప్రతికూలతలను సృష్టిస్తుంది. అయితే, మనిషి దానికి ఓడిపోడని ఆదికాలంనుండి నేటివరకు జరిగిన ప్రగతి చరిత్ర చెపుతోంది. అతడు ప్రకృతిమీద విజయం సాధించలేకపోవచ్చు. కానీ, ఏర్పడిన పరిస్థితులతో సమన్వయాన్ని సాధించి తనను తాను తప్పక రక్షించుకుంటాడు.

ప్రకృతి యొక్క ప్రతికూలత, కాలమహిమ, కలియుగ ప్రభావం, అదృష్టం మున్నగు కారణాలను చూపి, మనిషి తన మనస్సును సరిపెట్టుకోవచ్చు. కానీ, అందువల్ల సంతృప్తి కలుగదు. రాజకీయాలు, మతం, దర్శనం, ధన శక్తి మున్నగు వాటిని ప్రస్తుత పరిస్థితులకు కారణాలుగా చెప్పుకోవచ్చు. అయితే, జనమానసం ఈ విషయంలో నిర్దోషి అని చెప్పలేము. ఒక స్థలంలో ఒక మహాపురుషుడు ఉద్భవిస్తాడు. అతడు ఆకాశంనుండి ఊడిపడడు. ఆ సమాజంలోనే అతడు జన్మిస్తాడు. ఆ సమాజం స్థాయియే, జనమానసం స్థాయియే ప్రతిభావంతులను ఉత్పన్నం చేస్తుంది, వారికి మార్గం చూపుతుంది.

## ప్రగతికి ఆధారం మనఃస్థితి

వ్యక్తి తనకు తాను పరిపూర్ణుడు. అతడిలో ఎన్నెన్నో సామర్థ్యాలు బీజరూపంలో ఉన్నాయి. అవి వెలికివచ్చినప్పుడు, వ్యక్తిత్వానికి ఒక స్థాయి ఏర్పడుతుంది. ఆ వ్యక్తిత్వం ఆధారంగా వ్యక్తి ప్రతిభ అద్భుతాలు చూపుతుంది. శిఖరాగ్ర స్థాయి ప్రతిభలు వెలికిరావడం, పురుషార్థం ద్వారా, కార్యశూరతద్వారా వాటికి ఒక దిశ ఏర్పడడం అనే ప్రక్రియ వెనుక ఉన్న మూల సూత్రం ఇదే. పరిస్థితులను కాని, వ్యక్తులను కాని ఇందుకు దోషులుగా, సాధకులుగా చెప్పవచ్చు. కానీ వాస్తవానికి వ్యక్తి యొక్క ఆంతరిక స్థితియే అతడి ప్రగతి, తిరోగమనాలకు బాధ్యురాలు.

నేటి యుగపు విషమ పరిస్థితులను మార్చవలసిన అవసరాన్ని గుర్తించిన వ్యక్తులు ఈ మూల కారణం వరకు లోతుకు పోవాలి. లేకపోతే – ఎండిపోయిన చెట్టును తిరిగి చిగురింపజేయడానికి దాని ఆకులను తడిపి వ్రేళ్లను ఉపేక్షించే పొరపాటు జరుగుతూ ఉంటుంది. అలాంటి చర్యవల్ల శ్రమ,

**కసురుతూ మాట్లాడకు. విసుగుతో పనిచేయకు.**

అలసట పెరుగుతూ ఉన్నా - మౌలిక లక్ష్యం పూర్తి కాదు.

వ్యక్తి చేసే కర్మలే పరిస్థితికి కారణాలని ప్రత్యక్షాన్ని మాత్రమే పరిగణించేవారు భావిస్తారు. అయితే - శరీరం జడ పదార్థాలతో తయారైనది. అది ఉపకరణం మాత్రమే. దానిలో క్రియాశీలత ఉంది కాని, ఏది చేయాలి ఏది చేయకూడదు అనే వివేకం లేదు. మనస్సు ఇచ్చే ఆజ్ఞలను పాటించే సేవకుడు శరీరం. మంచి, చెడు అలవాట్లు శరీరపు అభ్యాసంతో ముడిపడినట్లు కనిపిస్తుంది. కానీ, వాస్తవం ఏమంటే - గుణ, కర్మ, స్వభావాల వ్యవస్థ అంతా మనస్సులో ఉంటుంది. శరీరం ఆ వ్యవస్థకు కీలు బొమ్మ మాత్రమే.

## మనస్సుకు ఎగువన అంతఃకరణ

వ్యక్తిత్వం యొక్క కేంద్ర బిందువు మనస్సుకుకూడ అతీతమైనది. శ్రద్ధకు కేంద్రమైన అంతఃకరణ ఆ బిందువు. అంతఃకరణలోనుండి భావ సంవేదనలు వెలికివస్తాయి. అభిరుచి, ఇచ్ఛలు అంతఃకరణలోనే నిర్మాణం అవుతాయి. ప్రజ్ఞ మానసిక స్థాయికి అతీతమైనది. ఆలోచనలూ, పనులూ పరిస్థితులకు ఒక పరిమితివరకే బాధ్యులు. అంతఃకరణయొక్క స్థాయియే ఆలోచనల సమూహంనుండి తనకు అనుకూలమైన ఆలోచనను స్వీకరిస్తుంది. దానివల్ల ఆంతరిక తరంగాలు ఎగసిపడతాయి. ఆలోచన, క్రియాశీలత శరీరంయొక్క దశను ప్రభావితం చేస్తాయి. శ్రద్ధలకూ, ఆకాంక్షలకూ ఉత్పత్తి కేంద్రమైన అంతఃకరణ ఇచ్చే నిర్దేశాల ప్రకారమే వ్యక్తి ఆలోచిస్తాడు, పని చేస్తాడు.

సాధారణంగా - పరిస్థితులు అందరికీ ఒకేవిధంగా ఉంటాయి. సాధనాలూ సౌకర్యాల అవకాశం, వారసత్వం అందేది కొద్దిమందికి మాత్రమే. స్థూలంగా - మనిషి సంపాదన అతడి ఆంతరిక అభిరుచికి అనుగుణంగా ఉంటుంది. ఈ అభిరుచి సూదంటురాయిలా తనకు అనుగుణమైన సాధనాలనూ, ఆలోచనలనూ, వ్యక్తులనూ ఆకర్షిస్తుంది. ఈ అభిరుచియే వ్యక్తిత్వానికి నిజమైన పెట్టుబడి, నిజమైన తాళపుచెవి.

## శ్రద్ధకు అనుగుణంగా వ్యక్తిత్వం

మనిషి ఎలా ఆలోచిస్తే అలా చేస్తాడని చెపుతూ ఉంటారు. కానీ వాస్తవం ఏమంటే - తన ఆకాంక్షల స్థాయికి తగిన ఆలోచనలను మనిషి వినవలసివస్తుంది, స్వీకరించవలసివస్తుంది. మనస్సులో జమ అయిన ఆలోచనలు శరీరాన్ని తమ ఇష్టం వచ్చినట్లు యంత్రంలా పనిచేయిస్తాయి, పనిముట్లనువలె త్రిప్పుతాయి. **శ్రద్ధామయోయం పురుషో యో యచ్ఛ్రద్ధః స ఏవ సః** - అని కృష్ణ పరమాత్మ గీతలో (17/3) చెప్పాడు. అనగా - వ్యక్తిత్వం శ్రద్ధయొక్క ఫలితం. వ్యక్తి యొక్క శ్రద్ధ ఎలా ఉంటే అతడి స్థాయి అలా ఉంటుంది.

## ఆకాంక్షలకు సేవకులు శరీరం, మనస్సు

స్థూలంగా - మనుషుల ఆకారం, వ్యవహారం దాదాపు ఒకేవిధంగా ఉంటాయి. వాటిలో కొద్ది తేడాలు ఉంటాయి. మనుషుల ఆహార విహారాలు ఒకేవిధంగా ఉంటాయి. తినడం, త్రాగడం, నిద్రించడం, మేలుకోవడం, పనిచేయడం, అవకాశాలనుండి ప్రయోజనాన్ని పొందడం - వీటికి అందరూ ఇష్టపడతారు. ఋతువుల ప్రభావం, కాల మహిమ అందరినీ ఒకేలా ప్రభావితం చేస్తాయి. మనస్వి అయిన ప్రతి వ్యక్తికీ కొద్ది తేడాతో ప్రగతికి అవకాశాలు అందుతాయి.

ఇలాంటి స్థితిలో - ఒకడు వెనుకబడినతనంలో కూరుకుపోతాడు; ఒకడు ఏదో విధంగా రోజులు వెళ్లదీస్తూ ఉంటాడు; ఒకడు ప్రగతి సాధిస్తాడు; ఒకడు మహామానవుని స్థాయిని పొందుతాడు. ఇది ఆశ్చర్యం కలిగించే అంశం.

ఇలా ఆకాశానికీ, పాతాళానికీ ఉన్నంత తేడా కలగడానికి కారణాలు అంతఃకరణలో ఉన్న శ్రద్ధలూ, ఆకాంక్షలూ మాత్రమే. అవే జీవన ప్రవాహపు దిశను నిర్ణయిస్తాయి.

ఎలాంటి సాధనాలను అన్వేషించాలి? ఏ వ్యక్తులతో సంపర్కం ఏర్పరచుకోవాలి? ఏ పరిసరాలలో నివసించాలి? ఎలాంటి వాతావరణాన్ని ఎన్నుకోవాలి? ఇలాంటి అంశాలపై తుదినిర్ణయాన్ని బయటి వ్యక్తులు తీసుకోలేరు. సలహాలవల్ల, మిత్రులవల్ల, వాతావరణంవల్ల ఈ నిర్ణయాలు జరుగుతున్నట్లు కనబడుతుంది. కానీ వాస్తవానికి - మనిషి అంతఃకరణలో ఉండే

**కోరికలు తీర్చుకునేందుకు దైవాన్ని కొలిచే భక్తి భక్తి కాదు.**

"స్వ" ఈ నిర్ణయాలు తీసుకుంటుంది. మనస్సు, శరీరం స్వామిభక్తులైన సేవకులవలె అంతఃకరణలోని ఆకాంక్షలను పూర్తిచేయడానికై సమాయత్తం అవుతాయి.

ఒకే పరిస్థితులలో జన్మించి, పెరిగిన ఇద్దరు వ్యక్తులకు ఒకేవిధమైన అవకాశం అందినప్పటికీ - వారు వేర్వేరు దిశలలో ప్రయాణిస్తారు. వారు సాధించే ఫలితాలలో ఆకాశానికీ, పాతాళానికీ ఉన్నంత తేడా ఉంటుంది. ఈ తేడాకు కారణం ఆ వ్యక్తులలోని శ్రద్ధలో తేడా. ఆ శ్రద్ధయే వారిని ఆవిధంగా ఆలోచించేటట్లు, అర్థం చేసుకునేటట్లు, పని చేసేటట్లు చేస్తుంది.

అంతఃకరణయే వ్యక్తిత్వం. శ్రద్ధలూ, విశ్వాసాలే ఆలోచననూ, శీలాన్నీ నిర్ణయిస్తాయి.

ఎవరు ఎలా జీవించారు, ఎవరు ఎలాంటి పరిస్థితులలో జీవించవలసివస్తోంది - అనే విషయానికి కారణం వారి అంతఃకరణ యొక్క స్థాయి. అదృష్టం, భవిష్యత్తు అనేవి అంతఃకరణ యొక్క కేంద్ర బిందువులో వ్రాయబడి ఉంటాయి.

పరిస్థితులు కొందరిని మార్చవచ్చు. అయితే అది మినహాయింపు మాత్రమే, అపవాదం మాత్రమే. ఇంత పెద్ద ప్రపంచంలో ఒకోసారి పొందికలేని సమన్వయంలేని సంఘటనలు జరగడం విచిత్రం ఏమీ కాదు. పలు సందర్భాలలో అర్హతలేని వ్యక్తులకు ఉన్నత స్థితి అందుతుంది. అర్హత కలిగిన వ్యక్తులు కొంత కాలం నిమ్న స్థితిలో ఉండిపోవలసివస్తుంది. అయితే ఇది నియమం కాదు, నియమానికి మినహాయింపు మాత్రమే. ఈ మినహాయింపు హెచ్చు సమయం నిలచి ఉండదు.

## సమస్యలకు కారణం ఆదర్శవాద లోపం

ప్రాచీన కాలానికీ, వర్తమాన కాలానికీ మధ్య ఎన్నో తేడాలు కనిపిస్తాయి. వీటికి కారణం పరిస్థితి కాదు, మనః స్థితి. నేడు సౌకర్యాలూ, సాధనాలు బాగా పెరిగాయి. విద్య, సంపద, వైద్యం, శిల్పకళ, పరిశ్రమలు, శాస్త్రవిజ్ఞానం మున్నగు రంగాలలో నేటి ప్రజలు పూర్వపు ప్రజల కన్న మెరుగుగా ఉన్నారు. అయితే - ఆరోగ్యం, సంతులనం, స్నేహం, సౌజన్యం, సహకారం, సద్భావన మున్నగు విషయాలలో నలువైపులా భయంకరమైన బీభత్సం వ్యాపించి ఉంది. నిజానికి నేటి ప్రజలు మరింత సంస్కారులుగా, మరింత సమృద్ధులుగా ఉండవలసింది, మరింత ప్రసన్నులుగా ఉండవలసింది, కనబడవలసింది. కానీ, వాస్తవం ఇందుకు విరుద్ధంగా ఉంది. సృజనకూ, సహకారానికీ వినియోగపడవలసిన శక్తి సామర్థ్యాలు, ప్రపంచంలో స్వర్గమయ వాతావరణాన్ని నిర్మించగలిగే శక్తి సామర్థ్యాలు పరస్పర సంహారానికి వినియోగపడుతున్నాయి. దీనికి కారణం ఏమిటి? ఆదర్శవాదంతో కూడిన శ్రద్ధా విశ్వాసాలు పలాయనం కావడం, అంతఃకరణ స్థాయి దిగజారిపోవడం. ఫలితంగా వ్యక్తినీ, సమాజాన్నీ రకరకాల సమస్యలూ, ప్రమాదాలూ, సంక్షోభాలూ పట్టిపీడిస్తున్నాయి.

ప్రాచీన కాలంలో ప్రజలు కొద్దిపాటి సాధనాలతో బ్రతుకు దెరువు సాగించేవారు. అయినా హాయిగా జీవించేవారు. ఎందుకంటే - ఉదాత్త ఆశయాలను సాధించడానికి ఈ జీవితం లభించిందనే విశ్వాసం ప్రజలలో ఉండేది. కనీస అవసరాలకు సరిపడే సాధనాలను సమకూర్చుకున్న తర్వాత తమ శక్తి సామర్థ్యాలను ఉన్నత ఆశయాల కోసం వినియోగించాలని ప్రజలు భావించేవారు. ఆదర్శవాదంతో కూడిన జీవన విధానాన్ని అనుసరించడం తమకు గౌరవమనీ, గర్వకారణమనీ అనుభూతి పొందేవారు. పరమార్థ పరాయణత్వంలోనే ప్రసన్నత ఉండేది. ఈ సిద్ధాంతాలు జీవితాలలో అక్షరాలా అమలుజరగడంవల్ల మన పూర్వులు కొరతలలో సైతం మహానందం పొందేవారు. అంతే కాదు. ప్రపంచమంతటికీ నిరంతరంగా జ్ఞాన విజ్ఞానాలను అందిస్తూవచ్చారు. దేవమానవులని పిలువబడే అదృష్టాన్ని పొందారు.

## శ్రద్ధా విశ్వాసాల సంక్షోభం

నేడు సాధనాలూ, సౌకర్యాలూ బాగా పెరిగాయి. కాని శ్రద్ధా విశ్వాసాల స్థాయి బాగా దిగజారిపోయింది. శ్రద్ధా సంక్షోభమే ఈ యుగపు మౌలిక సమస్య. ఈనాడు శ్రద్ధా విశ్వాసాల కరవు ఏర్పడింది. కానీ సమస్యలు ఆర్థికమైనవిగా,

**గర్వానికి మూలం తెలివితక్కువతనం.**

సామాజికమైనవిగా, రాజకీయమైనవిగా కనబడుతున్నాయి. ఈ రంగాలలో సంఘర్షణలూ, ఉద్యమాలూ సాగుతున్నాయి. ఆరోగ్యం దెబ్బతినటానికి కారణం సంయమనం లోపించడం కాదనీ, విషాణువుల ఆక్రమణ అనీ జనం భావిస్తున్నారు. మానసిక రోగాలకు కారణం నీచమైన ఆలోచనా ధోరణి కాదనీ, విచ్చలవిడితనంపై నిరోధం అనీ జనం భావిస్తున్నారు. ఆర్థిక సమస్యలకు కారణాలు శ్రమించే గుణం లోపించడం, దుబారా ఖర్చు కావనీ, పెట్టుబడి పంపిణీలో అసమానత అనీ చెపుతున్నారు. దురదృష్టకర పరిస్థితి ఇది.

ఆస్తికత, ఆధ్యాత్మికతల సిద్ధాంతాన్ని హృదయపు లోతులలో స్థిరపరిస్తే, నేరాలను నివారించవచ్చు. కానీ, మనం ఈ సత్యాన్ని ఉపేక్షిస్తున్నాం. పోలీస్ స్టేషన్‌లూ, న్యాయస్థానాలూ ఆ పని చేస్తాయని భావిస్తున్నాం. రాజ్య వ్యవస్థలో సంస్కరణలు అద్భుతాలను సాధిస్తాయని నమ్ముతున్నాం. ఆ వ్యవస్థపై ఆధిపత్యాన్ని సాధించడంకోసం గొప్పతనాన్ని కోరుకునే వ్యక్తులు ప్రాకులాడుతున్నారు. మత వ్యవస్థను సంస్కరించి, దాని సహాయంతో శ్రద్ధా విశ్వాసాల సంక్షోభాన్ని అంతంచేసి, ప్రస్తుత సమస్యలను నివారించవచ్చుననీ, పరిష్కరించవచ్చుననీ ఎవ్వరూ ఆలోచించడం లేదు.

నేడు ప్రచారంలో ఉన్న ప్రయత్నాలన్నీ లోతులేనివి, పైపూతలు. రక్తంలోని విషాన్ని నిర్మూలించనంతవరకు కురుపులు నయం కావు. ఆ కురుపులమీద పట్టీలు వేయడం, మందులు పూయడం సుదీర్ఘమైన పని. వాటి ఫలితం అనుమానాస్పదమే. అయినా, ఈ పైపూతలకే భారీ ప్రచారం జరుగుతోంది. మూలాన్ని కనుగొనకుండా, పైపై చర్యలు ఎన్ని రోజులు జరిపినా, ఫలితం సందిగ్ధమే. నేటి యుగం ఎదుర్కొంటున్న సమస్యలకూ, ప్రమాదాలకూ, సంక్షోభాలకూ ఒకేఒక కారణం మనిషి అంతఃకరణలో ఉండే ఆకాంక్షలూ, శ్రద్ధా విశ్వాసాలూ పూర్తిగా దిగజారిపోవడమే. ఈ సత్యాన్ని లక్షసార్లు బోధించవలసి ఉంది.

కుళ్లిన చెత్తలో, మురుగు నీటిలో ఈగలూ, క్రిమి కీటకాలూ, విషాణువులూ, దుర్గంధం నిండి వెలికివస్తాయి. ఆ చెత్తనూ, ఆ నీటినీ శుభ్రపరచడం ద్వారా వాటిని పారద్రోలగలుగుతాము. శ్రద్ధా విశ్వాసాలలో వేరూని తిష్టవేసిన నికృష్టతను తొలగించకపోతే, అంతఃకరణలోని ఉత్కృష్టతయొక్క స్థాయిని పెంచకపోతే – సంస్కరణకూ, పరివర్తనకూ చేసే ప్రయత్నాలన్నీ, ఇసుకనుండి నూనె తీసే ప్రయత్నాలవలె, నిష్ఫలం అవుతూ ఉంటాయి; ఉజ్వల భవిష్యత్తు పగటి కలగా, గాలి మేడగా మిగిలిపోతుంది.

## విశ్వాస నిర్మాణమే యుగ నిర్మాణం

బాహ్యమైన చికిత్సలను పూర్తిగా నిషేధించవలసిన అవసరం లేదు. అవి జరుగుతాయి, జరుగుతూ ఉండాలి. అయితే, ఆంతరిక చికిత్సయొక్క గొప్పతనాన్ని కూడ గుర్తించాలి. **అంతఃకరణలో నిల్వ ఉన్న శ్రద్ధా విశ్వాసాలలో ఉత్కృష్టతను తిరిగి స్థాపించడమే యుగ నిర్మాణానికి అసలు అర్థం.** వ్యక్తిగత, సామాజిక సమస్యల పరిష్కారానికి మార్గం ఇదే. ఎందుకంటే – అంతఃకరణలోనే చిక్కుముడులు ఏర్పడతాయి, వికృతులు తలెత్తుతాయి. ఆహార సంక్షోభం, ఇంధన సక్షోభం, ఆరోగ్య సంక్షోభం, భద్రతా సంక్షోభముల రంగాలను, ప్రభావాలను గుర్తించిన విధంగా – శ్రద్ధా విశ్వాసాల రంగాలను, ప్రభావాలను గుర్తించాలి. ఈ సంక్షోభాలన్నింటికన్న శ్రద్ధా విశ్వాసాల సంక్షోభం మరింత గంభీరమైనది.

సంస్కరణకు, అభివృద్ధికీ ఇతర ప్రయత్నాలు కూడ జరుగుతూ ఉండాలి. అయితే, సమష్టి యొక్క అంతఃకరణలో ఉత్కృష్టతపట్ల శ్రద్ధా విశ్వాసాలను నాటడం, పోషించడం యుద్ధస్థాయి ఆవేశంతో జరిగినప్పుడే శాశ్వత పరిష్కారం లభిస్తుంది. సమస్య ఇదొక్కటే. పరిష్కారం ఇదొక్కటే.

## దిగివస్తోంది ప్రజ్ఞావతారం

మనిషి దీన్ని అర్థం చేసుకోలేకపోవచ్చు. కానీ, మహాకాలునికి వాస్తవం తెలుసు. జనమానసంలో శ్రద్ధా విశ్వాసాల పునర్నిర్మాణం కోసం, అవిశ్వాసాన్ని విశ్వాసంగా మార్చడం కోసం ప్రజ్ఞావతారం దిగివస్తోంది.

★★★

**చదరంగంలో వలె – జీవితంలో ముందుచూపు ముఖ్యం.**

విశిష్ట వార్త

# మహత్తర సాఫల్యాన్ని సాధించిన మదురై అశ్వమేధం

తమిళనాడులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మదురైలో 2005 డిసెంబరు 29,30,31, 2006 జనవరి 1లలో 21వ అశ్వమేధ మహాయజ్ఞం అత్యంత వైభవంగా జరిగింది. ఆ దృశ్యం పుష్కర దృశ్యాలను గుర్తుచేసింది. ఎటు చూచినా పసుపు బట్టలు ధరించిన వ్యక్తులే కానవచ్చారు. సంస్కార టివి చానల్ యజ్ఞాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసింది. ఈ ప్రసారంవల్ల లక్షలాది గృహాలలోనికి మదురై అశ్వమేధ చేతన ప్రవేశించింది.

## ప్రగతిశీలమైన మలుపు

2002లో తిరుపతిలో అశ్వమేధం జరిగింది. మూడు సంవత్సరాల తర్వాత జరిగిన మదురై అశ్వమేధం అద్భుత విజయాన్ని సాధించింది. సుమారు అయిదు లక్షల మంది అశ్వమేధంలో పాల్గొన్నారు. వీరిలో హెచ్చుమంది తమిళులు, మలయాళీలు, తెలుగువారు, కన్నడిగులు. మదురైకి 300 కిలోమీటర్ల పరిధిలో ఉన్న స్థలాలనుండి చాలామంది వచ్చారు. డబ్బు కట్టకుండా ఇంత భవ్యమైన యజ్ఞంలో పాల్గొనగలగడం, యజ్ఞంలో అన్ని వర్గాల స్త్రీ పురుషులూ పాల్గొనగలగడం అందరికీ ఆశ్చర్యాన్నీ, ఆనందాన్నీ కలిగించాయి. దక్షిణ భారతంలోని ఈ భాగంలో మతానికీ, కర్మకాండకూ ప్రాధాన్యం హెచ్చు. ఈ యజ్ఞం ఫలితంగా మూఢ నమ్మకాలు తొలగి, ప్రగతిశీలమైన మలుపు వచ్చింది. యజ్ఞస్థలం శ్రీ జి.నాగరాజన్‌గారి రాజా ఇంజనీరింగ్ కాలేజి. ఇది నగరానికి సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. అయినా ప్రజలు తండోపతండాలుగా యజ్ఞానికి వస్తూనే ఉన్నారు. సౌరాష్ట్ర సమాజ్ ప్రముఖులు శ్రీరామమూర్తిగారు క్రియాశీలమైన సహకారం అందించారు.

## గంగా - కావేరి సంగమం

ఉత్తర భారతం నుండి సుమారు పదివేలమంది పరిజనులు యజ్ఞ సన్నాహాల కోసం, నిర్వహణ కోసం వచ్చారు. వీరుకాక యజ్ఞంలో పాల్గొనడానికి ఉత్తర భారతం నుండి చాలామంది వచ్చారు. కోయంబత్తూరు, తిరువనంతపురం, తిరునల్వేలి, టూటికొరిన్, తిరుచేరిపల్లి, ఈరోడ్, తిరుపూర్, బెంగుళూరు, మైసూరు, పాల్‌ఘాట్, సేలం, చెన్నై మున్నగు స్థలాలనుండి అధిక సంఖ్యలో వచ్చిన ప్రజలు యజ్ఞంలో పాల్గొన్నారు.

## గాయత్రీ స్వాముల ప్రదక్షిణం

భాషలు వేరయినా, ఎక్కడా ఎలాంటి ఇబ్బందీ కలుగలేదు. పసుపు బట్టలు కట్టుకున్న గాయత్రీ స్వాములను గురించిన చర్చ దక్షిణ భారతం అంతటా వ్యాపించింది. గాయత్రీ స్వాములులతో, అంటే గాయత్రీ పరివార్ కార్యకర్తలతో మీనాక్షి ఆలయానికి ప్రదక్షిణం చేస్తూన్న భవ్యకలశ యాత్ర ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నది.

## ఏడువేలమందికి మంత్రదీక్ష

శాస్త్రోక్తంగా జరిగిన యజ్ఞ కార్యక్రమాలను చూచిన ప్రజల ముఖాలలో ఆనంద రేఖలు కానవచ్చాయి. ప్రతివ్యక్తీ యజ్ఞంలో పాల్గొన్నాడు. ఏడువేల మంది కొత్త సాధకులు మంత్రదీక్ష తీసుకున్నారు. అశ్వమేధపు కర్మకాండ అందరినీ మంత్రముగ్ధులను చేసింది. హిందీతోపాటు తమిళంలోకూడ యజ్ఞ వివరాలను అందిస్తూవచ్చారు. శ్రీ కె.ఎమ్.మోహన్ చేసిన చక్కని అనువాదం ప్రజలను ఆకర్షించింది.

## జేసుదాసు గానం

యజ్ఞ స్థలంలో ఏర్పాటు చేయబడిన చిత్ర ప్రదర్శనం ప్రజలను ఎంతగానో ప్రభావితం చేసింది. సుప్రసిద్ధ గాయకుడు జేసుదాస్ గానం వాతావరణాన్ని భక్తిరసంతో ముంచెత్తింది.

గురుసత్తా పరోక్ష సంచాలనవల్ల అశ్వమేధం దిగ్విజయాన్ని సాధించింది. అయితే, సంవత్సరం నుండి ఆ విజయంకోసం శ్రమించిన గాయత్రీ పరివార్ పరిజనుల పాత్రకూడ గణనీయమైనది. ఆ శ్రమయే విజయానికి పునాది అయింది. వారు స్థానిక ప్రజలతో పెంచుకున్న పరిచయాలు యజ్ఞ సాఫల్యానికి దోహదం చేశాయి.

## 2008లో కర్ణాటకలో అశ్వమేధం

2008లో కర్ణాటక రాష్ట్రంలో ఇలాంటి అశ్వమేధ యజ్ఞం జరుగుతుందని మదురై యజ్ఞంలో ప్రకటించారు.

జాతిని అఖండంగా, సంస్కారవంతంగా రూపొందించడంలో ఈ అశ్వమేధం మహత్తర సాఫల్యాన్ని సాధించిందన్నది నిశ్చయం.

★★★

**తరగని మూలధనం మంచితనం.**

## వార్తలు

# చోడవరంలో పంచకుండీయ గాయత్రీ యజ్ఞం

విశాఖపట్టణం జిల్లా చోడవరంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం ఆవరణలో జనవరి 31న పంచకుండీయ గాయత్రీ యజ్ఞం జరిగింది. 60 మంది దంపతులు పాల్గొన్నారు. శ్రీమతి రూపవాణి, శ్రీయుతులు పుష్యమిత్ర, గుప్తాజీ యజ్ఞాన్ని నిర్వహించారు.

జనవరి 22న విశాఖ న్యూకాలనీ సేవానగర్‌లోనూ కాంచికాలయంవద్ద త్రికుండీయ గాయత్రీ యజ్ఞం జరిగింది. జనవరి 10న విశాఖలోని రాంనగర్ బజార్‌వద్ద శ్రీగానుగుల ఎర్రాజీరావు గృహంలో గాయత్రీ యజ్ఞం జరిగింది. ఆ సందర్భంగా అయిదుగురు గురుదీక్ష స్వీకరించారు.

విశాఖ ప్రజ్ఞామండలి నిర్వహించిన ఏక కుండీయ గాయత్రీ హవనాలు :

జనవరి 9న అబిద్‌నగర్‌లో శ్రీ సంతు మురారికా గృహంలో, జనవరి 19న చెంగల్రావుపేటలో శ్రీ కె.నరసింగరావు 70వ జన్మదిన సందర్భంగా హవనంతోపాటు పుస్తకాల వితరణ, ఫిబ్రవరి 8న రాంనగర్‌లో శ్రీమతి అరుణ జన్మదిన సందర్భంగా, ఫిబ్రవరి 10న రాంనగర్ దగ్గర శ్రీమాతా వెంకటరావు గృహంలో, ఫిబ్రవరి 17న ఉక్కునగరం సెక్టరు 11లో శ్రీమతి ఎమ్.రాజ్యలక్ష్మి, శ్రీ ఎమ్.బాలనాగేశ్వరరావుల గృహంలో, 50మంది పాల్గొన్నారు. ఫిబ్రవరి 21న అల్లిపురంలో శ్రీవిద్యాసాగర్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా పుస్తక ప్రదర్శన, విక్రయం జరిగాయి.

### విజయనగరంలో సామూహిక సత్యనారాయణ వ్రతం

ఫిబ్రవరి భీష్మ ఏకాదశినాడు విజయనగరంలోని దాసన్నపేట శ్రీ జగన్నాథ స్వామి ఆలయంలో ఏకకుండీయ గాయత్రీ యజ్ఞం, సామూహిక సత్యనారాయణ వ్రతం జరిగాయి. 50 మంది దంపతులు పాల్గొన్నారు. శ్రీమతి దంతులూరి పద్మవతిరాజు ఆధ్వర్యం వహించారు. శ్రీయుతులు బొల్లాప్రగడ లక్ష్మీగణపతి, పి.వి.పండా కార్యక్రమాలను నిర్వహించారు. దంతులూరి సీతారామరాజు దంపతులు పూర్ణాహుతి నిర్వహించారు.

★★★

## చందదారులకు విజ్ఞప్తి

1. మనియార్డరుద్వారా తమ పత్రిక చందాలను పంపే చందాదారులలో కొందరు మనియార్డరు రసీదులలో తమ చిరునామాలను వ్రాయడం లేదు. చిరునామా తెలియకపోతే పత్రికను పంపడం సాధ్యపడదు కదా. కనుక ఆ రసీదులలో చిరునామాను తప్పకవ్రాయాలి.
2. పత్రిక చందాదారులుగా చేరేవారు తమ పూర్తి చిరునామా (రాష్ట్రం, జిల్లా, గ్రామం, పిన్‌కోడ్ నంబరు) వ్రాయాలి. పాత చందాదారులు తమకు వచ్చే పత్రిక కంప్యూటర్ నంబరును పేర్కొనాలి.
3. డిడిలు, చెక్కులు పంపేవారు "SRI VEDAMATA GAYATRI TURST, BUSINESS DIVISION" - అని వ్రాయాలి.
4. ఒక నెలలో పత్రిక అందకపోతే, ఆ నెల 15వ తేదీలోగా ఆ విషయం మాకు తెలియజేయాలి. అప్పుడు మరొక పత్రికను పంపగలుగుతాము.

- పత్రికా విభాగం

## ఏప్రిల్, మే నెలలలో పర్వదినాలు

**ఏప్రిల్ :**

4. రమణమహర్షి జయంతి
6. దయానంద జయంతి
6. శ్రీరామనవమి
7. సమర్థరామదాసు జయంతి
11. మహావీర జయంతి
13. హనుమజ్జయంతి
14. అంబేద్కర్ జయంతి
30. పరశురామ జయంతి

**ఏప్రిల్ :**

2. శంకర జయంతి
3. రామానుజాచార్య జయంతి
10. బసవేశ్వర జయంతి
11. నృసింహ జయంతి
13. బుద్ధ పూర్ణిమ
15. విద్యారణ్య స్వామి జయంతి

**అభినందించు. అసూయపడకు. అదృష్టవంతుడవుకా.**

# సద్గురు లీలామృతం

## వృద్ధురాలి దానానికి చలించిన గురుదేవులు

దైవకార్యం కోసం దిగివచ్చిన మహాపురుషులు భావపుంజములుగా ఉంటారు. వారి రాకతో - సజీవమైన భావనాశీలత ఉద్వేగభరితం కాకుండా ఉండదు, ఆకర్షితం కాకుండా ఉండదు.

శక్తిపీఠాల నిర్మాణం దాదాపు ప్రారంభమయింది. ప్రజా సహకారం పొంగిపొరలుతోంది.

ఆ రోజులలో ఒక వృద్ధురాలు గురుదేవుల వద్దకు వచ్చింది. తన వెండి కడియాలు రెండింటినీ ఊడదీసి గురుదేవులవద్ద ఉంచి ఇలా అన్నది -



"తమరు శక్తిపీఠాలను నిర్మిస్తున్నారని విన్నాను. నేను ఇచ్చే ఈ దానాన్ని కూడా స్వీకరించండి."

గురుదేవులు ఆమె గురించి వివరాలు అడిగారు. 10-15 రూపాయల కూరగాయలు కొని అమ్ముతాను - అని ఆమె చెప్పింది. అదే ఆమె బ్రతుకు దెరువు.

"నాకున్న సంపద అంతా ఈ రెండు వెండి కడియాలే. వాటినే ఇస్తున్నాను."

- అన్నది ఆమె.

ఆ వివరాలు విని గురుదేవులు భావోద్వేగంతో చలించిపోయారు. ఆ కడియాలను స్పృశిస్తూ వారిలా అన్నారు-

"మాతాజీ! మీ దానం అన్నిటికన్నా గొప్పది. ఇంత పెద్ద దానాన్ని మీరు తప్ప మరెవరు ఇస్తారు?"

ఆమెను ప్రశంసిస్తూ గురుదేవులు పలు వాక్యాలు పలికారు.

ఆ వృద్ధురాలు సజల నయనాలతో ఆయనవైపు అలా చూస్తూ ఉండిపోయింది.

గురుదేవుల దృష్టిలో - పని పరిమాణం కన్న భావ పరిమాణం మరింత మహిమ కలిగినది.

## భాషలకు అతీతులైన మనీషి

పూజ్య గురుదేవులు ఆంగ్లభాషను అర్థం చేసుకుంటారు. చదువుతారు. అంతే కాదు. నిర్దుష్టమైన ఉచ్చారణతో ఆంగ్లంలో మాట్లాడతారు. తపోభూమికి వచ్చేవారిలో పలువురు విదేశీయులు ఉండేవారు. కెనడా, రష్యా, జర్మనీలనుండి వచ్చిన వ్యక్తులతో సంభాషణ జరిపేవారు. జిజ్ఞాస తీర్చేవారు. శాంతికుంజ్ వచ్చిన తర్వాతకూడ ఈ క్రమం కొనసాగింది.

ఒక రోజున క్రొత్తగా వచ్చిన ఒక కార్యకర్త పై అంతస్థుకు వచ్చి ఇలా చెప్పాడు - "మెక్సికోనుంచి స్పానిష్ భాష విద్వాంసుడు వచ్చాడు. ఆయన భార్యకు ఆంగ్లభాష వచ్చు. కాని హిందీ రాదు. నేను దుబాసీగా వ్యవహరిస్తాను." "మంచిది వారిని తీసుకురా" - అని గురుదేవులు అన్నారు నవ్వుతూ.

వారు పై అంతస్థుకు వచ్చారు. సంభాషణను ప్రారంభిస్తూ ఆ విద్వాంసుడు స్పానిష్ భాషలో ఏదో చెప్పాడు. ఆ మాటలను ఆయన భార్య ఇంగ్లీషులోకి, కార్యకర్త హిందీలోకి అనువదించకముందే - పూజ్య గురుదేవులు ఆ మాటలకు సమాధానం చెప్పివేశారు. ఈ సంభాషణ అరగంటసేపు జరిగింది. అందరూ అవాక్కు అయినారు.

మనీషులు భాషల పరిధికి అతీతులుగా ఉంటారు. తమ గొప్పతనాన్ని ఎన్నడూ తమ నోటితో చెప్పుకోరు. ఈ

**చినిగిన చొక్కా అయినా తొడుక్కో; కానీ, మంచి పుస్తకం కొనుక్కో.**

వాస్తవం అందరికీ అప్పుడు అర్థమయింది.

## "మీరు నిజమైన ప్రజానాయకులు"

ప్రజలను విశ్వసించేవారిని ప్రజలు విశ్వసిస్తారు. ఈ విశ్వాసాల సంగమాన్ని తన హృదయపు లోతులలో కలిగి ఉన్న వ్యక్తి నిజమైన ప్రజానాయకుడు. ఈ సత్యం బ్రహ్మవర్చస్ శోధ్ సంస్థాన్ ప్రారంభోత్సవంలో ఆకృతి పొందింది.

ఆనాటి ఉత్తరప్రదేశ్ గవర్నరు జి.డి. తపాసీ ఉత్సవానికి విచ్చేశారు. పలువురు ప్రముఖులు ఉత్సవంలో పాల్గొన్నారు. మాటల సందర్భంలో గురుదేవులు వారితో ఇలా అన్నారు –

"మేము ప్రభుత్వంనుండి ధనాన్ని ఆశించము. ప్రభుత్వానికి స్వంత పనులు ఎన్నో ఉన్నాయి. ధనాభావం వల్ల ఆ పనులు సగంలో నిలచిపోతున్నాయి."

ఉత్సవం పూర్తయిన తర్వాత గౌరవనీయులైన గవర్నరు ఛలోక్తిగా ఇలా అన్నారు –

"ఆచార్యజీ! మీకు ప్రభుత్వంనుండి డబ్బు అక్కరలేదు. ధనవంతులను మీరు డబ్బు అడగరు. మరి మీకు డబ్బు ఎక్కడనుంచి వస్తుంది?"

ఛలోక్తికి జవాబుగా మరో ఛలోక్తి విసురుతూ గురుదేవులు ఇలా అన్నారు –

"నేను ఒక భూతాన్ని తయారు చేసి ఉంచాను. కార్యసాధకురాలైన భూతం అది."

ఆ మాట విని గవర్నరుగారు ఆశ్చర్యంగా ఆయనవైపు చూడసాగారు.

గురుదేవులు నవ్వుతూ ఇలా అన్నారు –

"మీరు మాకు ఆప్తులు కదా. ఆ భూతం పేరు మీకు చెప్పివేస్తాను. నా భూతం – భారత ప్రజలు."

ప్రజలమీద గురుదేవులకు ఉన్న అఖండ విశ్వాసాన్ని చూచిన గౌరవనీయ గవర్నరుగారి నోటినుండి ఈ మాట వెలువడింది –

"ఆచార్యజీ! మీరు నిజమైన ప్రజానాయకులు."

## ఏకాగ్రత + నిరాడంబరత్వం

గురుదేవులు ఒక కార్యక్రమం సందర్భంగా ఒక స్థలంనుండి మరొక స్థలానికి వెళ్లవలసి ఉంది. మొదటి స్థలంలోని కార్యకర్తలు ఆయన వెళ్ళడానికి ఏర్పాట్లు చేయడంలో నిమగ్నులై ఉన్నారు. ఎయిర్ కండిషన్డ్ కోచ్‌కి టికెట్ తీసుకోవాలనీ, అందువల్ల గురుదేవులు విశ్రాంతిగా ప్రయాణం చేయగలుగుతారనీ కార్యకర్తలలో ఒకరు అన్నారు. ఫస్ట్‌క్లాసు టికెట్ తీసుకోవాలని కొందరు వాదించారు. అందువల్ల విశ్రాంతితోపాటు ఆరుబయటి గాలి కూడ అందుతుందన్నది వారి అభిప్రాయం.

జరుగుతూన్న ఈ సంభాషణలోని కొన్ని మాటలు గురుదేవుల చెవిని పడ్డాయి. ఆయన వారందరినీ దగ్గరకు పిలచి ఇలా అన్నారు–

"ప్యాసింజరు రైలులో మామూలు తరగతి టికెట్ నాకు కొని తీసుకురండి. రిజర్వేషన్‌కూడ అవసరం లేదు. డబ్బు మిగులుతుంది. నేను విశ్రాంతిగా నా వ్రాత పని చేసుకుంటాను."

ఆరోజుల్లో నడుస్తూన్న రైలులో వ్రాయడం వారికి అలవాటు.

ఏనీ బీసెంట్ కూడ ఇలా రైలులో వ్రాసుకునేవారు. అయితే, ఆమెకు రైలులో స్వంత సెలూన్ ఉండేది.

ఏకాగ్రతకూ, మితవ్యయానికీ అద్భుత సమన్వయం ఇది. ఇలా సమన్వయం జరగడం బహుశా ఇదే ప్రథమం.

గాంధీజీ అనుచరులైన గురుదేవులకు ఈ నిరాడంబరత్వం శోభించింది.

★★★

**శోధించడం నిజమైన మతం.**

# మదురై అశ్వమేధ యజ్ఞం దృశ్యాలు



YUGASHAKTI GAYATRI (Telugu Monthly), April - 2006
RNI No. APTEL / 2000/1656. Postal Reg. No. L-II/RNP/H-HD-953/2006-08



# మధుర మీనాక్షి

If Undelivered please return to:
GAYATRI CHETANA KENDRA & MEDITATION CENTER,
Near Aswini House, H.P.Road, Moosapet,
Hyderabad - 500018, Ph : 040-30986922,09392506888.
E-mail:hyderabad.ap.in@awgp.org, info@aswini.com

Chief Editor : Dr. PRANAV PANDYA
Printed & Published By Sri B.CH.V.SUBBA RAO (Aswini)
(For SRI VEDAMATHA GAYATRI TRUST)
5-283, H.P.Road, Moosapet, Hyderabad-500 018.
Printeda at Bharathi Art Printers, Chikkadapally, Hyderabad - 20

Global Head Quarters : GAYATRI TEERTH, SHANTIKUNJ,
Haridwar - 249411 Ph: (01334) 260602, 261955, 260309 Fax : (01334) 260866,
E-mail : shantikunj@awgp.org, southindiazone@awgp.org, website : www.awgp.org

SUNDAR GRAPHICS : 9391030025